ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 461
వెల : రూ.25/-
ఆగస్టు 2023




జనసాహితి ప్రచురణ

కవిత

# మణిపూర్ కార్చిచ్చు

- ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ

**యాభై** నక్షత్రాల ఛత్రాన్ని భరించి
ఇంపీరియల్ డేగను భుజానికెత్తుకున్న
కాషాయ వామనుడి మిథ్యాపాదం
కశ్మీరాన్ని వేటాడేసి కార్పొరేట్లకు విందిచ్చాక
ఈశాన్యపు అక్కచెల్లెళ్ళ క్షేత్రాల మీద పడింది



పెట్టుబడి, కట్టుకథల అక్రమ సంబంధాల కార్ఖానాలు
డిజిటల్ సమ్మోహనాల మౌఢ్యకేళీ విన్యాసాలతో
ఆసేతు హిమాచలమూ మత మర్మాంగాలు మొలిపిస్తున్నాయి
'నార్యంతు పూజ్యంతే' మంత్ర ఘోషల మధ్య
నగ్న ఊరేగింపుల, మానభంగాల ధూపదీపాలతో
'విశ్వగురు'త్వపు బ్రహ్మరహస్యాలు వెలిగిపోతున్నాయి



వారు వీరు వేరువేరను పాలకుల కట్టుకథల మధ్య
వాకపల్లులు, కళింగనగర్లూ, చిన్నారి ఆసిఫాలూ....
ఇరోమ్ షర్మిలలు,.... ఈనాటి మణిపూర్లూ.....
కాకులను కొట్టి గద్దలకు వేసే మీ సిగ్గులేని ముఖాలను
శ్రమజీవులకు నిరంతరమూ చూపుతూనే ఉంటాయి

దేశభక్తి ముసుగులో, అబద్ధాల కంపులో
గోముఖం వెనుక దాగి ఉన్న మీ వ్యాఘ్రముఖం
గిరిపుత్రుల భూములను కాటేసేందుకు
ఎడతెగని కార్చిచ్చులను రగిలిస్తున్నది
చీమలు పెట్టిన పుట్టలు పాములవేనని భ్రమిస్తున్నది



దళితులంటూ, గిరిజనులంటూ, స్త్రీలంటూ, మతమంటూ
ప్రజలను చీల్చి విడదీసే మీ పన్నాగాలన్నీ
ఐక్యమైన శ్రమజీవుల పిడికిలి పోట్లతోనే బద్దలౌతాయి
అడ్డుగోడలు పగలేయడమే మా పని అంటూనో....
బలవంతమైన సర్పము చలిచీమల చేతజిక్కి.... అంటూనో
కవుల కలాలు శ్రమజీవుల గళాలై ఎల్లెడలా వినవస్తున్నాయి

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

461

సంపుటి : 47

సంచిక : 01

ఆగస్టు 2023

*website :* **www.prajaasaahithi.com**

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | మణిపూర్ మారణహోమం బాధ్యులు – కార్టూన్ | అంతర్జాలం నుండి | .....01 |
| రెండవ అట్ట | : | మణిపూర్ కార్చిచ్చు (కవిత) | – ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ | .....02 |
| మూడవ అట్ట | : | ఇప్పుడు మణిపూర్ ఒక ఆతంకీ (కవిత) | – హనీఫ్ | .....35 |
| నాల్గవ అట్ట | : | దేశ విభజన (కవిత) ఆంగ్లం : డబ్ల్యు.హెచ్. ఆడెన్ | అనువాదం : కొత్తపల్లి రవిబాబు | .....36 |
| సంపాదకీయం | : | ఉమ్మడి పౌరస్మృతి – నినాదం వెనుక ప్రయోజనాలు ఎవరివి?! | | .....05 |
| కథ | : | కొత్త వార్త | – శారద | .....07 |
| వాణిజ్య ప్రకటన | : | బి.వి. సుబ్బయ్య హైస్కూల్ | | .....10 |
| ప్రకటన | : | మణిపూర్ ఘటనపై | | .....13 |
| పుస్తక సమీక్ష | : | 'స్వరాజ్యస్ఫూర్తి @ 75' | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....15 |
| ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (12) అనితా దేశాయ్ నవల 'స్పష్టమైన పగటి కాంతి' | – కొత్తపల్లి రవిబాబు | .....11 |
| జాతీయ అక్షరయోధులు | : | ఓం ప్రకాశ్ వాల్మీకి | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....20 |
| గల్పిక | : | మౌనం | – శంకరం | .....21 |
| పుస్తక పరిచయం | : | అడివి బాపిరాజు వ్యక్తిత్వం – సాహిత్యంపై రెండు సంపుటాలు | | .....27 |
| వ్యంగ్యం | : | మణిపూర్ తగలబడ, ఎంత తిప్పలు పెడుతోంది!! | – చెరుకూరి జ్యోతి | .....31 |
| సినిమా సమీక్ష | : | 'ఒప్పెన్ హైమర్' (2023) | – బాలాజీ (కోల్‌కతా) | .....23 |
| కవితలు | : | వంశీకృష్ణ (**09**); దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (**14**); రవితేజ (**21**); సాంబమూర్తి లండ (**22**) చింతాడ కృష్ణారావు, ఏటూరి నాగేంద్రరావు (**29**) | | |
| వివిధ | : | ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**06**); కృతజ్ఞతలు (**22**) వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**30**); చైతన్యవాహిని (**32**) ఈ పుస్తకాలు అందాయి (**33**) | | |
| సంతాపాలు | : | శ్రీరమణ, లింకన్ బాస్టిన్ (**04**), లహోరీ రామ్ బాల్లీ (**34**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30-7-6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER

ISSN 0971-278X

LIBRARY OF CONGRESS

LCCN 94903393

*రచనలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

**‘ప్రజాసాహితి’**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**“అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై ‘ప్రజాసాహితి, విజయవాడ’ అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |


ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# కథా రచయిత శ్రీరమణ మరణం



**కథారచయిత,** పలు వ్యంగ్య రచనల కర్త, పలు పత్రికలలో వారం వారం కాలమ్‌లు నిర్వహించిన సాహితీవేత్త శ్రీరమణ తన 71వ యేట 19-7-2023న హైదరాబాదులో మరణించారు. ఆయన తెనాలి సమీపాన గల వరహాపురం గ్రామంలో 21-9-1952న జన్మించారు. ఆయన అసలుపేరు వంకమామిడి రాధాకృష్ణ. దత్తత తర్వాత పేరు కామరాజు రామారావు. ఆయన కలంపేరు శ్రీరమణతోనే తెలుగు సాహిత్య లోకానికి సుపరిచితులు.

పదికాలాలు నిలిచిపోయే కొద్ది కథలు మాత్రమే ఆయన రాశారు. ‘పెళ్ళి’, ‘ధనలక్ష్మి’, ‘వరహాల బావి’, ‘సోడానాయుడు’, ‘మిథునం’, ‘నాలుగో ఎకరం’ మొదలైన ఆయన కథలు ఆణిముత్యాలు, ఆయన చాలా పత్రికలకు వారం వారం శీర్షికలు రాశారు. వాటిలో ముఖ్యమైనవి : ‘మొగలిరేకులు’, ‘హాస్యజ్యోతి’, ‘రంగులరాట్నం’, శ్రీఛానెల్ ‘హాస్యజ్యోతి’. ఆయన రాసిన పేరడీలు, మానవ సంబంధాలు శీర్షికతో పత్రికలో రాసిన వ్యాసాలు, ‘వెంకట సత్య స్టాలిన్’ శీర్షికతో ‘నవ్య’లో రాసిన వ్యాస పరంపర పాఠకులను ఎంతో ఆలోచింపచేశాయి. ‘పత్రిక’ మాసపత్రికకు గౌరవ సంపాదకులుగా పనిచేశారు. 1997లో రాసిన ‘మిథునం’ కథ, బాపు చేతిరాతతో అచ్చయింది. చలనచిత్రంగా కూడా వచ్చింది.

కథారచనలోనూ, పేరడీల వ్యంగ్య రచయితగానూ, ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించినవాడిగానూ పేరుపొందిన ‘ప్రజాసాహితి’ మిత్రుడు శ్రీరమణ అకాల మరణానికి ‘ప్రజాసాహితి’ సంతాపం తెలియచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తోంది.

# హక్కుల కార్యకర్త
# లింకన్ బాస్టిన్ మరణం

**ఇండియన్** లాయర్స్ అసోసియేషన్ చెన్నై శాఖకి అధ్యక్షుడిగా, చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న హక్కుల కార్యకర్త లింకన్ బాస్టిన్ 10 జూన్ 2023న గుండెపోటుతో మరణించారు. సంపన్న కుటుంబంలో జన్మించినా, సాధారణ పౌరునిగా జీవిస్తూ మత్స్యకారుల హక్కుల కోసం సుదీర్ఘకాలంగా ఆయన పోరాడారు.

లింకన్ జాలర్లకు రాజకీయ పాఠాలు బోధించి వారిని ఉద్యమకారులుగా తయారుచేశారు. జాలర్లను ‘సీ ట్రైబ్స్’గా (సముద్ర తెగలు) గుర్తించాలని పోరాడారు. రచయితగా వారి సమస్యలపై పుస్తకాలు రాశారు. సి.పి.ఐ అనుబంధ సంస్థలలో పనిచేస్తూ, ఆ పార్టీ పాలక పార్టీలతో జట్టు కట్టినపుడల్లా పార్టీని నిక్కచ్చిగా విమర్శించేవారు.

కోర్టు వేదికలనే ఉద్యమకార్యాచరణ ప్రాంతాలుగా మార్చుకున్న బాస్టిన్ కోర్టు ఆవరణలోనే గుండెపోటుతో మరణించారు.

సంపాదకీయం

# ఉమ్మడి పౌర స్మృతి - నినాదం వెనుక ప్రయోజనాలు ఎవరివి?!

**విచ్ఛిన్నం** అంతిమ దశకు చేరుకుంది. అందుకు తిరుగులేని దాఖలా – ఫాసిస్టు తరహా గుండాయిజం. పరమ నిరంకుశ రాజకీయ విధానాల ద్వారా తప్ప దోపిడీ పీడనల ఆర్థిక, సామాజిక వ్యవస్థలను కొనసాగించలేని దశకు చేరుకున్న సంక్షుభిత కాలపు వ్యక్తీకరణ యిది. ఈ నేపథ్యంలో నుంచి ఉమ్మడి పౌరస్మృతి అమలు అనే అంశాన్ని పరిశీలించాల్సిన పరిస్థితి వచ్చింది. దీని వెనక ఎవరెవరి ప్రయోజనాలు ఉన్నాయో కూడా లోతుగా పరిశీలించి, జరుగుతున్న సంఘటనల వెనుక ఉన్న అసలు సత్యాన్ని సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యేట్లు చేయాల్సిన కర్తవ్యం ఈ దేశ ప్రజామేధావులు స్వీకరించాలి.

2015లో 21వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతి సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి జస్టిస్ బల్‌బీర్‌సింగ్ చౌహన్ నేతృత్వంలో ఏర్పడింది. ఆ కమిషన్ ఈ అంశాన్ని లోతుగా పరిశీలించిన తరువాత, **ఉమ్మడి పౌరస్మృతి అమలు ఏ విధంగా చూసినా అవసరమూ కాదు, వాంఛనీయము కాదు** అని తేల్చేసింది. అంతేకాకుండా ఇదంతా ప్రజల సమయాన్నీ, ధనాన్నీ వృథా చేయడమేనని వ్యాఖ్యానించింది. ఇప్పుడు లా కమిషన్‌ను దాని యితర విధుల నుండి, ప్రాధాన్యతల నుండి పక్కకు మళ్లించటానికి భాజపా ప్రభుత్వం పూనుకుంది. ప్రధాని మోడీ ప్రభుత్వం మొండిగా ఉమ్మడి పౌరస్మృతి గురించి మళ్లీ ఆలోచించమని, దాన్ని సాధ్యం చేసే అంశాలు పరిశీలించమనీ, కాలం తీరిన జస్టిస్ రీతు రాజ్ అవస్థీ నేతృత్వంలో వున్న 22వ లా కమిషన్ కాలాన్ని 2024 ఆగస్టు 31 వరకు పొడిగించింది. ఒక దేశం, ఒకే చట్టం అనే పేరిట మోడీ ప్రభుత్వం ఈ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలని పంతం పట్టింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ భోపాల్‌లో తమ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ "ఒకే ఇంట్లో ఒకరికి ఒక చట్టం, మరొకరికి మరో చట్టం ఉంటే, ఆ కుటుంబాన్ని నడపగలమా? ద్వంద్వ వ్యవస్థలతో ఒక దేశాన్ని నడపగలమా?" అన్నారు. ఇది ప్రధానంగా ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి, చేసిన వ్యాఖ్య! రాజ్యాంగం అమలుచేయమని సూచించిన ఆదేశిక సూత్రాలలోని సామాజిక అసమానతలను తొలగించటం గురించిగానీ, భారత రాజ్యాంగ నిర్మాయక సభ ముగింపు ప్రసంగంలో డా॥ అంబేద్కర్ ఆర్థిక అసమానతల పట్ల చేసిన హెచ్చరికగానీ నేటి పాలకులు పరిగణనలోకి తీసుకోవడం లేదు.

అనేక మతాల, కులాల, భాషాజాతుల బహుళ సాంస్కృతికవాదానికీ, ఒకే జాతి, మతం, భాష అనే కేంద్రీకృత సాంస్కృతికవాదానికి మధ్య ప్రధాన సంఘర్షణ నేడు చూస్తున్నాం. మెజారిటీ ప్రజల సంస్కృతిని, మైనారిటీ ప్రజలపై రుద్దకుండా చూడడమే బహుళ సాంస్కృతికవాదం. ఇక్కడ మనకి ఆశ్చర్యం కలిగించే అంశం ఏంటంటే, మెజారిటీ ప్రజల హిందూ సంస్కృతిలో ఏ అంశాన్నీ వేలెత్తి చూపడానికి అస్సలు వీలులేదు అని వాదించే మతతత్త్వవాదులే నేడు ఉమ్మడి పౌరస్మృతి అమలు కోసం అర్రులు చాచడం! కోరలు, కొమ్ములు పదును పెట్టుకుని, మతతత్త్వ శక్తులు ఈ ఉమ్మడి పౌరస్మృతి అమలు కోసం ఎగబడుతున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పురోగమి భావాల స్థానంలో ఈ సంకుచిత మతతత్త్వశక్తులు స్థాపించాలనుకుంటున్న సంస్కృతి ఎటువంటిది? అపారమైన వైవిధ్యాలు, అసమానతలు ఉన్న సామాజిక సాంస్కృతిక జీవనరంగాలలో ఉమ్మడి పౌరస్మృతి కల్పించే అభద్రతా సమస్యకు ఎవరు జవాబుదారీగా ఉంటారు? వివాహ విషయాలలో, వారసత్వ హక్కులకు సంబంధించిన విషయాలలో, ఆస్తుల పంపకాల విషయాలలో, దత్తత విషయంలో, ఉమ్మడి పౌరస్మృతి కారణంగా చోటు చేసుకోబోతున్న పౌర సంబంధమైన, నేర సంబంధమైన చిక్కు ముడులకు ఈ ఐదేసేళ్ల ప్రభుత్వాలు బాధ్యత పడతాయా? ఎంతో కర్కశంగా వ్యాపార దృక్పథంతో పరిపాలించిన బ్రిటిష్ వలస పాలకులు 1857 సిపాయిల తిరుగుబాటు తరువాత సామాజిక విషయాల్లో జోక్యం చేసుకోవడం తగ్గించుకున్నారు. అయితే అప్పటికే విభిన్న ఆహార, వివాహ, ఆచార, ఆరాధనా భేదాలున్న ఆదివాసులు, దళితుల నుండి వేలాది కులాలు, తెగలుగా వుండిన వారినందరినీ హిందూ మతస్తులని పేరుపెట్టి, వారందరినీ ఒకే చట్ట పరిధిల్లోకి బ్రిటీషువారే తెచ్చారు. ఆర్థిక వ్యత్యాసాలే కాక సాంఘిక అసమానతలు కూడా వీరి నడుమ నేటికీ సాగుతున్న వాస్తవం కళ్ళు మూసుకున్న కబోదులకు తప్ప అందరికీ తెలుసు.

భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, భిన్న భౌగోళిక స్థితిగతులుతో నిండిన వైవిధ్యభరితమైన భారత సమాజంలో ఇప్పటికే ఎన్నెన్నో వైరుధ్యాలను, తమ రాజకీయ ప్రయోజనాల కోసం, ఆధిపత్యం కోసం, పాలకులు పెంచి పోషిస్తున్నారు. ఉమ్మడి పౌరస్మృతి అమలు పర్యవసానాలు కేవలం ముస్లింలకు మాత్రమే పరిమితం కావు. ఉపఖండ లక్షణాలున్న భారతదేశం అపారమైన అటవీ సంపదతో, ఆదివాసీ భిన్న సంస్కృతులతో తులతూగుతోంది. ఈ ఉమ్మడి పౌరస్మృతి త్రిపుర, అస్సాం, మిజోరాం, మేఘాలయ మొదలైన నిర్దిష్ట ప్రాంతాలకు వర్తించే రాజ్యాంగంలోని 224వ అధికరణం ఆరవ షెడ్యూల్ రద్దు అవడానికి తోడ్పడుతుంది. ఈ షెడ్యూలు ప్రత్యేకంగా ఆయా ఆదివాసీ ప్రాంతాలలో స్థానిక పాలనకు, వివాహ, ఆస్తి హక్కులకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితులకు సంబంధించినది. అయితే, ఉమ్మడి పౌరస్మృతి ద్వారా ఆ ప్రత్యేకతలన్నీ రద్దు అవుతాయి. గవర్నర్ అనుమతితో శాసనాలు

కూడా రూపొందించుకునే అవకాశం ఉన్న ఈ ఆదివాసీ ప్రాంతాలు తమ కనీస హక్కుల్ని కోల్పోతాయి. ఇప్పటికే తూర్పు భారత ఆదివాసీ తెగలు దళారీబూర్జువా పాలకవర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల వల్ల తీవ్ర భౌతిక, సాంస్కృతిక, ఆర్థిక దాడులకు, తరిమివేతలకు గురవుతున్నాయి. తీవ్రమైన విస్తాపనలకు ఇక్కడి ప్రజలు నిరంతరం బలవుతున్నారు. ఇక్కడ ఉన్న అటవీ భూములను, ఆదివాసీల జన్మహక్కుగా ఉన్న సహజ సంపదలను వారివి కాకుండా చేయటానికి రిజర్వుడు చట్టాలను మార్చడానికి దళారీ పాలకవర్గాలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. మణిపూర్‌లో మారణకాండకు మూలాలు అక్కడే వున్నాయి. ఆ ప్రయత్నాలు చేస్తూనే భావోద్వేగాలతో పక్కదార్లు పట్టించడానికి మరోవైపు నుంచి ఎత్తుకున్న కొత్త వ్యూహమే ఉమ్మడి పౌరస్మృతి.

ఆదివాసీ తెగల వివాహ, వారసత్వ, భూమి హక్కులను సరికొత్త చట్టాల ద్వారా రద్దు చేయడానికి, వారిని అడుగడుగునా చట్టం ఉల్లంఘించిన వారుగా ఆరోపించి జైళ్ళపాలు చేయడానికి ఉమ్మడి పౌరస్మృతి అవకాశం యిస్తుంది. ఆనాటి డంకెల్ ఒప్పందం, గాట్ ఒప్పందం, ప్రపంచ వాణిజ్య సంస్థతో చేసుకున్న ఒప్పందాల, అంతర్జాతీయ ద్రవ్యనిధితో చేసుకున్న ఒప్పందాల చీకటి గుహల్లోంచి పుట్టుకొచ్చిన 1991 నాటి నూతన ఆర్థిక విధానాలు ఇవాళ గానీ, రేపు గానీ అధికారంలో ఏ ప్రభుత్వాలు ఉన్నా, ఏ జెండాలు మారినా అమలు జరగాల్సిందే. అందుకు బిజెపి అతీతమేమీ కాదు. కాకపోతే క్రూరత్వంలో, నిస్సిగ్గులో సామాజిక విద్వేషాలు పెంచే కళలో భేదాలు అంతే!! మోడీ ప్రభుత్వం ఆ ఒప్పందాల అమలు కోసం, అందులో భాగంగా ఒకవైపు ఉమ్మడి పౌరస్మృతిని, మరొకవైపు జాతి నిర్మూలననూ సాగించటం ద్వారా కార్పొరేట్ శక్తుల ముందు సాగిలపడటాన్ని నిస్సిగ్గుగా రుజువుపరుచుకుంటోంది.

నిబద్ధతతో, అంకితభావంతో రచయితలు, కళాకారులు, ప్రజల పక్షం వహిస్తున్న మేధావులు కళ్ళ ఎదుట వున్న వాస్తవాలను మధించి, సత్యాలను నిరూపించి, ఉద్యమస్ఫూర్తితో మణిపూర్‌తోసహా ఆదివాసీల, మత మైనారిటీల రాజ్యాంగబద్ధ హక్కుల సాధనకు అండగా నిలవాలి.

**23.07.23** ✺

# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంచిక : 1, సంపుటి : 17, ఆగస్టు 1993

**చిత్తప్రసాద్** భట్టాచార్య గీసిన కరువు చిత్రం ముఖచిత్రంగా వెలువడిన కరువుపై ప్రత్యేక సంచిక ఇది. "ప్రజా జీవనాన్నీ, సంస్కృతినీ విధ్వంసం చేస్తున్న కరువును సృష్టిస్తున్న స్వార్థశక్తులను ప్రతిఘటించటానికి నిరాశ, నిస్పృహల పాలైన జనావళిని చైతన్యపరచవలసిన బాధ్యత ప్రతి దేశభక్తుని మీద వున్నది" అంటూ కరువుపై సంపాదకీయాన్ని ప్రచురించారు. "జానపద గేయాల్లో రాయలసీమ కరువు" గురించి మల్లెల నారాయణ రాశారు. శాంతి నారాయణ రాసిన "తాలుగింజలు", బాలకొండ ఆంజనేయులు రాసిన "ముళ్ళదారి" కథలను ప్రచురించారు. సింగమనేని నారాయణ సంకలనం చేసిన "సీమ కథలు"ను "నీళ్ళు లేని బీద నాగరికతను ఆర్తితో చిత్రించిన కథలు" అంటూ డా॥ సూర్యసాగర్ సమీక్ష చేశారు. "తాగబోతే నీళ్ళులేక తడిగొంతులారిపోయే" అనే వ్యాసాన్ని వి. కోటేశ్వరరావు రాశారు. "శ్రీకాళహస్తి మహత్మ్యము" గ్రంధముకు కరువుకు గల సంబంధాన్ని తెలియచేస్తూ "కరువు – కాళహస్తి మహత్మ్యము" అనే వ్యాసాన్ని కాత్యాయని విద్మహే రాసారు. "కరపత్రాలు – కదిలే చరిత్ర" శీర్షికలో ఆం.ప్ర. రైతుకూలీసంఘం నందిగామ ఏరియా కమిటీ విడుదల చేసిన "కరువు ప్రాంతాల ప్రజల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండించండి" కరపత్రాన్ని ప్రచురించారు. మునిపల్లె రాజు, కె. సభా, స్వామి, సింగమనేని నారాయణ, కేతు విశ్వనాథరెడ్డి, చక్రవేణు, మహేంద్ర తదితరులు రాసిన కథలను ఉదహరిస్తూ – "కథా సాహిత్యంలో కరువు కాటకాల రాయలసీమ" వ్యాసాన్ని మధురాంతకం రాజారాం రాశారు. విద్వాన్ విశ్వం రాసిన 'పెన్నేటి పాట' పుస్తకాన్ని పరిచయం చేస్తూ జానుమద్ది హనుమచ్ఛాస్త్రి "రాయలసీమ కరువుల గాథ – పెన్నేటి పాట" అనే వ్యాసం రాశారు.

'కరువు కోరల్లో నల్లగొండ' వ్యాసాన్ని నిరంజన్ రాశారు. "రాయలసీమలో పచ్చదనం ఎలా సాధించవచ్చు?" అనే వ్యాసాన్ని సర్దేశాయి తిరుమలరావు రాశారు. "పెన్నేటి కతలకు ప్రేరణ" గురించి పి. రామకృష్ణారెడ్డి రాశారు. "కరువు గురించి" ప్రజాసాహితి వ్యాసాన్ని, తను రాసిన "నీళ్ళు" కథకు ప్రేరణ" గురించి పెద్దిభొట్ల సుబ్బరామయ్య, "విముక్తి" కథ నేపథ్యం గురించి సింగమనేని నారాయణ వ్యాసాలను ప్రచురించారు. సంపత్ రాసిన "పవనమా! పవనమా!", బండ్ల మాధవరావు రాసిన "మా వూరి దృశ్యం", సూర్యతేజ రాసిన "ఆకలంటే అర్థం నువ్వే", ఎ.ఎన్. రాసిన "ఎడారి పూలు ఎరుపెక్కితే", బి.జి. రాసిన "ఎవడున్నాడురా", చైతన్యప్రకాశ్ రాసిన "నన్నెవరని అడక్కండీ", బి. గంగాధర్ రాసిన "అస్థిపంజరాల సోమాలియా", వియ్యస్సార్ కాండూరి రాసిన "కరువు చెట్టు" కవితలనూ, సుగాలీలు పాడుకునే కరువు పాట "ఏడుపు పాటను", నిరంజన్ రాసిన "కరువు పాట"ను, తిరునగరి రామాంజనేయులు రాసిన "కరువులో దేశమా?", ఎం.జి.ఎం. రాసిన "రాళ్ళసీమ కూలన్న", అప్పన్నగారి గోపాలరావు రాసిన "పల్లె వున్నది – పని వున్నది" పాటలను ప్రచురించారు. పి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహించిన పిల్లల శీర్షికనూ, జనసాహితి కార్యక్రమాల వివరాల చైతన్యవాహినిని ప్రచురించారు. ఈ సంచిక రెండవ కవరుపేజి మీద డా॥ చెరుకు సుధాకర్ రాసిన "జలోజ్వల" కవిత, మూడవ కవర్‌పేజి మీద నిఖిలేశ్వర్ రాసిన "అహోబిలంలో దాగిన పెన్నా.....!" కవిత, నాల్గవ కవరుపేజీపై పి. నాసరయ్య రాసిన "పోరే మనకు దారి" పాటను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 108 పేజీలు వెల : రూ. 8/–

✺

కథ

శారద 68వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ....

# కొత్త వార్త



- శారద

**కొత్తగుడా** గ్రామంలో కోటయ్యగారికి ప్రజల్లో మంచి పలుకుబడి వుంది. ఆయన సత్ప్రవర్తనుడు. తెలంగాణా పోరాటం ప్రారంభమైన తర్వాత, ఆయన ఇల్లూ, గ్రామంలో చాలామంది ఇళ్ళూ నిజాం సైన్యం చేత, ఇత్తేహాదుల్ గూండాల చేత దోచుకో బడ్డాయి. కోటయ్యగారు, శిస్తులు చెల్లించేసి, శాంతంగా వుండిపోదామని ప్రజలకి చెప్పాడు. చెల్లించకపోతే గ్రామాన్ని మొత్తం నాశనం చేస్తారేమో వాళ్ళు అని వాదించాడాయన. గ్రామపటేల్ జబర్దస్తీగా వసూళ్ళు ప్రారంభించాడు గూడాను. కోటయ్య కొడుకు నాగప్ప శిస్తు చెల్లించడానికి వప్పుకోలేదు. చెల్లించిన శిస్తు ఎన్నిసార్లు చెల్లించాలి? అన్నాడతను. అతని అభిప్రాయం గ్రామములో చాలామందికి వుంది. వాళ్ళంతా కలిసి ఒకనాడు మాట్లాడు కున్నారు. రశీదులివ్వకుండా ముసలాళ్ళని బెదిరించి మళ్ళీ శిస్తు వసూలు చేస్తాడా ఈ పటేల్? ఎబ్బే.... నైజాం కావలి కుక్క.... అని గట్టిగా వాదించాడు నాగప్ప. అవును.... నిజాం రాక్షసుడి పొట్టా.... ఆ మిలటరీ రాక్షసుల పొట్టలూ, సారాతోటీ, కోడిగుడ్లతోటీ నింపటానికేగా ఈ వసూళ్ళు....? నాగప్ప వాదనని యువకులంతా అంగీకరించారు. అందరూ ఆంధ్ర మహాసభ మెంబర్లేనాయె.

గ్రామపటేల్.... శిస్తు వసూలు చేయలేక పోయినాడు. ఎవరిస్తారు? అతనికి వళ్ళు మండింది. మండి ఎవర్నేం చేస్తావు పో!.... అన్నారు ప్రజలు. వసూలైన శిస్తులు మళ్ళీ వసూలు చేయడానికి యెన్ని గుండెల్తో వొచ్చావు? ఎక్కువగా మాట్లాడితే తంతామన్నారు యువకులు.

రెండో రోజుకి గ్రామం మంచి నిద్రలో వుంది. రాత్రి 11 గంటలవుతోంది. అష్టమి చంద్రుని గుడ్డివెన్నెట్లో, చడీచప్పుడు లేకుండా నిజాం దొంగ సైన్యం గ్రామంలో ప్రవేశించింది. గ్రామ పొలిమేరల్లోనే సైన్యాన్ని ఒక పన్నెండేళ్ళ కుర్రాడు హఠాత్తుగా చూసాడు. ఆ కుర్రాడు, సైన్యానికి అగుపడకుండా మెల్లిగా చీకట్లో మాయమైనాడు గ్రామంలోకి. సైన్యం బొంయ్.... బొంయ్‌మని మొరిగే కుక్కల్ని తుపాకీ మడమలతో చంపి గ్రామంలో జొరబడ్డారు.

## 2

నైజాం దొంగ సైన్యానికి దాదాపు కష్టకాలం ప్రాప్తించింది. 1930కీ, 1948కీ వున్న తేడా వాళ్ళకేమీ గోచరించక పొరపడ్డారు. దోపిడీదార్లకి కాలంలోని మార్పు గోచరించదేమో బహుశా. గ్రామపటేల్ సైన్యానికి ప్రతి ఇల్లూ ప్రత్యేకంగా వర్ణించి చేతిలాంతర్‌తో ముందుకి వస్తున్నాడు.

సైన్యం గ్రామంలో ప్రవేశించిన 10 నిమిషాలకే ప్రజల్లో అపూర్వమైన చైతన్యం సంచలనం తుఫానులా వ్యాపించింది. ఈ సంగతి గ్రామస్థులకి తప్ప సైన్యానికేమీ తెలియక పోవడం, వాళ్ళ మౌఢ్యమని అంటానికేమీ ఆస్కారం లేదు. గెరిల్లా దళం యొక్క నైపుణ్యమే కారణం.

గ్రామపటేల్, సైన్యంలో పెద్దవాడూ ఇత్తేహాదుల్ గూండా, ఏ ఘోరాలకీ వెనుదీయని పిచ్చికుక్క మొహిద్దీన్‌ని సాభిప్రాయంగా పలకరించి,

"మొహిద్దీన్, మన ఘనత వహించిన ప్రభుత్వానికి శిస్తులు ఎగ్గొట్టే అంత ధైర్యానికి కారణం ఎవరో నేను చూపుతాను. వాణ్ణి...." అని ఇంకేదో అనబోతున్నాడు.

మొహిద్దీన్ ఆ రాత్రి గుడ్డివెలుగులో, నిశ్శబ్దమైన బజారు అదిరేట్టు పెద్దగా నవ్వి, "వాడ్కీ.... నడి బజారుమే హిజ్ ఎక్సలెన్సీ కేలియే.... ముక్కలు చేస్తాం" అన్నాడు బొంగురు గొంతుతో.

గ్రామపటేల్ ముసి ముసి నవ్వులు నవ్వాడు. "మంచి మాట అన్నావు. కాని వాడితో చాలామంది వున్నారు సుమా!" అని హృదయాంతరాళంలోని భయాన్ని గంభీరమైన మాటల్లో వెలిబుచ్చాడు.

మొహిద్దీన్ క్రూరమైన కళ్ళు అష్టమి చంద్రకాంతిలో ఎర్రగా మెరిసాయి. భయంకరంగా తుపాకీ మడమ నేలకేసి బాది, "కుచ్ ఫరవానహి! హం, భీ వంద మందే వున్నాం!" అన్నాడు. తన వెనకాల నడుస్తూ, లోగడ గ్రామాల్లో ఇలాంటి పన్లు చేసి, గెరిల్లాల చేత నానా తిప్పలూ పడి చచ్చిన సైన్యం దుర్గతి జ్ఞాపకం వొచ్చి, భయంతో వొణుకుతూ హంస నడకలు నడుస్తున్న సైనికుల్ని గంభీరంగా చూస్తూ.

పటేల్ నడక మందగించింది. సైన్యం ఆగింది. లాంతర్ పైకెత్తి "ఈ ఇల్లే వాడిది...." అన్నాడు గ్రామపటేల్ ఒక పెద్ద యింటిని చూపి. మాట పైకి రాకముందే తెరిచిన ఇంట్లో దూరే పూరకుక్కల్లాగు, సైన్యం కోటయ్యగారింట్లో జొరబడ్డది.

ఇంట్లో ఎవరూ లేరన్నట్లు బావురు మంటోంది. ఇంటి మధ్య లాంతరు మాత్రం సన్నగా వెలుగుతోంది. నైజాం గుండెల్లో కుంపటిలా మొహిద్దీన్ హూంకరించాడు పెద్ద లొట్టి పిట్టలాగు.

సైన్యం కదలిక మామూలుగా లేదు.... వాళ్ళు బయలుదేరేటప్పుడు వున్న టీక్ టాక్ నడక మారి, దాని స్థానే కిరకిర శబ్దం, గుసగుస మాటలూ వినిపిస్తున్నాయి.

మొహిద్దీన్ ఇంకా పెద్దగా అరిచాడు. లాంతర్ అదిరి టపటపమని ఎగిరింది. సైన్యంలో మొత్తం ఎనభై మంది వున్నారు. ఆ పెద్ద ఇంట్లో ఎనభైమందీ ఇరుక్కుని ఒకర్నొకరు తోసుకుంటూ సోదా

ప్రారంభించారు. పెద్ద భోషాణ పెట్టిని ఒకడు చెయ్యి పెట్టి దాన్లోంచి పాతగుడ్డలూ, కాయితాలూ, విరజిమ్ముతున్నాడు. ఒకడు గాదెలు పడగొట్టాడు. అన్నీ దాదాపు ఖాళీగా వున్నాయి. మనిషి స్పర్శే వాళ్ళకెక్కడా తగల్లేదు.

మొహిద్దీన్ మరీ ఉగ్రుడై ఎగురుతున్నాడు, ఆరిపోతున్న లాంతర్‌లా. తుపాకీలున్నాయి కాని ఎవర్ని కాల్చేట్టు?.... దోపిడీ చేయటానికి ఏమున్నాయి? కోపం హెచ్చి సైనికుల్ని తన్నాడు, మనుషుల్ని వెతకమని.

## 3

అర్ధరాత్రి సమీపిస్తోంది. కోటయ్యగారి ఊరికి పదిగజాల దూరంలో వున్న కోటయ్యగారి చావిడిలో గ్రామ యువకుల సమావేశం అతి నిశ్శబ్దంగా కటికి చీకట్లో సాగుతోంది. అక్కడేం నిర్ణయం జరిగిందో, అక్కడ సన్నగా వీస్తున్న గాలికే తెలియడంలేదు. పదినిమిషాలు అయినాయి. చావిడి నుంచి ఒక్కొక్క నిర్దిష్టమైన నీడ మృత్యువులా కదిలి కోటయ్యగారింటివేపుకి చీకట్లో మాయమౌతోంది. ప్రజాసేవకుల నిశ్వాసాలు వినిపించకుండా గాలి 'రివ్' మని వీస్తూ శబ్దం చేస్తోంది.

దోపిడీ దొంగల సోదా ఇంకా సాగుతోంది. ఇంటిలోపల మొహిద్దీన్ అరుపులూ అట్టహాసాలూ సైనికుల భయంకరమైన అస్పష్ట కోలాహలం.... తుపాకీలు ఒకదాన్నొకటి రాసుకుంటున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది.

ఇంటిబైట రెండొందల నీడలు చేతుల్లో తుపాకీలూ, పెద్దబడితెలూ పట్టుకుని కదులుతున్నాయి. ఒక బలిష్టమైన నీడ మెల్లగా, ఇంటి పెద్దవాకిలి తలుపు గొళ్ళెం బిగించింది. దొడ్డి తలుపులు గొళ్ళేలు కూడా బిగించిన శబ్దం లోపల సోదా జరుపుతున్న హంతకులకి వినిపించింది. సైనికుల్లో అదివరకల్లా అజ్ఞాతంగా వున్న భయోత్పాతం గప్పున అంటుకున్నది. ఆ క్షణాన వాళ్ళకేం తోచటంలేదు. గ్రామ పటేల్ భయకంపితుడై, "మొహిద్దీన్.... మొహిద్దీన్.... తలుపు.... తలుపు....." అంటున్నాడు నత్తిగా. అతని చేతిలో ఆరిపోయిన లాంతర్ గడగడ వొణికి ప్రాణభీతితో.... కిందపడి ముక్కలయింది.

సైనికుల గుండెల్లో నైజాం స్పెషల్సు పరుగెత్తుతున్నాయ్. తాము అనుకున్నదేమిటి? జరిగిందేమిటి?.... తమకి సంఘ మరణం తప్పదల్లే వుంది....

బైట నీడలు ఒక్కసారి కాగడాల వెలుగులో గప్పున కన్పించాయి. గ్రామం దాదాపు అక్కడే వుంది. నిశ్శబ్దం బద్దలై ఒక్కసారి నినాదాలుగా మారింది. ఆ నినాదాలు ఇంట్లో నిజాం నీచులకి అనేక పూర్వ సంఘటనల్ని జ్ఞప్తికి తెచ్చి వాళ్ళ జీవితాశని వమ్ము చేస్తొన్నాయి. వాళ్ళు దిగ్భ్రమ చెందారు.

"కిటికీల్లోంచి కాల్చండి ఆ పురుగుల్ని" అన్నారు ప్రజల్లో ఒకరు.

"వద్దు – ఈ దుష్టమృగాల కోసం, నీచ కీటకాల కోసం విలువైన తుపాకీ మందును ఖర్చు పెట్టడం అనవసరం... ఇల్లు నాల్గు పక్కలా అంటించండి. లోపలే కుమిలి నశిస్తాయి.... ఇంకెవ్వరికీ అపకారం చేయకుండా" అన్నాడు నాగప్ప.

ఇంట్లో సైనిక పిశాచాలు తలుపు వుతక లెత్తే ప్రయత్నానికి పూనుకున్నారు బలవంతంగా, మొహిద్దీన్ చివాట్లతో. ఆ తలుపు సామాన్యమైంది కాదు. అది తెలంగాణా ప్రజల వీరోచిత పోరాటానికి కోట తలుపు. తెలుగు ప్రజల గర్భశత్రువులకి అంత తొందరగా, తేలికగా అర్థమయ్యేట్టు కన్పించలేదు. దాని వెనక తెలంగాణా విముక్తి ప్రజాసైన్యం జయజయ ధ్వానాలతో నుంచుని వుంటే అది అలమి కావటమేమిటి?

"కిరసనాయిలు పొయ్యండి.... అంటించండి. విషసర్పాల్ని వొదలకూడదు" అర్ధరాత్రి వణికింది. దిక్కులు ప్రతిధ్వనించాయి. నైజాం సింహాసనం అంగుళం మేర కదిలి గజగజలాడింది.

"నిజమే.... కానీండి. ఆంధ్ర మహాసభా జిందాబాద్.... తెలంగాణా జిందాబాద్...." వందల గొంతుల్లోంచి మారుమ్రోగిందా ఒక్కమాట.

ఆ ఒక్కమాట, ఇంట్లో దొంగ గుంపు అంతాన్ని.... ఆపన్న సంఘ మరణాన్ని.... సూచిస్తూ నైజాం క్రూర పరిపాలనా యంత్రాన్ని ఒక్కసారి తుఫానులో అరటిచెట్టులా గజగజ లాడించింది. హడలెత్తించింది.

మొహిద్దీన్ గంతులేస్తున్నాడు.... ఎగురుతున్నాడు.... సైనికుల్ని తంతున్నాడు.... గ్రామ పటేల్ని తిడ్తున్నాడు. దొడ్డి తలుపు ఒక్క రవ్వ కదుల్తోంది సైనికుల ప్రయత్నంలో.

## 4

ఇల్లు నాల్గువైపులా అంటుకున్నది. క్షణంలో అగ్ని నాలుకసాచి, ఆకాశాన్ని అంటుతోంది. బయట నినాదాలు లోపల హాహాకారాలు.

1930కీ, 1948కీ గల కాలవ్యత్యాసం, నైజాం నరహంతకులకి అరచేతిలో అరటి పండులా తేటతెల్లమౌతుంది. వాళ్ళు వాకిలి తలుపు తీసే ప్రయత్నంలో సతమతమౌతున్నారు. గ్రామపటేల్ సైనికుల వత్తిడికీ, మొహిద్దీన్ తన్నులకీ ప్రజల కోపాగ్నికీ మాడి మసైనాడు.

గంట గడిచింది. దొడ్డి తలుపు వూడి వచ్చింది. 80 మంది నరహంతకుల్లో 20 మంది సగం చచ్చిన మొహిద్దీన్‌ని, దొడ్లోకి ఈడ్చిపారేసి, రోడ్డుమీదికి వచ్చి కాలికి బుద్ధి చెప్పారు. పొలిమేరలు దాటి చాలాదూరం పొయ్యేవరకూ, ప్రజాసైన్యం విప్లవ నినాదం వాళ్ళని తరుముతూనే వుంది. కిందా, మీదా పడుతూ నైజాం దొర సైన్యం అదే పోత పోయింది, చీకట్లో కలిసి రాలిపోయిన వాళ్ళను తలవనైనా తలవకుండా.

తెలతెలవారింది. గ్రామ ప్రజలు శాంతముగా, తమ నిత్యకృత్యంలా, కోటయ్యగారి తగలడ్డ ఇల్లు శుభ్రంగా ఆర్పి విషసర్పాల స్వార్థానికి సంచయనం చేసారు.

## 5

మరుసటిరోజు సైనిక శిబిరంలో.... చావు తప్పి కన్ను లొట్టబోయి కాలిన శరీరాలకి కట్టు కట్టుకుని పడుకుని వున్న సైనిక పిశాచాలు మూలుగుతూ మాట్లాడుకుంటున్నారు.

"ఒరే భాయ్! మళ్ళీ ఇవ్వాళ రాత్రికి కొత్తగుడా పోవాలంట! హుకుం జారీమీద!" అన్నాడొకడు, జీవితం మీద ఆశ తొణికిసలాడే స్వరంలో.

ఇంకోడు చార్‌మినార్ సిగరెట్ పీక ఎలిగించి, "ఎందుకో తెలుసా? పోయినవాళ్ళకి తోడు లేదని మన్నీ పంపటానికి" అన్నాడు విసుగ్గా.

అందరిలో తెలివిగల మూడోవాడు నెమ్మదిగా మాట్లాడాడు. "భాయి! భయందేనికీ? పోదాం. అక్కడ తప్పించుకునే మార్గం వుంది!" అన్నాడు.

సైనిక పిశాచాలు ఆశగా చూసాయి అతన్ని. "అదేమిటో చెప్పు.... తొందరగా!" అన్నారందరు.

"ఇక్కడ చెబితే మనని ఈ యెలుగుబంటి సర్దార్ కాల్చి చంపుతాడు. దారిలో చెబుతా!"

పది నిమిషాలకి ఎవడో సర్దార్ వెధవ, నోరుపెట్టి రంకెలు వేస్తూ శిబిరంలోకి వచ్చాడు. వాడిదేం పోయింది? ప్రజల దెబ్బ చవిచూడలేదింకా....

"నాన్సెన్సు! వెధవది, బక్క రైతు వెధవలు ఐదువందల మందన్నా ఉండరు.... ఇంతమంది సాయుధ సైనికులు వుండి ఏం చెయ్యలేక పోయినారా! హిజ్ ఎక్స్‌లెన్సీ ఎంత నామర్దా?.... ఛీ పోండి.... కొట్టండి... దోచుకురండి."

మిగతా పిశాచాలకి వళ్ళు జలదరించింది. "అమ్మయ్యో!.... మళ్ళీ అక్కడికే....?" అన్నారు.

"మీరు పిరికిపందలు, నేనొస్తాను పదండి. ఈ తడవ రెండొందలమందిని తీసుకెళ్దాం...."

ఎంతమంది వొస్తేయేం? ఆ గెరిల్లాలు వాళ్ళు మామూలు మనుషులని నమ్మకం కుదరలేదు సైనికులకి. సైన్యంలో మామూలు కదలికేం రాలేదు. టిక్.... టిక్ నశించి మూలుగు బయల్దేరింది. తళతళలాడే బాయ్‌నెట్‌లు వెలవెలబోతున్నై.

"వుం.... ఇవ్వాళే.... అదిగో మిలటరీ లారీలు.... పదండి."

వీడిదేం పోయింది, సైనికుల్లో గుసగుస బయల్దేరింది. పదమంటాడు.... తనెక్కడో దూరంగా కూచుని.... రంకెలు వేస్తాడు.... అయినా రోకట్లో తల దూర్చాకా....

సైన్యం మళ్ళీ హంసనడక నడుస్తో బయల్దేరింది కొత్త ఎలుగుబంటు ఆధ్వర్యాన. గ్రామం దగ్గిర పడుతున్నకొద్దీ మిలిటరీ కార్ల మోతతో పాటు సైనికుల గుండె దడ గూడా కలిసి మంద్ర స్థాయికి వెడుతోంది.

ఎలుగుబంటు గ్రామానికి మైలు దూరంలో సురక్షిత స్థానంలో డేరా వేసి సైనికుల్ని కార్లలోంచి దింపి, "పొండి, గ్రామాన్ని దోచుకోండి.... తగలెయ్యండి. అడ్డు వచ్చిన వాణ్ణల్లా నరకండి!" అని.... హుకుం జారీచేశాడు.

సైన్యం తాబేలులా మందగమనంతో గ్రామంకేసి నడుస్తోంది. తెలివిగల మూడోవాడు ఎలుగుబంటును దాటి అరమైలు పోయిం తర్వాత, "నేను ఒక ఆలోచన చెబుతాను" అన్నాడు. ఇంకోడు దిగులుగా, "పోదూ.... ఏ ఆలోచన చెప్పినా మనం అల్లాని చేరే ఆలోచనేగా?" అన్నాడు.

మిగతావాళ్ళు "ఆ!" అన్నారు నిస్పృహతో సమాధానంగా.

ఇంకోడు తుపాకి జారుతూ వుంటే పైకి సద్దుకుంటో, "ఛీ వెధవది నాకన్న యీ తుపాకికి ఎక్కువ భయంగా వుంది" అని విసుక్కున్నాడు.

మరొకడు నవ్వి, "మనం ఈ గ్రామం ఎందుకు తగలెయ్యటం?" అన్నాడు అనుమానంగా. ఈ అనుమానం సైనికుడికి రావటం ఆశ్చర్యమే. కాని అది గెరిల్లాలంటే వుండే భయంకొద్దీ వచ్చి వుంటుంది.

మొదటివాడు, "హిజ్ ఎక్స్‌లెన్సీ హుకుం ప్రకారం!" అన్నాడు.

రెండోవాడు, "ముస్లిం నాగరికత నిలపటానికట, యీ జనాన్ని చంపటం" అన్నాడు అనూహ్యంగా. అతను ముస్లిమే అయినా, పైవాళ్ళ చీవాట్లతో ముస్లిం అభిమానం నశించింది అతనికి.

తెలివిగల మూడోవాడు, "యిదిగో నేను చెప్పినట్టు చేయండి. అందరం ఆ గెరిల్లాలకి, ఈ పాడు తుపాకులూ, ఈ కాకీ డ్రెస్సులూ యిచ్చి వాళ్ళతో కలుద్దాం. మనకి తర్వాత ఏ భయమూ వుండదు."

మొదటివాడు తుపాకి నిక్కచ్చిగా కిందికి జారవిడిచి, "అమ్మయ్యో! ఆ ఎలుగుబంటి సర్దారు మన్ని చంపితే?" అన్నాడు గడగడ వొణికి.

సైన్యం అంతా ఒక క్షణం ఆలోచించారు.

"మనం అంతా కలిసి వాణ్ణి చంపుదాం. వాడొక్కడేగా!" అన్నాడు మూడోవాడు.

సైన్యం గ్రామం చేరువకి తుపాకులు కిందబెట్టి, డ్రెస్సు వూడదీయడం చెట్ల సందున కూచుని చూస్తున్న ప్రజాసైన్యం కనిపెట్టింది. సైన్యం తరహా బోధపడక, తమలో ఒక్కణ్ణి పంపింది. అతను బతికినా చచ్చినాసరే అని తీర్మానించుకుని.

సైన్యం గెరిల్లా వీరునికి స్వాగతం ఇచ్చింది. తెలివిగల మూడోవాడే పలకరించాడు అతన్ని. "భాయీ! మాకిచ్చే 30 హాలీల కోసం మేం చావదలచ్చుకోలేదు. ఎవర్నీ చంపదల్చుకోలేదు. ఆ తుపాకులన్నీ తీసుకోండి. ఆ డ్రెస్సులు కూడాను. మేమంతా మీతో కలుస్తాం."

గెరిల్లా వీరుడు సంతోషంగా, ఈలవేసి "జిందాబాద్ ఆంధ్రమహాసభా" అని నినాదం ఇచ్చాడు. ప్రజాసైన్యం అంతా వచ్చి నినాదాన్ని అందుకున్నది.... దోపిడీ సైన్యం కూడా....

"జిందాబాద్ తెలంగాణా!"

"నైజాం నిరంకుశత్వం..... నశించాలి!"


కొత్తగుడా గ్రామపంచాయితీ ప్రభుత్వానికి అదనంగా రెండొందల తుపాకీలు రెండొందల మంది తర్ఫీదైన సైనికులూ లభించారు. నైజాం నవాబు సైన్యంలో గూడా ప్రజా చైతన్యం పాకుతోంది!

**– అభ్యుదయ, జులై 1948** ✺

కవిత

# ఒక సిగ్గు బిళ్ల కావాలి

– వంశీ కృష్ణ




విశ్వగురువు హోదా వద్దు
వందే భారత్ ప్రయాణమొద్దు
చంద్రయాన్ ఖ్యాతీ వద్దు
సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదాలొద్దు

మన్ కీ బాత్ ప్రవచనాలొద్దు
ఇంక్లూజీవ్ గ్రోత్ వ్యూహాలొద్దు
బేటీ బచావో బేటీ పఢావో పథకాలొద్దు
మేరీ ప్యారీ బహెనో మాట లొద్దు

మనిషి మీద మనిషి మూత్రం పోయకూడదనే
జ్ఞానం ఇచ్చే కరికులం కావాలి
ఈ దేశం మానం కాపాడటానికి
ఒక సిగ్గు బిళ్ల కావాలి

వాట్సాప్ గ్రూప్ నుండి ✺

సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు - విద్య లక్ష్యం విజ్ఞానం




# బి.వి. సుబ్బయ్య హైస్కూల్

స్థాపితం : 1963

**(ఇంగ్లీషు మీడియం)**

ప్రభుత్వ గుర్తింపు కలిగిన విద్యాసంస్థ

**పేర్నమిట్ట, ఒంగోలు, ప్రకాశం జిల్లా.**

**ఫోన్ : 94944 70850, 88855 10515**
**94942 20476, 79013 03125**

- 2023 ఏప్రియల్ SSC పబ్లిక్ పరీక్షల ఉత్తీర్ణతా శాతం 96.36 సగటు మార్కు 453.15/600
- పూర్తి పారదర్శకతతో, నిజాయితీతో, జవాబుదారీతనంతో నడుపబడుతున్న విద్యాసంస్థ.
- ఒకరిద్దరి విద్యార్థుల ర్యాంకుల గురించే కాకుండా విద్యార్థులందరికీ అత్యధిక మార్కులు వచ్చునట్లు బోధించు ఉన్నతమైన లక్ష్యం గల విద్యాసంస్థ.
- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యముగా పనిచేయుచున్న విద్యాసంస్థ.
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, పూర్తిస్థాయి సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయము మరియు ఆటస్థలము గల విద్యాసంస్థ.
- టెక్ట్స్ బుక్స్ చదువుటకు ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులచేత టెక్ట్స్ బుక్స్ చదివించెదము.
- అయిన ఖర్చును మాత్రమే విద్యార్థి భరించునటువంటి భాగహార పద్ధతిలో పూర్తి పారదర్శకతతో మా హాస్టల్ నడుపుచున్నాము.

హెడ్‌మాస్టర్
**వై. వేణుగోపాల్‌రెడ్డి**

సెక్రటరీ & కరస్పాండెంట్
**బి. కోట్లింగము**

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-12


# అనితా దేశాయ్ నవల

# 'స్పష్టమైన పగటి కాంతి' (Clear Light of Day)

- కొత్తపల్లి రవిబాబు

**అనితా** మజుందార్ దేశాయ్ ముస్సోరిలో బెంగాలీ వ్యాపారి డి.ఎన్. మజుందార్‌కి, జర్మనీ యువతి టోనీ నిమికి 24 జూన్ 1937లో జన్మించారు. ఆమె తన ఏడవ ఏట నుండీ ఇంగ్లీషులో రచనలు చేశారు. మొదటి కథ 9వ ఏట రాశారు. ఢిల్లీలోని క్వీన్ మేరీస్ హయ్యర్ సెకండరీ స్కూలులో చదివారు. 1957లో మిరాండా హౌస్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి ఆంగ్ల సాహిత్యంలో బి.ఏ. డిగ్రీ పూర్తిచేశారు. అశ్విన్ దేశాయ్‌ని 1958లో వివాహం చేసుకున్నారు.

ఇంగ్లీషు భాషలో నవలలు రాసిన భారతీయ పురుష రచయితలలో మొదటి ముగ్గురు ముల్కరాజ్ ఆనంద్, రాజారావు, ఆర్.కె. నారాయణ్ కాగా, మహిళా రచయితలలో మొదటి ముగ్గురు కమలా మార్కండేయ, రూత్ ప్రవర్ జబ్‌వాలా, అనితా దేశాయ్‌లు. ప్రాథమిక విద్య నుండి ఇంగ్లీషులోనే చదవడం వల్ల అనితా దేశాయ్‌కు ఇంగ్లీషులో రాయడమే అలవాటైంది.




15 నవలలు రాసిన అనితా దేశాయ్ అమెరికాలోని మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేసి అక్కడే స్థిరపడ్డారు. 1993లో 'ఇన్ కస్టడీ' అనే ఆమె నవలను మర్చంట్ ఐవరీ ప్రొడక్షన్స్ వారు చలనచిత్రంగా రూపొందించారు. సాహిత్య అకాడమీ అవార్డు, ఫెలోషిప్ అందుకున్న ఆమెకు 2014లో పద్మభూషణ్ అవార్డు వచ్చింది. 1978లో అమెరికాకు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ లెటర్స్ అవార్డు ఆమె రాసిన "ఫైర్ ఆన్ ది మౌంటెన్" నవలకు లభించింది. 1983లో బాలల కాల్పనిక సాహిత్య విభాగంలో గార్డియన్ బహుమతి ఆమె రాసిన 'ది విలేజ్ బై ది సీ' గెలుచుకుంది. 1993లో ఆమె లిటరరీ లయన్ అవార్డు, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో గౌరవ సభ్యత్వం అందుకున్నారు.

భారతీయుల జీవితాలను చిత్రించిన ఆమె నవలల్లో వివిధ మహిళా పాత్రల వ్యక్తిగత సంఘర్షణలు, సమకాలీన భారతీయ సమస్యల నేపథ్యంలో వివిధ వ్యక్తుల జీవితాలు మనకు కనబడ్తాయి. పితృస్వామిక సమాజంలో మహిళల బాధామయ గాధలను ఆమె చిత్రించారు. ఆంగ్ల నవలా సాహిత్యంలో వర్జీనియా వుల్ఫ్ అనే రచయిత్రిలాగా, భారతీయ నవలాసాహిత్యంలో మనోవిజ్ఞానశాస్త్ర రచయిత్రిగా అనితాదేశాయ్‌ను సాహిత్య విమర్శకులు పరిగణించారు.

ప్రస్తుతం మనం పరిశీలిస్తున్న నవలలో దేశ విభజనకు సంబంధించిన వివిధ ఘటనలు, హృదయ విదారక దృశ్యాలు ఏమీ వుండవు. ఒక ఉన్నత మధ్యతరగతి కుటుంబంపై దేశ విభజన పరోక్ష ప్రభావం మాత్రమే వుంటుంది. దేశం విచ్ఛిన్నమౌతున్న కాలంలో ఒక కుటుంబం విచ్ఛిన్నమవడాన్ని రచయిత్రి దీనిలో చిత్రించారు.

అనితా దేశాయ్ 1963 నుండి 2011 వరకు రచించిన 15 నవలల్లో ఇది ఏడవ నవల. 1980లో ప్రచురితమైంది. పాత ఢిల్లీ నగరం కేంద్ర స్థానంగా జరిగే ఈ కథలో మూడు కుటుంబాలు పరిచయమౌతాయి. మొదటిది - దాస్ కుటుంబం. ఈ కుటుంబ పెద్దలైన భార్యా,భర్తలు క్లబ్బులలో, పేకాటలలో కాలం గడుపుతుంటారు. వీరి పిల్లలు బిమ్ (విమల), తార కూతుళ్ళు. రాజా, బాబా కొడుకులు. రెండవది హైదర్ ఆలీ అనే సంపన్నుడి కుటుంబం. తన భార్య, కూతురు బెనజీర్‌తో దాస్ ఇంటికి పొరుగున వుంటారు. దాస్ వుండే అద్దె ఇల్లు కూడా హైదర్ ఆలీదే. ఆ రోడ్డులో వున్న సగం ఇళ్ళు ఆయనవే. మిశ్రా, మిశ్రా సంతానం వున్న కుటుంబం మూడవది.

దాస్ కుటుంబంలో ఆఖరి సంతానం బాబా. ఇతనిలో మానసిక ఎదుగుదల లేదు. నడక కూడా చాల ఆలస్యంగా వస్తుంది. ఈ పిల్లలందర్నీ చూసుకోడానికి బాల్యంలోనే వితంతువైన దూరపు బంధువు మీరాను తెచ్చుకుంటారు. ఆమె భర్త ఇంగ్లండ్‌లో చదువుకుంటూ అక్కడ చలికి మరణిస్తాడు. అప్పటికి మీరా వయసు పన్నెండేళ్ళు.

విమల తెలివిగలది. అన్న రాజాకు ఉర్దూ కవిత్వమంటే ప్రేమ. కాలేజిలో కూడా హిందీ బదులు ఉర్దూ చదువుతాడు. తోటి పిల్లలు ఉర్దూని ముస్లిముల భాషగా పరిగణిస్తారు. తండ్రి కూడా 'ఇప్పుడున్న పరిస్థితులలో ఉర్దూ చదవడం మంచిది కాద'ని సలహా ఇస్తాడు.

పొరుగున వున్న హైదర్ అలీ, తెల్లటి గుర్రంపై షికారుకు వెళ్ళడం చూచిన రాజా, పిల్లవాడిగానే అటువంటి జీవితంపట్ల ఆకర్షితుడౌతాడు. హైదర్ అలీ ఇంట్లోని ఉర్దూ సాహిత్యం చదువుతూ ఆయనతో చర్చిస్తూ వుంటాడు. తార ఒక సాధారణ గృహిణిగా వుండాలనుకుంటుంది కాని విమల, రాజా మాత్రం సమాజంలో ఉన్నత స్థానాలలోకి ఎదగాలనుకునేవారు. దాస్ దంపతుల మరణానంతరం ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా మీరా ఉండేది. తార, పొరుగున వున్న మిశ్రా కుటుంబంతో వున్న సాన్నిహిత్యంలో అక్కడ పరిచయమైన బకుల్‌ను ప్రేమించి, అక్క విమల సలహా ధిక్కరించి పెళ్ళి చేసుకుంటుంది. మానసికంగా ఎదగని బాబా, వేరే పనులేమీ చేయకుండా పాత గ్రామఫోన్‌లో పాత రికార్డులు, పాశ్చాత్య సంగీతం వింటూ కాలక్షేపం చేస్తుంటాడు. వీరి తండ్రి దాస్‌కు వున్న ఇన్సూరెన్స్ కార్యాలయం పని అక్కడి మేనేజర్ చూస్తూ వుంటాడు.

1947లో పాత ఢిల్లీలో అల్లర్లు ప్రారంభమైనాయి. గాంధీ హత్య వార్త విమల, రాజా వింటారు రేడియోలో. ఇంకా అల్లర్లు ఎంత ముదురుతాయో అని భయపడతారు. అయితే హత్య చేసినవాడు హిందువని విని ఊపిరి పీల్చుకుంటారు. ఈ క్రమంలో ఒకరోజు హైదర్ అలీ కుటుంబం లాలారామ్ నారాయణ్ సహాయంతో ఎవరికీ చెప్పకుండా ఇల్లు ఖాళీ చేసి రాత్రికి రాత్రి అదృశ్యమౌతుంది. అప్పటికి రాజా క్షయవ్యాధి వచ్చి ఏడాది నుండి విమల సంరక్షణలో చికిత్స పొందుతుంటాడు. హైదర్ అలీ, రాజాకు ఒక ఉత్తరం ద్వారా తన కుటుంబాన్ని రక్షించుకోడానికి ఢిల్లీ వదలి హైదరాబాదు (నైజాం)లో బంధువుల దగ్గర చేరినట్లు తెలియచేస్తాడు. రాజా కూడా ఆరోగ్యవంతుడైన తర్వాత హైదరాబాదు వెళ్తాడు. హైదర్ అలీ కూతురు బెనజీర్‌ని వివాహ మాడతాడు. హైదరాలీ మరణం తర్వాత ఆయన ఆస్తికి వారసుడౌతాడు.

తార భర్త బకుల్ భారత రాయబార కార్యాలయ ఉద్యోగిగా అమెరికా వెళ్తాడు. తర్వాత సిలోన్‌కు బదిలీ అవుతాడు. పాత ఢిల్లీలో ఆ పాత ఇంటిలో విమల, తమ్ముడు బాబా మిగులుతారు. విమల తాను చదివిన కళాశాలలోనే చరిత్ర అధ్యాపకురాలుగా పనిచేస్తూ వుంటుంది. శరణార్థుల శిబిరాలలో స్వచ్ఛంద సేవికగా పనిచేస్తుంటుంది.

మీరాకు క్షయవ్యాధి వచ్చినపుడు రాజాకు చికిత్స చేసిన డా॥ బిశ్వాస్ విమలను ప్రేమిస్తాడు. కాని డా॥ బిశ్వాస్ తల్లి ప్రవర్తన నచ్చక విమల ఆ ప్రేమను తిరస్కరిస్తుంది.

హైదర్ అలీ ఆస్తికి వారసుడైన రాజా విమలకు ఒక ఉత్తరం రాస్తూ, "వాళ్ళు వుంటున్న ఇంటికి అద్దె పెంచను" అని చేసిన ప్రస్తావనకు విమల చాల మనస్తాపం చెందుతుంది. రాజాతో సంబంధాలు త్రెంచుకుంటుంది. రాజా కూతురు పెళ్ళికి హైదరాబాదులో హాజరు కావడానికి తార – బకుల్ ఢిల్లీ వస్తారు. విమల మాత్రం రాజా ప్రవర్తన మరల గుర్తు తెచ్చుకుని బాధపడుతుంది. వారి బాల్యం గుర్తు చేసుకుంటుంది. చివరకు తార – బకుల్, వారి పిల్లలు ప్రయాణమై వెళ్తుంటే తారతో 'ఒకసారి రాజాను ఢిల్లీ రమ్మనమని చెప్పు' అని సామరస్య ధోరణిలో చెబుతుంది. అంతకుముందురోజే ఆమె ఔరంగజేబు జీవిత చరిత్రలో ఒక వాక్యం చదివి ప్రభావితమౌతుంది. "పుట్టినప్పుడు ఏమీ లేకుండా పుట్టావు. చనిపోయేటప్పుడు ఇన్ని పాపాలు మూటకట్టుకుని వెళ్తున్నావు" అన్నదే ఆ వాక్యం!

విమలలో కుటుంబసభ్యులపట్ల ఆప్యాయతా, క్షమాదృక్పథమూ, దాని ద్వారా వచ్చిన మానసిక, ఆత్మిక ప్రశాంతత ఫలితంగా ఆమెలో వచ్చిన స్పష్టతకు ప్రతీకగా, ఈ నవలకు శీర్షికగా 'స్పష్టమైన పగటి కాంతి' అనే దానిని అనితా దేశాయ్ ఎన్నుకున్నారు.

దేశ విభజన ప్రభావం లీలా మాత్రంగానే ఈ నవలలో ప్రస్తావించ బడింది. ఢిల్లీలో ఆ సందర్భంగా జరిగిన హింస తీవ్రతను చిత్రించడంలో ఈ నవల విఫలమైందనవచ్చు. అక్కడ అల్లర్లు ఒక ఏడాది వరకు కొనసాగాయి. చాలా కొద్ది సంవత్సరాలలో ఢిల్లీలోని జనాభా లెక్కలు మారిపోయాయి. 1947లో ఢిల్లీ జనాభా 9,50,000 మందిలో 3,30,000 మంది ముస్లిములు విభజన సమయంలో ఢిల్లీ వదలి వెళ్ళారు. 5,00,000 మంది ముస్లిమేతరులు శరణార్థులుగా ఢిల్లీకి వచ్చారు.

కొందరు విమర్శకులు ఈ నవలలో ప్రస్తావించిన హైదరాబాదును, పాకిస్తాన్‌లోని భాగంగా పరిగణించారు. కాని హైదర్ అలీ ఢిల్లీ నుంచి నిజాం పరిపాలనలో వున్న హైదరాబాద్‌కు వచ్చాడు. పాకిస్తాన్‌లో వున్న హైదరాబాదు (సింధ్)కు పోలేదు.

హిందూ–ముస్లిం విభేదాలను నవలలో అక్కడక్కడ ప్రస్తావించారు. హైదర్ అలీ ఇంటికి వచ్చి, ఉర్దూ కవితలు చదివే రాజాను అక్కడ వున్న ముస్లిం గుమస్తా ఇష్టపడడు. రాజా కుటుంబ సంరక్షకురాలు మీరాకు, రాజా తరచు హైదర్ అలీ ఇంటికి వెళ్ళడం నచ్చదు. 'వాళ్ళు ముస్లిములు – కనుక సురక్షితం కాదు' అన్నది మీరా దృక్పథం. గతంలో ఇరుగూ పొరుగూ కలిసి వున్నవారే. కాని దేశ విభజన వల్ల వచ్చిన కొత్త దృక్పథం ఇది. రాజాకు వీటన్నిటికంటే ముఖ్యం హైదర్ అలీ ఇంట్లో జరిగే సమావేశాలు, ముషాయిరాలు, ఉర్దూ సాహిత్యం. సమావేశాల్లో ఇస్లాం గురించి చర్చలు. రాజా ఆ ఇస్లామిక్ సంస్కృతి పట్ల అభిరుచి చూపేవాడు.

అయితే రాజా, హైదర్ అలీ కూతురుని వివాహమాడినపుడు వారిలో ఏ వొకరైనా మతం మార్చుకున్నారా లేదా అన్న విషయం రచయిత్రి ఎక్కడా ప్రస్తావించలేదు.

మొత్తం మీద దాస్ కుటుంబం భారతీయ కుటుంబానికి ప్రతీకగానూ, విభజన తర్వాత దాని పరిస్థితి భారతదేశ పరిస్థితికి ప్రతీకగానూ నవల సాగింది.

**వచ్చే సంచికలో....**
**బాప్సీ సిధ్వా నవల**
**'బీటలువారిన భారతదేశం'** ✺

ప్రకటన

# మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై సాగుతున్న హత్యాచారాలను ఖండిద్దాం!

# మతం పేరుతో సాగుతున్న మారణ హోమాల్ని మట్టుబెడదాం!!

**ఇటీవల** మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలుగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన హేయమైన ఘటన సామాజిక మాధ్యమాలలో సంచలనంగా మారడంతో, దేశంలోని సామాన్య ప్రజలలో కూడా మణిపూర్ ఒక చర్చనీయాంశం అయింది. వాస్తవానికి మణిపూర్ ప్రజలపై కొనసాగుతున్న హింసకి దశాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ, తాజా హింసాత్మక ఘటనల పరంపర మొదలై కూడా నెలలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకూ జనం దృష్టికి రాలేదు. అందుకు కారణం అక్కడి ముఖ్యమంత్రి స్వయంగా చెప్పినట్లు అక్కడ ఇలాంటి ఘటనలు వందల కొద్దీ జరుగుతున్నాయి. అక్కడి రాష్ట్ర, కేంద్ర పాలకులు ఆ ఘటనలను నియంత్రించకపోగా, ఈ విషయాలు బయటికి పొక్కకుండా, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ద్వారా స్థానికంగానూ, దేశవ్యాప్తంగానూ బాధిత గిరిజనులకు సంఘీభావం పెరగకుండా అడ్డుకోవాలని ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఈ అమానుష ఘటన వెలుగుచూడటంతో అంతర్జాతీయంగా నిరసనలు వెల్లువెత్తాయి. వాస్తవానికి ఈ ఘర్షణలు మొదలవ్వడానికీ, ఇంత తీవ్ర రూపం తీసుకోవడానికీ కారణమైన అంశాలు ఏమిటి? మతమా? కులమా? లేక మరేవైనా మరింత లోతైన అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయా?

మన దేశపు రాజకీయ అధికారం నల్లదొరల చేతికి బదిలీ అయ్యే నాటికి దేశంలో మొత్తం 565 స్వదేశీ సంస్థానాలు ఉన్నాయి. కాశ్మీర్, హైదరాబాద్, జునాగడ్, జోధ్‌పూర్, మైసూర్, గ్వాలియర్ లాంటి భారీ సంస్థానాలతో పాటు మణిపూర్ కూడా ఒక సంస్థానమే. స్థానిక రాజ కుటుంబానికి చెందిన మహారాజా ప్రబోధచంద్ర 1947లో బ్రిటిష్ పాలన నుండి మణిపూర్ స్వతంత్ర రాజ్యమయ్యాక, మణిపూర్ రాజ్యాంగాన్ని ఏర్పరచి, ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికాడు. 1949లో షిల్లాంగ్‌లో జరిగిన ఒక సమావేశంలో మణిపూర్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తూ ఒక ఒప్పందంపై ఆయన సంతకం చేశాడు. 1949 అక్టోబరులో మణిపూర్ రాజ్యాంగ శాసనసభ రద్దుచేయబడగా 1956 నుండి మణిపూర్ మన దేశంలో ఒక కేంద్ర పాలిత ప్రాంతంగానూ, 1972లో ప్రత్యేక రాష్ట్రంగానూ అవతరించింది.

భారతదేశపు ఈశాన్య భాగాన, ఇంఫాల్ నగరం రాజధానిగా ఏర్పాటైన మణిపూర్ రాష్ట్రానికి ఉత్తరాన నాగాలాండ్, దక్షిణాన మిజోరామ్, పశ్చిమాన అసోం రాష్ట్రాలు, తూర్పున మయన్మార్ దేశం సరిహద్దులుగా ఉన్నాయి. మణిపూర్‌లో మెయితీ తెగకు చెందిన జనాభా అధిక సంఖ్యాకులు (53%). వారి మెయితీ భాష (దీనినే మెయితిలాన్ అనీ, మణిపురీ అనీ అంటారు.) 1992లో జాతీయ భాషలలో ఒకటిగా గుర్తించబడింది.

మణిపూర్ సున్నితమైన సరిహద్దు రాష్ట్రం కావడంతో పాటు వైవిధ్యభరితమైన ఆచార వ్యవహారాలు గల 34 తెగల గిరిజన జనాభా మొత్తం జనాభాలో దాదాపు 43% కావడం వల్ల దేశపు మిగిలిన ప్రాంతాలలో లేని కొన్ని ప్రత్యేక నిబంధనలు ఇక్కడ అమలులో ఉన్నాయి. 371C అధికరణ ద్వారా మణిపూర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని, గిరిజనుల రక్షణ కోసం మణిపూర్ గవర్నర్‌కు ప్రత్యేక బాధ్యతలను రాజ్యాంగం కల్పించింది. వచ్చే విదేశీయులు (మణిపూర్‌లో జన్మించిన విదేశీయులు కూడా) కేవలం 10 రోజులు మాత్రమే చెల్లుబాటయ్యే "నియంత్రిత ప్రాంత అనుమతి" (Restricted Area Permit) కలిగి ఉండాలి. యాత్రికులు కూడా అనుమతింపబడిన ట్రావెల్ ఏజంట్ల ద్వారా ఏర్పాటు చేయబడిన టూర్లలో, అది కూడా నలుగురు వ్యక్తుల గ్రూపులుగా మాత్రమే పర్యటించాల్సి ఉంటుంది. వారు ఇంఫాల్ నగరానికి విమాన ప్రయాణం ద్వారా మాత్రమే అనుమతింపబడతారు. ఈశాన్య రాష్ట్రాలలో సాయుధ దళాలకు అసాధారణ అధికారాలను కల్పించి, ప్రజల హక్కులను గత ఆరున్నర దశాబ్దాలుగా పాలకులు హరిస్తూనే ఉన్నారు. ఇంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్న నేపథ్యంలో కూడా స్వయంగా ముఖ్యమంత్రే స్థానిక గిరిజన సమూహాలను చొరబాటు దారులుగా పేర్కొనడం చూస్తుంటే అక్కడి గిరిజనుల పట్ల పాలకుల వైఖరి ఇట్టే అర్థమౌతుంది.

అత్యంత ప్రాచీన బృంద క్రీడ ఐన పోలో (గుర్రాలపైనున్న రౌతు "T" ఆకారం గల కర్రతో బంతిని నెట్టుకుంటూ నిర్దిష్ట లక్ష్యాన్ని దాటించే ఆట)ను ప్రపంచానికి పరిచయం చేసిన మణిపూర్, లార్డ్ ఇర్విన్ చేత భారతదేశపు "స్విట్జర్‌లాండ్" అని వర్ణించబడిన మణిపూర్‌ను, భారతదేశం నేలపై మొట్టమొదట (నేతాజీ సుభాస్ చంద్రబోస్ చేత) త్రివర్ణ పతాకం ఎగురవేయబడ్డ మణిపూర్‌ను నేడు పాలకులు రక్తసిక్తంగా ఎందుకు మార్చారు? ఎందుకు మణిపూర్ జీవనంలో ఆందోళనలు, పోరాటాలు, మరణాలు నిత్యకృత్యమైపోయాయి?

భారత పాలకుల పరాధీన ఆర్థిక విధానాల వల్ల పెచ్చరిల్లుతున్న నిరుద్యోగ సమస్య, మణిపూర్‌తో పాటు దేశంలో ఉన్న వివిధ జాతుల

పట్ల భారత ప్రభుత్వం చూపిన అలక్ష్య ధోరణి కారణంగా ఇప్పుడు పదుల సంఖ్యలో ఉగ్రవాద సంస్థలకు మణిపూర్ వేదికగా మారింది. ప్రత్యేకంగా మణిపూర్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో మాదక ద్రవ్యాల అలవాటు (drug addiction) కూడా ఒకటి. మాదకద్రవ్యాల వ్యాపారంలో ముఖ్యస్థానమైన బంగారు త్రికోణం (Golden Triangle) దగ్గరలో ఆ దేశం ఉండటం వల్ల వేలాది యువత నిర్వీర్యులై, భారతదేశంలో ఎయిడ్స్ వ్యాధి ప్రబలంగా ఉన్న ప్రాంతాలలో ఒకటిగా మణిపూర్ తయారైంది. నానాటికీ తీవ్రమౌతున్న ఆర్థిక అసమానతలూ, తరుగుతున్న వనరులు, పెరుగుతున్న పోటీ, జనాభాకు సరిపడా పెరగని ఉద్యోగావకాశాలూ వివిధ జాతుల మధ్య వైషమ్యాలకు దారితీస్తున్నాయి.

మరోవైపు సిమెంటు పరిశ్రమకు ముడిపదార్థమైన సున్నపురాయితో పాటు, క్రోమైట్, ఎవపరైటీస్, ఆస్బెస్టాస్, ప్లాటినం లాంటి విలువైన ఖనిజాలు మణిపూర్‌లో విస్తారంగా ఉన్నాయి. ఈ నిక్షేపాలను చేజిక్కించు కోవడానికి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు పథకాలు రచిస్తుండగా, వందల సంవత్సరాలుగా గిరిజనులు పోరాడి సాధించుకున్న రక్షణ చట్టాలు కార్పొరేట్ల పథకాలకు అడ్డంకిగా మారాయి. అందుకోసం అడవుల నుండి ఆదివాసులను వెళ్లగొట్టడం తప్ప మరో మార్గం కనిపించని పాలకులు అటవీ రక్షణ, పర్యావరణ పరిరక్షణ చర్యల పేరుతో గిరిజనులపై దాడులు ఎక్కుపెట్టాయి. కేంద్ర, రాష్ట్ర పాలకులు, కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు న్యాయస్థానాలు కూడా ఈ విషయంలో గిరిజనులకు వ్యతిరేకంగా జట్టుకట్టాయి. 2023 ఏప్రిల్ చివరి వారంలో ఆధిపత్య మెయితీలకు గిరిజన హోదా కల్పించడానికి చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మణిపూర్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల సారాంశం ఇదే. ఈ తీర్పు అనంతరం ఆదివాసుల నిరసన ఆందోళనలు బిజెపికి సాకుగా దొరికాయి. అదివాసులకు ఉన్న ప్రత్యేక రక్షణ ఏర్పాట్లను తొలగించడం కోసం ఎదురు చూస్తున్న పాలకులు తమ పరాధీన ఆర్థిక విధానాల వల్ల స్థానిక ప్రజల మధ్య ఏర్పడిన వైషమ్యాలను – మతం పేరిట, రిజర్వేషన్ల పేరిట – మరింత రెచ్చగొట్టి మెజారిటీ సమూహమైన మెయితీలను తమ ఓటు బ్యాంకుగా స్థిరీకరించు కోవడం కోసం వారికీ గిరిజనులకు మధ్య శతృత్వాన్ని రెచ్చగొట్టి, తాము మెయితీల పక్షం వహిస్తున్నట్లు నాటకాలు ఆడుతున్నారు. స్థానిక మెయితీలలో మెజారిటీ హిందువులుగానూ, కుకీలలో మెజారిటీ క్రైస్తవులుగానూ ఉండటంతో బీజేపీ నాయకులకు బాగా అలవాటైన మత రాజకీయాలకు మతం ముసుగు తొడగటానికి మణిపూర్ అనుకూల క్షేత్రంగా తయారైంది. అరంబాయ్, టెనెగోల్ లాంటి సంఘ్ పరివార్ అర్ధ ఫాసిస్ట్ నిర్మాణాలు అక్కడ బలపడటానికి నేపథ్యం ఇదే. అలా తాము స్థిరీకరించుకున్న అధికారంతో మణిపూర్ సహజ సంపదలను బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడం వారి అంతిమ లక్ష్యం.

సామాన్య ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ఇలాంటి కుట్రలు దేశంలో మరిన్ని రాష్ట్రాలకు విస్తరించక ముందే, జనాన్ని అప్రమత్తం చేయడం రచయితల, కళాకారుల, మేధావుల నేటి కర్తవ్యం.

**– జనసాహితి** ✺

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

**– శీలా సుభద్రాదేవి**

(గత సంచిక తరువాయి....)

**నగరమంతా** వెలుగు పొదరిల్లు అయ్యింది
ఊరూ వాడా రంగులచిత్రమౌతోంది
రోడ్లపై తేలుతూ కదిలే వాహనాలు
కోలాటాలు కోలాహలాలు
గుంపులో చిందు నృత్యాలు
అరిగి పోయిన శబ్దపేటికలనుండి
ఎగిరే పాటల పావురాలు
మళ్ళా చరిత్ర పునరావృతం ఔతుందేమోనన్న
స్పృహలేని సంబరాల్లో జనం!
భ్రమావరణంలో నాయకులు!!

అంతకుముందు పదవుల పీఠాల్ని
అలంకరించిందీ వారే కదా
నాటి మెరుపులకు అంటుకున్న మరకల్ని
కప్పిపుచ్చే గురివిందలూ వారే కదా
ఏం ఒరగబెట్టారని ఏ ఒక్క ఓటరైనా
ప్రశ్నను సంధిస్తే
ఏ కందువాలో ముఖం దాచుకోవాలో మరి!

కానీ
నల్లనోటు రెపరెపల్తో
మందునీళ్ళ మంత్రజలం చల్లి
కలికానికైనా కనిపించని కపటప్రేమను
గ్రాఫిక్ పథకాలతో ప్రదర్శిస్తే
వెర్రి బాగుల ఓటర్లు మాత్రం
క్షణభంగురమైన ఆశల నీటిబుడగల్లో
భవిష్యత్తును కలగంటూ
రంగులప్రపంచంలో
మునుగీతలు కొద్దుంటారు
అదే కదా వారి ధీమా

**(ముగింపు వచ్చే సంచికలో)** ✺

పుస్తక సమీక్ష

### వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రచురించిన

# స్వరాజ్యస్ఫూర్తి @ 75

- ఐ.టి.ఆర్.ఐ. శివాజీరావు

**స్వరాజ్యస్ఫూర్తి @ 75** అనే ఈ పుస్తకాన్ని ప్రజా వాగ్గేయకారుడు, స్వాతంత్ర్య సమర యోధుడు గరిమెళ్ళ సత్యనారాయణగారికి అంకితం ఇచ్చారు. ముందుమాట ప్రముఖ చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణగారు రాశారు.

ఇటీవలే మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అయిన సందర్భంగా అమృత మహోత్సవాన్ని దేశవ్యాప్తంగా, ఇంటింటికి జాతీయ జెండాలు ఎగరేసి మరీ జరుపుకున్నాం. ఆ జెండాలు ప్రస్తుతం గాలికి ధూళికి ఎండకి వానకి చిక్కి శిధిలమై, చిరిగి పేలికలై రోడ్లమీద ఎగురుతూ చెత్తకుండీలలో అవనతం అవుతున్న దుస్థితి మన కళ్ళముందు వుంది.




'వెలుగు' సంస్థ వివిధ రంగాలలో అనగా సాహిత్య సాంస్కృతిక విద్యారంగాలలోనూ వివిధ సెక్షన్ల ప్రజలు ఇటు స్వాతంత్ర్యం సముపార్జించు కోవడానికి ఏ విధమైన కృషిచేశారో, వారు చేసిన కృషికి, త్యాగాలకు ఏ మేరకు ఫలితం దక్కిందో, ఈ పుస్తకంలోని వ్యాసావళి అంచనా కట్టే పనిని చేసింది. 'వెలుగు' సాహితీ సాంస్కృతిక సంస్థ కార్యనిర్వాహకులు రామినాయుడు ఈ పుస్తకాన్ని ప్రచురించారు.

ప్రస్తుతం తెలుగునాట సాహిత్య, పత్రికారంగాలలో లబ్ద ప్రతిష్టులుగా వున్న రచయితలు, కవులు, సంపాదకులు రాసిన వ్యాసాల సంపుటి ఇది.

ముందుమాటలో వకుళాభరణంగారు చెప్పినట్లు అమృతోత్సవ వేళ సంబరాలు చేసుకోవాల్సిందే! కానీ, ఏమి చూసి ఆ సంరంభం? ఎవ్వరిలోనూ ఉద్వేగం కనబడటం లేదు. ఇంచుమించు ఈ వ్యాసాలన్నీ ఈ వాక్యాన్ని ప్రతిబింబిస్తూ రాసినవే! స్వాతంత్ర్యేచ్ఛ కోసం రగిల్చిన నిప్పు ఆనాడు ఉజ్వలమై వెలిగింది. ఊరూవాడా దావాలనమై వ్యాపించింది, బ్రిటిష్ ప్రభుత్వాన్ని కాల్చి కూల్చింది. కానీ నేడు ఆ వేడి, ఆ సెగలు లేవు. జనులలో ఆ స్ఫూర్తి కొడిగట్టి ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టుంది. అయితే ఆ నిప్పు రగలడానికి, స్వాతంత్ర్య కాంక్షా కీలలు అంటుకోవడానికి అనేకమంది చిదుపలు, చిదుపలుగా అందులో పడి కాలిపోవాల్సి వచ్చింది. వాళ్ళ త్యాగాల ప్రాతినిధ్యమే నేటి నామమాత్రపు స్వాతంత్ర్యమైనా!.

అలా కాలిపోయిన వాళ్ళలో గరిమెళ్ళ ఒకరు. గరిమెళ్ళ స్వాతంత్ర్య సాధనలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించగలిగాడు. అనేక సంవత్సరాలు జైలు శిక్షను అనుభవించాడు. స్వాతంత్ర్య భారతం అతన్ని పట్టించుకోలేదు. చివరికి మద్రాసు వీధుల్లో ఊంఛ వృత్తి చేసుకుంటూ అనాధలా బ్రతికి మరణించాడు. మనం సాధించిన స్వాతంత్ర్యం ఏపాటిదో దాని స్వభావం యేమిటో గరిమెళ్ళ జీవితమే ఒక కొలబద్ద. అయితే శ్రీశ్రీ వంటివాడే అత్యవసర పరిస్థితి కాలంలో పాలకవర్గాల భావజాల ప్రభావానికి గురైనా గరిమెళ్ళ ఎక్కడా తొణకలేదు బెణకలేదు. అలా లొంగివుంటే ఆయన చలం అన్నట్టు "ఏ సారస్వత సమితికో జాయింట్ సెక్రటరీ అయ్యేవాడు. ఇతరుల ఖర్చు మీద కాఫీ ఇడ్లీలు తినేవాడు".

ఇప్పటి సాహిత్య ప్రముఖులను తీసుకుంటే ప్రజల కోసం పుంఖానుపుంఖాలుగా సాహిత్య సృజన చేసి, ప్రజల తరుపున మహోగ్రమైన ఉద్యమాలు నడిపి ఆ క్రెడిట్ అంతా ఒక బ్యాంక్ అకౌంట్‌లా దాచుకొని, ఏమ్మెల్సీ పదవులకో - కేబినెట్ ర్యాంక్‌కు సమానమైన హెూదా గలిగిన సాంస్కృతిక శాఖ కార్యదర్శులు లేదా ఇతర పదవులు సాధించడానికి పెట్టుబడులుగా ఉపయోగించడం మనం చూస్తున్నాం. ఒక్కసారి ఆ పదవులు పొందాక, తాము ఏ ప్రజల కోసం రాసి వాసికెక్కారో ఆ ప్రజలకు, తమకు కుర్చీ వేసికూర్చోబెట్టిన ప్రభువులు ఎంత అన్యాయమూ, ద్రోహమూ తలపెట్టినా ఆ నోళ్ళు కదపరు మెదపరు. ఆ కలాల సిరాలు ఇంకిపోతాయి, ఆ గళాల గీతాలు మూగబోతాయి. పాలక పక్షాలు ముందు చేయి చాచడం కన్నా నీచమైన పని మరొకటి లేదని తలంచిన గరిమెళ్ళ శిఖర సమానుడుగా నిలుచుంటే ఈ కవివరేణ్యులంతా మురికికాల్వలై అంతకన్నా పెద్ద మురికి ప్రవాహాల్లో కలుస్తున్నారు.

డెబ్బై అయిదేళ్ల స్వాతంత్ర్య సముపార్జనని వివిధ కోణాల్లో సమీక్షించిన ఈ పుస్తకాన్ని గరిమెళ్లకు అంకితమిచ్చిన వెలుగు సంస్థను అభినందించవల్సిందే! గరిమెళ్ళ జీవితాన్ని తరచి చూపించిన జయధీర్ తిరుమలరావుగారు ఆయన నిబద్ధతను చాటిచెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆనాటి ప్రభుత్వాలు కూడా గరిమెళ్ళ వంటి స్వాతంత్ర్య

సమరయోధునికి ఘోరమైన అన్యాయం చేసిందని ఆయన ఈ వ్యాసంలో తడిమారు. అలా తమ దేశం కోసం తమ సర్వస్వాన్ని ఒడ్డి పోరాడి అనంతరం ఆ త్యాగాలకు గుర్తింపు లేకుండా విస్మృతిలోకి జారిపోయినవారెందరో!

అయితే ఈ పుస్తకం గురించి ఇక్కడే ఒక్క విషయం చెప్పాలి. అదేమిటంటే అడుగడుగునా ముద్రారాక్షసాలు (అచ్చుతప్పులు). అవి ఎంత ఎక్కువగా వున్నాయంటే సీరియస్‌గా చదివే పాఠకుడిని చిరాకు పెడతాయి. అచ్చుతప్పుల పట్ల జాగ్రత్తలు తీసుకొని వుండవలసింది.

ఈ అచ్చు తప్పుల వలన సిద్ధాంతాలకు కూడా ఎసరు పెట్టే సందర్భాలు వస్తాయి. ఉదాహరణకు డా॥ నాగసూరి వేణుగోపాల్‌గారు వ్రాసిన 'స్వాతంత్ర్య భారతంలో గాంధీపథం' వ్యాసంలో భారతీయ ముస్లిములు 1806లోనే 'ఆల్ ఇండియా ముస్లిం లీగ్' (పేజీ 15, 2వ పేరా) ఏర్పాటు చేసుకున్నట్టుగా పడింది. ఆ తర్వాతి పేజీ (16 మొదటిపేరా)లో 1906లో గాంధీజీ దక్షిణాఫ్రికాలో 'సత్యాగ్రహ భావనను ప్రతిపాదించి అక్కడి భారతీయులను ఏకం చేసి హింసాత్మక పోరాటం సలిపారు' అని ముద్రితమయ్యింది. కొత్తగా చదివే పాఠకులకు, చరిత్ర విద్యార్థులకు ఇటువంటి అచ్చుతప్పులు వారి చరిత్ర అవగాహనను తలకిందులు చేయగలవు. రాబోయే ప్రచురణలోనైనా ఇటువంటి పొరపాట్లు రాకుండా జాగ్రత్త వహిస్తారని ఆశిద్దాం.

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌గారు గాంధీజీ నాయకత్వంలోని కాంగ్రెస్ అంతకు ముందు కాంగ్రెస్‌కి తేడాలు చెబుతూనే, గాంధీజీ నాయకత్వంలోకి వచ్చాక కాంగ్రెస్ స్వాతంత్ర్యం సాధించిన క్రమాన్ని అందుకు దారితీసిన పరిస్థితులను సమీక్ష చేశారు. గాంధీజీ స్ఫూర్తితో ఆంధ్రాలో పెల్లుబికిన ఉద్యమాల నడకను కూడా చెప్పారు.

స్వాతంత్ర్య పోరాటం అనేది అనేక గొంతుల సమష్టి బృందగానం, అనేక చిన్న చిన్న పాయలు ఏకమైన మహాప్రవాహం! ఆ పోరాట ఫలితంగా లభించిన స్వాతంత్ర్యానికి ఏ ఒక్కరి గొంతో కారణం కాదు, ఏ ఒక్క పాయ ప్రవాహ ఫలితమో కాదు. కాంగ్రెస్ ఏర్పడినప్పుడు భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం దాని లక్ష్యం కాదు. అర్జీలు, మహజర్లు బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించడం. వారిచ్చిన తృణమో పణమో చూసి సంతృప్తిపడటమే అప్పటి దాని లక్ష్యం. అసలు కాంగ్రెస్‌ను ఒక బ్రిటిష్ జాతీయుడి అధ్యక్షతన ఏర్పాటు చెయ్యడం వెనుక వున్న కారణం కూడా అదే. 1885న ఆ సంస్థ ఏర్పడడం యాదృచ్ఛికం కాదు. అంతకు కొద్దిసంవత్సరాల ముందే 1857లో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం జరిగింది. ఆ పోరాటం భారతదేశంలోని బ్రిటిష్ సామ్రాజ్య కూసాలను కదిలించింది. ఈ పోరాటంలో హిందువులు, ముస్లిములు ఐక్యంగా పోరాడారనే విషయాన్ని గ్రహించిన వలస ప్రభుత్వం ఈ ఐక్యతను చిన్నాభిన్నం చేయకపోతే భారతదేశంలో తమ పప్పులుడకవనే సత్యాన్ని తొందరగానే గ్రహించింది. అంతేకాక, 1857 తిరుగుబాటులాగా ఒక్కసారిగా విప్లవం పెల్లుబుకకుండా రక్షణ కవాటం (Safety Valve) లాగా వుండే కాంగ్రెసును బ్రిటీషువారే ప్రోత్సహించారు. దీని ఫలితమే 1885లో కాంగ్రెస్ ఏర్పాటు, ఆ తర్వాత 1906లో ముస్లిం లీగ్, 1915లో హిందూ మహాసభ ఏర్పాటయ్యాయి. ఇవన్నీ బ్రిటీషువాడి కనుసన్నలలో జరిగిన వ్యవహారాలే.

మొదటి స్వాతంత్ర్య సంగ్రామాన్ని తీవ్రంగా అణిచివేసేందుకు ప్రజల మీద ప్రయోగించిన నిర్బంధం వారి అసంతృప్తికి, తీవ్ర నిరసనకు కారణం అయ్యింది. ప్రజలలో అంతకంతకూ పెరుగుతున్న ఈ అసంతృప్తి ఏదో రూపంలో పెల్లుబికి తమ పాలనను అంతం చేయగలదనే అంచనాకు వలసవాదులు వచ్చారు. ఈ ప్రెషర్ కుక్కర్ పేలకుండా వుండాలంటే అందులోని ఆవిరిని కొంచెం కొంచెంగా బయటకు పంపే చిన్న వాల్వ్ ఒకటి కావాలి. ఆ వాల్వే భారత జాతీయ కాంగ్రెస్. దీనికి సురేంద్రనాథ్ బెనర్జీ వంటి భారతీయ మేధావులు అవసరం అయ్యారు.

ప్రజలలో సంతృప్తి, అసంతృప్తి స్థాయిలను బట్టి కాంగ్రెస్ తనను తాను సర్దుబాటు చేసుకుంటూ వచ్చింది. మొదట మహజర్లకే పరిమితమైన ఆ సంస్థ ఆ తర్వాత బ్రిటిష్ ఇండియా చట్టం, డొమినికన్ స్టేటస్, ఎన్నికలు ఇటువంటివి ఒక్కొక్కటీ సాధించుకుంటూ వచ్చింది కానీ సంపూర్ణ స్వాతంత్ర్య ఆకాంక్ష మొదట దాని లక్ష్యాల్లో లేదు. భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ 1925లో ఏర్పడినప్పుడే సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం చేసింది.

గాంధీ భారతదేశానికి 1915లో దక్షిణాఫ్రికా నుండి తిరిగొచ్చాక కాంగ్రెస్ పగ్గాలు అందుకున్నాడు. అహింస, సత్యాగ్రహ సాధనాలుగా తన కార్యాచరణ ప్రారంభించాడు. శ్రీశ్రీ అన్నట్టుగా 'అహింస ఒక ఆశయమే గాని ఆయుధం కాదు, ఆశయం సాధించాలంటే ఆయుధం అవసరమే మరి'. మరి గాంధీ ఈ అహింస ఆయుధాన్ని భారతీయుల చేతిలో పెట్టాడుగానీ బ్రిటీష్ వారి చేతిలో పెట్టలేదు. పెషావర్లో ఘర్వాలీ సైనికులకు అక్కడి ముస్లిం ప్రజలకూ మధ్య జరిగిన ఉదంతం పట్ల గాంధీ వైఖరి ఆయన అహింసా సిద్ధాంతం ఏ వర్గ ప్రయోజనం కోసమో అన్నది అర్థమవుతుంది.

గాంధీ భారతదేశంలో అన్ని వర్గాలనూ ఒక్క తాటిపైకి తేగలిగాడు. చంపారన్ కార్మిక ఉద్యమాలలో పాలితులకి న్యాయంకన్నా పాలకుల న్యాయం వైపే ఆయన మొగ్గు చూపాడు. పావలా కూలీ రేట్లు పెంచమని కూలీలు సమ్మె చేస్తే వెంటనే నాయకుడిగా అక్కడ ప్రత్యక్షమై అక్కడి పోరాటాన్ని తన చేతిలోకి తీసుకొని "ఇదిగో మన పోరాటం వల్ల పది పైసలు పెరిగింది. ఇక ఉద్యమాన్ని విరమిద్దాం, లేవండి", అన్న చందంగానే ఆయన ఉద్యమాలు నడిపాడు. అందుకే బ్రిటీష్‌వారికి అత్యంత గౌరవనీయుడు, ఆప్తుడు కాగలిగాడు. దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో ఆయన బ్రిటిష్ వారి తరుపునే యుద్ధంలో పాల్గొన్నాడు గానీ ధర్మం పక్షాన లేదు. నిజానికి ఆ యుద్ధంలో ధర్మము, న్యాయము – ఆ యుద్ధంలో ఓడిపోయిన, తీవ్రంగా అణిచివేయబడిన గిరిజన తెగల పక్షాన వున్నాయి. కానీ రామభక్తుడైన గాంధీ న్యాయం, ధర్మం వున్న చోట లేడు. అంటే గాంధీ ఎప్పుడూ పాలక వర్గాల మనిషే. భారతదేశంలో కూడా ఇందుకు మినహాయింపు లేదు. కులాలు ఉండాలని, కింది కులాలవారు తమ వృత్తి ధర్మాన్ని పాటించాలని నిర్ద్వంద్వంగా చెప్పినవాడు గాంధీ. నాగసూరివేణుగోపాల్‌గారు చెప్పినట్టు ఆయన రాజకీయ స్వాతంత్ర్యంకన్నా ఎక్కువగా సామాజిక నైతిక స్వాతంత్ర్యం కోరుకున్నాడు. ఆ నైతికత కూడా భారతీయ ఫ్యూడల్ చట్రాల పరిధి దాటని విధంగా రూపొందించుకున్నాడు. ఆ నాటికి గాంధీ కోట్లాది మందిని ఆకర్షించగలిగాడంటే ఆ ఫ్యూడల్ నైతికతే కారణం. తన

ధర్మానికి అడ్డొచ్చిన ఎవరినైనా ఆయన క్రూరంగా పరిహసించాడు. అది తన భార్య కస్తూరిబాయినైనా లేక గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంగా భగత్‌సింగ్ ప్రభృతులనైనా.

ప్రపంచ దేశాలలో ఇటు పెట్టుబడిదారీవ్యవస్థ కానీ, అటు సోషలిజం కానీ, అలాగే కమ్యునిజం కానీ జనరంజకంగా సాగిన విజయాలుగా నమోదు కాలేదని తాజా కరోనా వుదంతంతోపాటు చాలాసార్లు తేటతెల్లమైందని (పేజీ నం 29) విరుద్ధమైన భావజాలాలను ఒకేగాట కట్టారు వేణుగోపాల్‌గారు. కానీ కరోనా ప్రబలిన నెలల వ్యవధిలోనే టీకాను కనుగొనడమే కాకుండా కరోనా బాధిత దేశాలకు వైద్యసేవలు అందించడానికి ఎంతోమంది డాక్టర్లను పంపింది క్యూబా. అదేవిధంగా వియత్నాం కూడా కరోనాను విజయవంతంగా కట్టడి చెయ్యగలిగింది. కమ్యూనిస్ట్ దేశాలను నానా ఇబ్బందులుపెట్టి ఆ వ్యవస్థలు ఎలాగైనా ఫెయిల్ అయ్యాయి, ప్రపంచానికి పెట్టుబడి తప్ప వేరే దిక్కులేదు అని చూపించే ప్రయత్నం చేస్తున్నది వాటిచుట్టూ వున్న పెట్టుబడిదారీ దేశాలే. ఈ రోజుకి క్యూబాలో తయారయిన వాక్సిన్‌లు బయటకు రానిస్తే శరవేగంగా విస్తరిస్తున్న అనేక క్యాన్సర్లకు, అల్జీమర్స్ వంటి నయంకాని జబ్బులకు పరిష్కారం దొరికేది, క్యూబా పేదరికాన్ని జయించేది. కానీ ఈ రెండూ జరగనివ్వదు అమెరికా.

'తెలుగు కవిత్వం – దేశభక్తి' శీర్షికన జాతీయ పోరాటాల సమయంలో దేశీ జాతీయ భావనను పెంపొందించడానికి కవిత్వం, ముఖ్యంగా పాట ఏవిధంగా దోహదపడిందో డాక్టర్ పాపినేని శివశంకర్ సోదాహరణంగా చెప్పారు. అదేవిధంగా స్వాతంత్ర్యానంతరం కూడా ఆ స్ఫూర్తి ఎలా కొనసాగిందో చెప్పారు. ఈ వ్యాసంలో కూడా కుప్పలకొద్దీ అచ్చు తప్పులు పాఠకులను ఇబ్బందులకు గురిచేస్తాయి.

గురజాడ 'దేశభక్తి' గేయాన్ని, బంకించంద్ర 'వందేమాతరం' గేయాన్ని తులనాత్మకంగా బేరీజు వేశారు డాక్టర్ పాపినేని శివశంకర్. ఒకచోట (పేజీ నెం 36) దేశమంటే మనుషులే కాదు మట్టికూడా అంటూ మనిషిలో కూడా పంచ భూతాలు వున్నాయి అని అంటూ బంకించంద్ర గేయంలోని 'సుజలాం, సుఫలాం' భూమి యొక్క సృజన శక్తిని చెబుతున్నాయని అంటారు. దేశం అనే అమూర్త భావనకి మూర్తిమత్వాన్ని, పునాదిని సమకూర్చేవే అంటారు. 'దేశభక్తి' గేయం 'వందేమాతరం' గేయానికి విరుగుడు కాదు సవరణ అని ప్రతిపాదించారు పాపినేని. ఈ రెండు గేయాలు తన దృష్టిలో పరస్పర పూరకాలు అంటారు.

ఈ విధంగా ఈ రెండు గేయాల మధ్య ఒక సమన్వయం కోసం ప్రయత్నించారు. కానీ, 'జనగణమణ' గీతంలో గానీ బంకించంద్ర 'వందేమాతరం' గేయంలో గానీ గురజాడ మొట్టమొదట వెతికింది మానవుడి కోసం. ఆ మానవుడే లేని ఈ భూమి లక్షలాది సంవత్సరాలు కొనసాగింది. మానవ పరిణామం జరిగిన తరువాతే భూ పరిణామం తనంత తానుగా సాగుతూనే మానవుడికి ఒద్దిక అయ్యింది. మానవుడు తన నాగరికతా సాధనకు భూగోళమే ఆలంబన అయినప్పటికీ, తన చతురతతో, తెలివితో భూమిని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. మట్టి ఎప్పటికీ వుంటుంది కానీ మానవుడు లేని మట్టిలో రాజనాల మొలకొలుకులు పండవు.

మట్టిని బంగారంగా మార్చే ఆల్కెమీ రహస్యం తెలిసింది ఒక్క మానవుడికి మాత్రమే! గలగల పారే నీటికి కళ్లేలు బిగించేది ఆ పరుగును అదుపు చేయగలిగేది మానవుడు మాత్రమే! మానవుడిలో మట్టి వున్నప్పటికీ ఆ మట్టిలోంచి మహోదయాలు సృజించేది మానవుడు మాత్రమే! అందం భావకవుల మదిలో పుట్టినట్టు అమూర్తభావన ఏమీకాదు. జీవన మకరందమే అందమూ ఆనందమూను. నదులూ కొండలూ గుట్టలూ మనుషుల ఆకలి తీర్చినపుడే అవి అందమైనవి అవుతాయి. మానవశ్రమే వాటిని అందంగా తీర్చిదిద్దుతుంది.

మరోచోట యూరోప్‌లో మాదిరి భారతదేశంలో మిలిటెంట్ పోరాటాలు తక్కువ. కర్మ సిద్ధాంత భావనతో కూడిన ఫ్యూడల్ జీవన విధానం భారతీయ సంస్కృతిలో కనబడుతుంది. గాంధీ ఆచరణ మార్గంలో అది సంవదించింది అని అంటారు పాపినేని. అయితే యూరప్‌లోని మిలిటెంట్ పోరాటానికి కారణం అక్కడి సామాజిక పరిణామం ఎటువంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాగడమే. ఎక్కడివారైనా ఒక తరహా వ్యవస్థ నుంచి బయటపడి నూతన సంబంధాలలోకి ప్రవేశించే సమయంలో ప్రజలకు సహజంగానే మిలిటెంట్ లక్షణాలు అలవడతాయి. భారతదేశంలో కర్మ సిద్ధాంతాలు, పాపాలు – పుణ్యాలు ఆ పరిణామానికి అడ్డం పడినప్పటికీ ఫ్యూడల్ భల్లూకపు పట్టు నుండి సామ్రాజ్యవాదం నుండి మన సమాజాన్ని విముక్తి చేయటానికి అనేకానేక పోరాటాలు చేసిన చరిత్ర వున్నది. గాంధీలాంటివారు అది కొనసాగడానికి వీలు లేకుండా శాయశక్తులా తమ వంతు ప్రయత్నం చేశారు. దాన్ని అధిగమించలేకపోవటం మరో చరిత్ర.

"స్వాతంత్రోద్యమంలో పాట తెచ్చిన చైతన్యం" వ్యాసంలో డాక్టర్ సి. హెచ్ సుశీలమ్మగారు స్వాతంత్ర్యపోరాటంలో పాట తెచ్చిన చైతన్యం పాత్రని విశ్లేషించారు. పాట శాంతి జీవుల కాలక్షేప సాధనం కాదు అది శ్రమజీవుల చైతన్య గీతిక అని అంటారు. ఆనాటి పాట భారతీయుల గుండెల్ని తట్టిలేపి స్వాతంత్ర్య పోరాటంలోకి ఉరికేలా చేసింది. గరిమెళ్ళ సత్యనారాయణగారి "మాకొద్దీ తెల్లదొరతనము" ప్రజాసమూహంలో ఉద్యమ చైతన్యం రగల్చడానికి, అదేసమయంలో బ్రిటిష్‌వారిలో వణుకు పుట్టించడానికి వేసిన ఒక పొలికేక అంటారు ఆమె.

"ప్రజాకళలు తోడ్పడిన తీరు!" వ్యాసంలో స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం కాలంలోనూ కళారూపాలు ఎంత బలమైన పాత్ర పోషించాయో దివికుమార్‌గారు వివరించారు. కాంగ్రెస్‌కి కమ్యూనిస్ట్ పార్టీకి మధ్యనున్న వైవిధ్యం ఇక్కడ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. కమ్యూనిస్ట్ పార్టీశ్రేణులు స్వాతంత్ర్యోద్యమపు చైతన్యాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి కళారూపాలను ఒక సాధనంగా గ్రహించి, ఊరూ వాడా ప్రచారం చేస్తే అసలు ఆ వైపుగా ఆలోచించడానికి కాంగ్రెస్ భయపడేది. దీనికి కారణం ఏమంటే ముఖ్యంగా కమ్యూనిస్ట్ పార్టీ స్వాతంత్ర్య సాధనలో సామాన్య ప్రజలే చోదక శక్తులుగా భావించి వారిలో చైతన్యం నింపే ప్రయత్నం చేస్తే, కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజలకు అటువంటి అవగాహనను అందిస్తే ఉద్యమం తమ చేజారి వారి చేతిలోకి వెళ్ళిపోతుందేమో అని భయపడింది. ఒక్కసారి ఉద్యమం ప్రజల చేతుల్లోకి వెళ్ళిపోయాక అది ఇంక తమ అదుపాజ్ఞాలలో వుండదు. దాని సొంత తోవలు అది తీసుకుంటూ, దాని సొంత లక్ష్యాలు అది

ఏర్పరచుకుంటూ కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టి ఉద్యమం ముందుకి సాగిపోతుంది. అది కాంగ్రెస్ మనుగడకే ప్రమాదం. బ్రిటీష్ వలస పాలకులతో రాజీపడే బూర్జువా స్వభావం కలిగినట్టిది కాంగ్రెస్ పార్టీ. దాని ఏకైక లక్ష్యం స్వాతంత్ర్యం బూర్జువా వర్గాలకు, భూస్వామ్య వర్గాలకు అప్పచెప్పటం. తాను వారికి అండగా వుంటూ తాను అధికారంలో కొనసాగడానికి వారి సహాయాన్ని తీసుకోవడం మాత్రమే. కమ్యూనిస్ట్ పార్టీ ప్రజలతో కలిసి నడుస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్లాలని భావిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రజలకి ముందు వుండి ఉద్యమాన్ని నడిపించాలని కోరుకునేది. రెండిటికీ భేదం ఇక్కడే స్పష్టం! రెండిటి ఆచరణలో కూడా తేడా స్పష్టమే! కమ్యూనిస్ట్ పార్టీకి కేవలం సభలూ సమావేశాలు జరపడం మాత్రమే కాకుండా ప్రజలు ఉద్యమాన్ని సొంతం చేసుకోవడానికి కళారూపాలు అవసరం అయ్యాయి. అయితే ఆ కళారూపాలు ఎక్కడినుంచి సేకరించాలి, ఎక్కడినుంచి నేర్చుకోవాలి అనుకున్నప్పుడు కమ్యూనిస్ట్ పార్టీ ఆచరణే అందుకు మార్గం చూపింది. ప్రజలను చిన్న చూపు చూసే కాంగ్రెస్‌కు భిన్నంగా ప్రజలను గొప్ప వీరులుగా చూసే పార్టీకి ఆ ప్రజలే గొప్ప కళారూపాలను అందించారు. యక్షగానాలు, గొల్లసుద్దులు, హరికథలు, బుర్రకథలు, పౌరాణిక నాటకాలు ఇలా ప్రజలలో అప్పటికే ప్రచారంలో వున్న కళారూపాలను వారి దగ్గర నుండి నేర్చుకొని వాటిని ప్రజా చైతన్య రూపాలుగా మలిచి తిరిగి వారికి కమ్యూనిస్ట్ పార్టీ అందించింది. ఈ క్రమంలో అనేక అవరోధాలు, నిర్బంధాలు ఎదుర్కొన్నది.

ప్రజానాట్య మండలి ఏర్పాటు చేసి గరికపాటి రాజారావు, నాజర్, సుంకర సత్యనారాయణ ఇంకా ఎందరెందరో మెరికల్లాంటి ప్రజా కళాకారులను తయారు చేసుకుంది కమ్యూనిస్ట్ పార్టీ. సంసారపక్షపు స్త్రీలను నాటకాల్లో నటింపజేసింది కమ్యూనిస్ట్ పార్టీనే! 'మా భూమి' లాంటి నాటకాలు వేలాది ప్రదర్శనలకు నోచుకున్నాయంటే ఆనాడు ప్రజల జీవితాలకు అవి దగ్గరగా వుండడమే కారణం. ఆంధ్ర ప్రాంతంలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు, తెలంగాణ ప్రాంతంలో తెలంగాణా సాయుధ పోరాటానికి దారితీసిన పరిస్థితుల్లో కళారూపాల పాత్ర అపూర్వమైనది. అయితే దివికుమార్‌గారు రాసిన వ్యాసం చాలా కత్తిరింపులకు గురైనట్టుంది. పేజీ 64లో సంస్కారవంతమైన నాటకం ఇది అన్నారు. మరి ఆ నాటకం ఏదో అక్కడ లేదు. బహుశా అంతకు ముందు పేరాలలో దివికుమార్‌గారు వ్రాసి వుంటారు కానీ అది తొలగించడం వలన చదివే పాఠకుడు గందరగోళానికి గురవుతాడు. పైగా ఆ పై పేరాకు దీనికి సమన్వయం కుదరలేదు. ఎందుకంటే పై పేరా సాహిత్యానికి సంబంధించినదైతే, ఈ పేరా నాటక ప్రదర్శనకు సంబంధించినది. అంటే మధ్యలో ఏవో పేరాలు ఎగిరిపోయాయి అని అర్థం అవుతుంది. మరి ఆ కత్తిరింపుకి కారణమేమిటో తెలియదు.

ఇక స్త్రీల సాహిత్యోద్యమం గురించి 'స్త్రీల స్వరాజ్యోద్యమ స్ఫూర్తి – దేశ స్వాతంత్ర్య దీప్తి' అనే శీర్షికన డాక్టర్ జంధ్యాల కనకదుర్గగారు దేశభక్తి కోణంలో మహిళలు సృష్టించిన సాహిత్యాన్ని, వారు పాల్గొన్న రాజకీయ కార్యక్రమాలను సమీక్షించారు. నాడు గాంధీగారి పిలుపు నందుకొని ఖద్దరు ఉద్యమంలో, ఉప్పు సత్యాగ్రహం మొదలైన వాటిలో ఏవిధంగా పాల్గొన్నారో కూలంకషంగా చర్చించడమేకాక వారు సృష్టించిన సాహిత్యాన్ని తెలియజేశారు. రాజకీయంగా ఆనాడు వస్తున్న మార్పులను పసిగట్టిన మహిళలు ప్రజలను చైతన్యపరచడానికి అందుకు అనుగుణమైన గొప్ప సాహిత్యాన్ని సృష్టించారని మనకు అర్థం అవుతున్నది.

అంతేకాక నేటి ప్రపంచీకరణ సందర్భంలో మహిళా రచయిత్రులు గొప్ప సాహిత్యసృష్టి చేస్తున్నారు. ప్రపంచీకరణ అద్భుతాలు చేస్తుందని నమ్మ పలికిన పాలకవర్గాల మోసకారి మాటలను బట్టబయలు చేస్తూ సమాజంలో అణగారిన వర్గాలైన స్త్రీలు, దళితులు, బాలలు, కార్మికులు, కూలీలు నలిగిపోతున్న విధానాన్ని తమ కథల్లో, కవితల్లో గొప్పగా వ్యక్తపరుస్తున్నారు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో తెలుగులో వచ్చిన నవలా సాహిత్యాన్ని పరామర్శ చేశారు.

'స్వరాజ్య శంఖం పూరించిన తెలుగు నాటకం' అనే వ్యాసంలో డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావుగారు స్వాతంత్ర్యోద్యమ కాలంలో వచ్చిన నాటకాలను సమీక్షించారు. ఆనాటి నిర్బంధ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం కళాకారుల మీద ప్రయోగించిన నిర్బంధం చూస్తుంటే ఈరోజు స్టాండప్ కమెడియన్ల మీద ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసే రచయితల మీద దేశీయ ప్రభుత్వం ప్రయోగిస్తున్న నిర్బంధకాండ గుర్తొస్తుంది. అయినప్పటికీ కళాకారులు ఎంతో చాకచక్యంగా పోలీసుల నిఘా ఉన్నప్పుడు మామూలు నాటకాన్ని, వాళ్లు నిష్క్రమించిన తర్వాత అసలు నాటకాన్ని ప్రదర్శించేవారు అంటే వారి నిబద్ధత, వారి ఎత్తుగడలు ఈనాటి కళాకారులందరికీ కూడా మార్గదర్శకంగా ఉండగలవు. దామరాజు పుండరీకాక్షుడు రాసిన 'సంస్కారిణి', మునిమాణిక్యం నరసింహారావు రాసిన 'తిరుగుబాటు', వేదాంతం వెంకట సుబ్రహ్మణ్యా శర్మ రాసిన 'జమీన్ రైతు' వంటి నాటకాలను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. అయినా ఆనాటి నాటక రచయితలు నిర్బంధ కాండను గడ్డిపోచకన్నా హీనంగా భావించి తమ నాటకాలను ప్రజల మధ్య ప్రదర్శించేవారట.

కేఎల్ ప్రసాద్‌గారు 'తెలుగు సినిమా గమనం' అనే శీర్షికన స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి నేటివరకు తెలుగు సినిమా పరిణామాన్ని చర్చించారు. అయితే ప్రధానంగా ఎంతో కొంత అభ్యుదయ అంశతో స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వెలువడిన తెలుగు సినిమాలు నేడీ దుస్థితికి చేరడానికి ప్రధాన కారణంగా ప్రేక్షకులను ఎత్తిచూపారు. అది ప్రేక్షకుల తప్పుకాదు. ఎవరి ప్రయోజనాలకు సినిమాలు ఈ రూపంలో నిర్మించ బడుతున్నాయో గమనించాలి. సినిమా అనేది అత్యంత శక్తిమంతమైన సాధనం అని లెనిన్ అంటాడు. అందువలన మ్యానుఫ్యాక్చర్ ఆఫ్ డిసెంట్, మ్యానుఫ్యాక్చర్ ఆఫ్ కన్సెంట్ (పాలకవర్గానుకూల సమ్మతిని, నిరసనని ఉత్పత్తి చేసే పద్ధతులు) నడుస్తున్న ప్రస్తుత సామ్రాజ్యవాద దశలో సినిమాను పాలకవర్గాలు, దాని వెనుకనున్న మీడియా మొగల్స్ తమకనుగుణంగానే ప్రజల అభిప్రాయాల్ని మార్చుకోవడానికి ఉపయోగించుకుంటాయి. మొన్న తీసిన 'కాశ్మీర్ ఫైల్స్', 'కేరళ స్టోరీ', నిన్న తీసిన 'ఆదిపురుష్', ప్రస్తుతం తీస్తున్న 'రజాకార్' మొదలైన సినిమాలు ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి. నేటి హీరోలు ఒకేసారి పదిమందిని, వందమందిని కొట్టడం వెనక రాజకీయ ఉద్దేశాలు లేకపోలేదు. ప్రజలను వారి శక్తిని గుర్తించకుండా ప్రేక్షకులుగా చేయడమే

నేటి పాలకవర్గాల ఉద్దేశం. అందుకు అనుగుణమైన కథలనే వారు అనుమతినిస్తారు. ఈరోజు ప్రజాచైతన్యానికి మించిన రాజద్రోహం ఇంకొకటిలేదు.

'భారత రాజ్యాంగం : మారుతున్న సందర్భం' వ్యాసంలో ప్రొఫెసర్ జి. హరగోపాల్‌గారు. ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో చెప్పారు.

'స్వరాజ్య స్ఫూర్తి – ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు' శీర్షికన నందిని సిధారెడ్డిగారు బెంగాల్ విభజన ఉద్యమం నుంచి తెలంగాణ విమోచన పోరాటం, తెలంగాణ రాష్ట్రసాధన, ఉత్తరాంధ్ర అస్తిత్వ సమస్యలను చర్చించారు. ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు పెల్లుబకడం వెనుక లోతైన బలమైన కారణాలు కూడా ఉంటాయి. అభివృద్ధిలో వెనకబడిన ఉత్తరాంధ్రపేరిట సాగుతున్న అస్తిత్వ ఉద్యమాలైనా, మరింకేవైనా కానీ ఫలితం ఎవరికి ఇచ్చాయి, ఎవరికి ఇవ్వనున్నాయి అన్నది బేరీజు వేసుకోలేకపోతే ఏ అస్తిత్వ ఆకాంక్షలకైతే పోరాటాలు జరుగుతున్నాయో ఆ ఆకాంక్షలు మూలనపడి దాని ఫలాలు ప్రజలకు కాకుండా ఎవరెవరో ఎగరేసుకుపోయే ప్రమాదాలు ఉంటూనే ఉంటాయి.

'కొంగు నడుముకు చుట్టి కొడవలి చేపట్టిన తెలుగు మహిళ వయసు 75 ఏళ్లు' అనే శీర్షికన కుప్పిలి పద్మగారు స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలోనూ తదుపరి స్త్రీ విముక్తి పోరాటాలలోనూ మహిళా ఉద్యమాన్ని సమీక్షించారు. పేజి నెంబర్ 188, 189లలో ఉప్పు సత్యాగ్రహంలో మహిళలు పాల్గొనడానికి గాంధీగారు అంగీకరించలేదని, ఒక మహిళను కూడా సెలెక్ట్ చేయలేదని రాశారు. అయినప్పటికీ మహిళలు ఆయన నిర్ణయాన్ని ధిక్కరించి ఉద్యమంలో చేరారని రాశారు.

అదే వ్యాసం పేజి నెంబర్ 211లో మహిళలు స్వతహాగా అహింసాయుతులని, అందుకే పికెటింగ్, సత్యాగ్రహ ఇతర ఉద్యమాల కార్యక్రమాలను నిర్వహించటంలో మరింత విజయవంతం అవుతారని గాంధీజీ గట్టిగా విశ్వసించారన్నారు. ఈ వాక్యం కూడా ఉప్పు సత్యాగ్రహం నేపథ్యంలో వ్రాయబడినదే.

కుప్పిలి పద్మగారు తన వ్యాస శీర్షికలో 'కొడవలి పట్టిన మహిళ' అన్నారు గానీ వ్యాసంలో ఎక్కువగా మధ్యతరగతి మహిళా ఉద్యమాల గురించే రాశారు. ముఖ్యంగా మహిళా ఉద్యమాన్ని మూడు దశలుగా విభజించారు. మొదటిదశ (1850–1915) భారతీయ నాగరికతలోని మహిళా వ్యతిరేకమైనవాటిని వదిలించుకొని, అదే సమయంలో పాశ్చాత్య నాగరికతను గుడ్డిగా అనుసరించకుండా తమదైన సొంత వ్యక్తిత్వం కలిగి ఉండాలని మహిళలు భావించిన కాలం. అందుకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణను నిర్దేశించుకున్న కాలం. ఇక రెండవ దశ (1915–1947), అప్పటికి స్వాతంత్ర్య పోరాటం ఒక చైతన్య రూపం సంతరించుకుంది కాబట్టి పెద్దఎత్తున మహిళలు కూడా ఆ పోరాటంలో తమదైన ముద్రని వేశారు. కాంగ్రెస్ నడిపిన ఉద్యమంలో వారు సహాయక పాత్రల్లో మాత్రమే ఉన్నారని, ఆనాటి పురుష నాయకత్వం వారిని ద్వితీయ శ్రేణినాయకత్వం వహించడానికి కూడా ప్రోత్సహించలేదని అంటారు. ఇక మూడవ దశ 1947 నుండి ఇప్పటివరకు జరిగిన అనేక మహిళా ఉద్యమాలను ఆమె సమీక్షించారు.

అయితే చాలాచోట్ల అస్పష్టత ధ్వనించింది. ఆమె కొన్ని వివరాలను ఇంగ్లీష్‌లో నుంచి అనువాదం చేసి ఇచ్చినట్లు ఉంది. అయితే దీనికి సంబంధించి రిఫరెన్స్ గ్రంథాలు ఏవీ ఆమె దిగువన పేర్కొనలేదు. అనువాదం చేసినప్పుడు శ్రద్ధ తీసుకుని చేసి ఉండుంటే బాగుండేది.

'భారత స్వాతంత్ర్యోద్యమం – ఆంధ్రప్రదేశ్ ముస్లింల అడుగు జాడలు' అనే శీర్షికతో సయ్యద్ నశీర్ అహమ్మద్‌గారు జాతీయోద్యమంలో పాల్గొన్న ముస్లింల వివరాలు పొందుపరిచారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యాసం అవసరమైనది. స్వాతంత్ర్య పోరాటంలో త్యాగాలు చేసింది ఏదో ఒక వర్గమో, కులమో మరియు మతమో కాదు. అది అందరి సమష్టి కార్యాచరణ. ఆ ఫలితాలు కూడా సమష్టిగానే అందాలి. కానీ ముస్లింలను ఈ దేశానికి శత్రువులు అనే పేరుతో చరిత్రను బాజపేయులు తిరగదోడుతున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల త్యాగాలను ఉద్దేశ్యపూర్వకంగా దాచిపెడుతున్నారు. అయితే నసీర్ అహమ్మద్‌గారు ముగింపులో చెప్పాల్సినంతగా చెప్పలేదేమో అనిపించింది. అసలు విషయం పక్కకు పోయి జాతీయోద్యమ ఫలితాలు ఆ తదుపరి తెలంగాణా పోరాట ఫలితాలు చెబుతూ పోయారు తప్ప నేటి పరిస్థితికి అన్వయించి చెప్పలేదు. అందువల్ల అసలు ఉద్దేశ్యం నెరవేరలేదు. పాలక వర్గాలకు తమ ప్రయోజనమే ముఖ్యం తప్ప మతమూ కులమూ ఏమీ కాదు. వాళ్ళ ప్రయోజనం నెరవేరే క్రమంలో మతాన్నో, కులాన్నో ఒక సాధనంగా ఉపయోగించుకుంటారు తప్ప, నిజంగా వాటిని ఉద్ధరించరు. అలాంటి ఉద్దేశాలు కూడా వాళ్ళకి ఉండవు. నిజాం నవాబుకు, మద్దతుగా నిలబడింది హిందూ దొరలే. నిజాం నవాబుకు వ్యతిరేకంగా నిలబడిన అనేకమంది ముస్లిం ప్రముఖుల వివరాలు కూడా నసీర్ అహమ్మద్‌గారు ఇచ్చారు. అనేకమంది ముస్లింలు దేశ విభజనకు వ్యతిరేకంగా సభలూ సమావేశాలు పెట్టి ప్రచారం చేసిన వివరాలూ ఇచ్చారు. నిజంగా ఇలాంటి విషయాలు నేటి పాఠ్యాంశాలలో చేరిస్తే హిందూ ముస్లిం ఐక్యత వర్ధిల్లుతుందనిపిస్తుంది. కానీ ఒక పద్ధతి ప్రకారం చరిత్ర ప్రజలకు అందకుండా చేసి, ఆ చరిత్రను వక్రీకరించడమే ఇప్పటి పాలకుల ఎత్తుగడ.

నిజానికి స్వాతంత్ర్య సమరంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు నిరుపమానమైనవి. వారికి ఎదురైనన్ని నిర్బంధాలు, వారు చేసిన త్యాగాలు దేశంలో ఇంకా ఏ రాజకీయ పార్టీ కూడా చేయలేదు అనడంలో సందేహం లేదు. అయితే స్వాతంత్ర్యం అనంతరం అతివాద మితవాద దుందుడుకు స్వభావాలకు లోనైన కమ్యూనిస్టు పార్టీ అనేక చీలికలు పేలికలు అయ్యింది. ఒక ఉద్యమం బలహీనపడినప్పుడు దాని స్థానంలో వ్యతిరేక శక్తులు ప్రవేశిస్తాయి. ప్రస్తుతం జరుగుతున్నది కూడా అదే. తెలకపల్లి రవిగారు కమ్యూనిస్టు పార్టీ పాత్రను 'స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు స్రవంతి' అనే వ్యాసంలో సమీక్షించారు. ఇంకా ఈ పుస్తకంలో రైతాంగ పోరాటాలను, విద్యా ఆరోగ్య వ్యవస్థలను అమృత ఉత్సవాల వేళ బేరీజు వేసే ప్రయత్నం చేశారు. చరిత్రను భిన్న కోణాల్లో తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. ✷

**స్వరాజ్యస్ఫూర్తి @ 75**
**వ్యాస సంకలనం : వెలుగు రామినాయుడు;**
**వెల : రూ. 300/-**
**ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్.**
**ఫోన్ : 90004 13413**

## జాతీయ అక్షరయోధులు



**ఓం ప్రకాశ్ వాల్మీకి**

**(1950 - 2013)**

**17**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# జ్వలిత ప్రకాశం

జూఠన్ రచయిత వాల్మీకి ఓం ప్రకాశం
హిందీ తొలి దళిత స్వీయచరిత్ర విశేషం
కళాశాల పాఠ్యగ్రంథ పుటలై వినిపించిన
అవమానాల ఎంగిలిమెతుకుల ఆక్రోశం

**"మా పొయ్యి మట్టితో చేసిందే / ఆ మట్టేమో చెరువులోది / ఆ చెరువేమో ఠాకూర్ ది. ఆకలేమో రొట్టెలు కావాలంటుంది / ఆ రొట్టెలేమో గోధుమ పిండితో చేస్తారు / ఆ గోధుమ పంట చేలలోంచి వస్తుంది / ఆ చేలు ఠాకూర్‌వి..ఎద్దులు ఠాకూర్‌వి / నాగలి ఠాకూర్‌ది / ఐతే నాగలిపట్టి దున్నే చేతులు మనవి / పంటేమో ఠాకూర్‌ది.. బావి ఠాకూర్‌ది / నీరు ఠాకూర్‌ది / చేను ఠాకూర్‌ది / సందులు, వీధులు అన్నీ ఠాకూర్‌వే" అంటూ సామాజిక చైతన్యాన్ని రగిలించిన ఓం ప్రకాశ్ వాల్మీకి ప్రముఖ భారతీయ హిందీ దళిత రచయిత, కవి, సంపాదకుడు, నవలాకారుడు, నటుడు, దళిత సాహిత్య సామాజిక ఉద్యమకారుడు.**

వృత్తిరీత్యా గవర్నమెంట్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగి అయిన ఓం ప్రకాశ్ వాల్మీకి అక్కడే ఉద్యోగ విరమణ చేసిన తరువాత జీవితకాలమంతా డెహ్రాడూన్‌లో నివసించారు.

1949లో అంటరానితనం నిషేధించబడినప్పటికీ భారతదేశంలో దళితులు ఎదుర్కొంటూన్న వివక్షత, ఆర్థికలేమి, హింస, హేళనలపై కలం ఝుళిపించారు. సామాజిక సాంస్కృతిక రంగాలలో దళితుల ప్రాథమిక హక్కులు నేల రాస్తున్న భూస్వామ్యశక్తుల అహంకారాన్నీ, దోపిడీని ప్రశ్నిస్తూ, ప్రతిఘటిస్తూ దళితుడి దుర్భర దయనీయ జీవితాన్ని 'జూఠన్' పేరున తన ఆత్మకథగా గ్రంథస్థం చేశారు. జూఠన్ అంటే ఎంగిలి ప్లేటులో మిగిలినది, పారవేస్తే జంతువులు తినేది. ఈ వ్యవస్థలో దళితులకు దక్కుతున్నదదే.

వాల్మీకి 'జూఠన్'(1977)హిందీ దళిత సాహిత్యంలో మొదటి దళిత స్వీయ చరిత్రగా, ఒక మైలురాయిగా ప్రశంసలు పొందింది. తమిళం, మళయాళం, కన్నడం, పంజాబీ, ఇంగ్లీషు తెలుగు భాషల్లోకి అనువదించబడి ప్రశంసలు పొందింది. వాల్మీకి రచనలు పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ, పాఠ్య గ్రంథాలుగా చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ మౌలానాఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఎం.ఏ.హిందీ విద్యార్థులకు ఆయన ఆత్మకథ 'జూఠన్' ఒక పాఠ్యగ్రంథం.

ఇంకా 'సదియోంకా సంతాప్(1989), బస్ బహుత్ హో చుకా(1997), అబ్ ఔర్ నహీ(2009) కవితా సంపుటాలు. సలామ్(2000), ఘుస్‌పైఠియె(2004) కథా సంపుటాలు. 'దో చేరా' నాటకం – ఇంకా దళిత్ సాహిత్య కా సౌందర్య శాస్త్ర(2001), వాల్మీకి సమాజ్ చరిత్ర, సఫాయి దేవత(2009) వీరి ప్రసిద్ధ రచనలు.

1995లో ప్రజాసాహిత్య పత్రిక ప్రత్యేక సంచికకూ, 2004లో 'దళిత హస్తక్షేప్'కు సంపాదకత్వం వహించారు. జబల్‌పూర్ నుండి వస్తున్న పత్రిక 'తీస్రాపక్ష'కు సంపాదకులు.

ఓం ప్రకాశ్ వాల్మీకి రచయిత మాత్రమేకాదు. మంచి నటుడు కూడా. ఎన్నో నాటకాలలో నటించి మెప్పించిన రంగస్థల కళాకారుడు. ఈయన ముఖచిత్రంతో 2014 జనవరి 'ప్రజాసాహితి' వెలువడింది.

చైతన్యపూరితమైన దళిత సాహిత్య సృజన చేసిన ఓం ప్రకాశ్ వాల్మీకి 30 జూన్ 1950లో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలోని బార్లా గ్రామంలో జన్మించారు. 17 నవంబరు, 2013లో డెహ్రాడూన్‌లో లివర్ కేన్సర్‌తో తన 63వ ఏట కన్ను మూశారు. ✳

గల్పిక

# మౌనం

- శంకరం

**ఉగ్రమూర్ఖుని** మౌనాన్ని ఎలాగైనా భగ్నం చేయాలని పట్టు వదలని భేతాళుడు తిరిగి తన ప్రయత్నాన్ని కొనసాగించాడు.

"ఉగ్రమూర్ఖ మహారాజా, నేను చెప్పినవి విని సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో చెక్క భజన చేసుకోవాల్సిందే.

ప్రజలు ఏమంటున్నారంటే;

"డ్యాములు కట్టడం కోసం మమ్మల్ని నిర్వాసితుల్ని చేస్తున్నారు" – "మౌనం"

"అడవులపై మా హక్కుల్ని కొల్లగొడుతున్నారు" – "మౌనం"

"మా స్త్రీల మానాల్ని హరిస్తున్నారు" – "మౌనం"

"మత వైషమ్యాలు పెంచి ప్రజల మధ్య అశాంతులు సృష్టిస్తున్నారు" – "మౌనం"

"మా భూముల్ని ఆక్రమించుకుంటున్నారు" – "మౌనం"

"గో మూత్రమే మా సమస్త వ్యాధులకు నివారణ అంటున్నారు" – "మౌనం"

"మాకు నచ్చిన ఆహారాన్ని తినవద్దంటున్నారు" – "మౌనం"

"మా వస్త్రధారణపై ఆంక్షలు విధిస్తున్నారు" – "మౌనం"

"కోట్ల ఉద్యోగాలిప్పిస్తామని ఆశపెట్టి పకోడీ అమ్ముకోమంటున్నారు" – "మౌనం"

"మాపై ఈడీలను, సిబిడీలను ఉసిగొల్పుతున్నారు" – "మౌనం"

"మాపై అక్రమ కేసుల్ని బనాయిస్తున్నారు" – "మౌనం"

"మూఢనమ్మకాలు వదలండని చెబుతుంటే మాపై దాడులు చేస్తున్నారు" – "మౌనం"

"ప్రజలకు వాస్తవాలను చెబుతున్న మమ్మల్ని (జర్నలిస్టులను) కడతేరుస్తున్నారు" – "మౌనం"

"సహజ వనరులన్నిటినీ కార్పొరేట్ల పరం చేస్తున్నారు" – "మౌనం"

"ప్రభుత్వ సంస్థలన్నిటినీ ప్రై'వేటు' చేస్తున్నారు" – "మౌనం"

"సేద్యానికి వ్యతిరేకంగా నల్లచట్టాల్ని చేస్తున్నారు" – "మౌనం"

"మాకు వ్యతిరేకంగా నూతన కార్మిక చట్టాలను చేస్తున్నారు" – "మౌనం"

"అశాస్త్రీయత వైపు దేశాన్ని నెడుతున్నారు" – "మౌనం"

"దేశ ఖ్యాతిని ఇనుమడింపచేసిన మా(రెజ్లర్ల)పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు" – "మౌనం"

"పేదరికం తగ్గిపోయిందని తప్పుడు నివేదికలను విడుదల చేస్తున్నారు" –

"గుజరాత్ గాయం మాననే లేదు మణిపూర్‌లో మతకలహాల కల్లోలాలు సృష్టించి అడవులను, సహజవనరులను మింగేయాలను కుంటున్నారు" – "మౌనం"

"ఖామోష్! మేరా భారత్ శ్రేష్ఠ భారత్! సబ్ కా సాత్ సబ్ కా వికాస్!" అన్నాడు ఆవేశం పట్టలేని ఉగ్రమూర్ఖుడు.

మౌనభంగం చేసిన భేతాళుడు విజయగర్వంతో తిన్నగా వెళ్ళి రామభజనలో కూర్చున్నాడు. ✺

కవిత

## వివస్త్ర భారతం

- రవితేజ


**విదేశీయులు పోయి**
స్వదేశీయుల చేతే పాలింపబడుతున్నది నా భారతావని!
ఐనా ఆదివాసీల కన్నులు జలపాతాలే... ఎందుకని?

అడవి లోపలి మృగాలు వాళ్ళంటే భయంతో జీవిస్తున్నా
బయటి మానవ మృగాలు బాధించి వేధిస్తున్నయ్

భరత సంస్కృతికి మూలాలు ఈ వాసీలే...
క్రమంగా కనుమరుగైపోతున్నది వారి వాసాలే...

ఎందరో అమరమూర్తుల త్యాగాల లాగే...
నిష్ఫలంగా వారి రక్షణకై సాధించిన చట్టాలు...

వివస్త్రానికి గురైన ఓ భారతావనీ...
ఏ మహనీయుడినో మరలా జన్మించనీ... ✺



కవిత

# సమాంతర రేఖలు

- సాంబమూర్తి లండ

మీరంతా ఇప్పుడొకింత తెరిపిన పడి వుండొచ్చు
పీల్చే ఊపిర్ల మీద
ఆగిన పరుగుల మీద మోపిన ఆంక్షలన్నీ ఎత్తేసి
ఏ నిటారు చెట్లో కనబడితే
కూల్చి, మంటపెట్టి చలి కాచుకుంటూ వుండొచ్చు

మేం మాత్రం నడుస్తూనే వున్నాం
జీవితాల్ని మూటగట్టి నెత్తిన మోసుకుంటూ
గుప్పెడు మెతుకుల గలగలలు వినబడే
నదీ తీరాలను వెతుక్కుంటూ
మొండి రెక్కలతోనే ఖండాలను దాటుతున్నాం

నేలనైతే ప్రాంతాల వారీగా
విడగొట్టగలరేమో
పారే చెమట నదులు ఎక్కడైనా ఒకటే
కాలాన్నైతే రేఖాంశాలు వారీగా
విభజించగలరేమో
కాలే కడుపులకు తెలిసింది
మూడు పూటలు నాలుగు వేళ్ళ లెక్కొక్కటే

ఇంకు చుక్కల్ని కొల్లగొట్టడానికో
పీఠాలను లాక్కోవడానికో
నాలుగు కాళ్ళనూ ఇంకాస్త బలంగా పాతుకోవడానికో
మీరు వలల్ని విసురుతున్నపుడు
బోసిపోతున్న గడపలలోంచి
మూతబడుతున్న వాకిళ్లలోంచి
శిథిలమవుతున్న పచ్చదనాల్లోంచి
తలదించుకు నడిచి పోతుంటాం

జాలిగా చూడ్డానికీ
ఒక్క కన్నీటి చుక్కైనా రాల్చడానికి
పొలిమేరలకు కళ్ళుండవు
సాగనంపడానికీ
భుజాల మీద వాల్చుకుని అనునయించడానికి
సరిహద్దులకు కాళ్ళూ చేతులుండవు

పేగులు చేత్తో పట్టుకుని
ప్రపంచపటానికి అడ్డం పడి
కన్నీటి దారుల వెంట నెత్తుటి నడకలవుతుంటాం

ఏళ్లుగా మీరు ప్రణాళికలై
మమ్మల్ని ఉద్ధరిస్తూనే వున్నారు
ఆశకీ ఆకలికీ పుట్టినోళ్లం
మేం భూగోళపు చిట్ట చివర అంచులకు
నెట్టేయబడుతూనే వున్నాం
మేం పట్టాలమవుతూనే వున్నాం
మీరు రైలుబళ్లై దూసుకుపోతూనే వున్నారు

మనది సమాంతర రేఖల మీద
ప్రయాణమని తేలిపోయింది
ఇక ఏ అభివృద్ధి కూడళ్ళలో
మన కరచాలనాలకు ప్రతిపాదిస్తారు?
మనవి పరస్పర వ్యతిరేక గమనాలని
స్పష్టమైపోయింది
ఇంకా ఏ భ్రమల లోయల్లోంచి
పథకాల పావురాళ్లను పట్టుకొచ్చి ఎగరేస్తారు?

మీ మ్యానిఫెస్టోల్లోంచి మమ్మల్ని దులిపేసి
ఉత్తిత్తి వాగ్దానాల్లో కప్పెట్టేసాక
అతికించుకున్న ముసుగులన్నీ చిరిగిపోయి
మీ అసలు ముఖాలు బయటపడ్డాక
మా జెండా మేమే ఎగరేయడానికి
గుండెలు డప్పులై ఉరకలెత్తుతున్న వేళ
మమ్మల్ని మభ్యపెట్టడానికింకా ఏం మిగిలిందని?

(ఎక్స్-రే ఉత్తమ కవిత 2021)

**గోరంట్ల మధుబాబు 20వ వర్ధంతి (జూన్ 30) సందర్భంగా, వారిని స్మరించుకుంటూ ఆయన సహచరి కల్యాణి, కొడుకు సుహాస్, కూతురు మేఘ ఈ సంచిక ముద్రణకు పాక్షికంగా ఆర్థిక సహాయం అందించారు. వారికి కృతజ్ఞతలు.**




## సినిమా సమీక్ష

# ఒప్పెన్‌హైమర్ (2023)

– బాలాజీ (కోల్‌కతా)

### అమెరికన్ ప్రొమిథియస్ :

గ్రీకు పురాణాల్లోని తిరుగుబాటు వీరుడు 'ప్రొమిథియస్'. ఆయన ఒలింపియన్ (ఒలింపస్ పర్వతంపై నివసించే) దేవుళ్ల నుండి 'అగ్ని'ని తెలివిగా దొంగిలించి మానవజాతికి అందించాడు. మానవులు అగ్నిని మంచి కోసమూ, చెడు కోసమూ ఉపయోగించసాగారు. కోపగించిన దేవతలు 'ప్రొమిథియస్'ను బంధించి, శాశ్వతంగా అతడ్ని నానా యాతనలకు గురిచేశారు. అలానే ప్రథమ అణుబాంబు జనకుడైన జె. రాబర్ట్ ఒప్పెన్‌హైమర్ (సూక్ష్మంగా ఒప్పీ లేదా రాబర్ట్) కూడా అణువులో దాగిన బ్రహ్మాండమైన శక్తిని బయటికితీసి రెండో ప్రపంచ యుద్ధంలోకి ప్రవేశించిన అమెరికా చేతిలో పెట్టాడు. అమెరికా దాన్ని తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం జపాన్‌లోని జనావాసాలపై ప్రయోగించింది. ఆ తర్వాత తన ఆవిష్కరణపై తనే పశ్చాత్తాపపడుతున్న ఒప్పెన్‌హైమర్‌పై లేనిపోని నిందలు మోపి, విచారణలు జరిపి అమెరికా అతన్ని హింసించింది. ఆ విధంగా ఒప్పెన్‌హైమర్ 'అమెరికన్ ప్రొమిథియస్' అయ్యాడు. అతని జీవిత చరిత్రను అమెరికన్ రచయిత మార్టిన్ జె. షెర్విన్ 20 యేళ్ల పాటు రిసెర్చి చేసి 50,000 పేజీల రాత ప్రతుల్ని తయారుచేశాడు. చివరికి తన మిత్రుడు కాయ్ బర్డ్ సహాయంతో 'అమెరికన్ ప్రొమిథియస్ – ద ట్రయంఫ్ అండ్ ట్రాజెడీ ఆఫ్ జె. రాబర్ట్ ఒప్పెన్‌హైమర్' అనే పుస్తకాన్ని 2005లో ప్రచురించాడు. ప్రపంచ ప్రసిద్ధ దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ ఈ పుస్తకం ఆధారంగా నిర్మించిన తాజా సినిమా 'ఒప్పెన్‌హైమర్' (2023).

### ఆల్ఫ్రెడ్ నోబుల్ :

ఒప్పెన్‌హైమర్ హృదయ క్షోభను మనం నోబుల్ బహుమతిని నెలకొల్పిన ఆల్ఫ్రెడ్ నోబుల్ క్షోభతో పోల్చవచ్చు. పంతొమ్మిదో శతాబ్ది చివర్లో స్వీడన్ రసాయన శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబుల్ నైట్రోగ్లిసరిన్ విధ్వంసక సామర్థ్యాన్ని కనుగొని, దాన్నించి డైనమైట్‌ను తయారుచేశాడు. కొండల్ని పగలగొట్టడానికి పనికొచ్చిన ఈ సరికొత్త ఆవిష్కరణ, తదనంతరం యుద్ధాలకు, విధ్వంసాలకు సరికొత్త జోడింపు అయింది. దాంతో అతడ్ని జనాలు 'Emissary of Death' (మృత్యు రాయబారి) అని పిలిచారు. ఈ అపవాదు అతడ్ని చాలా వేధించింది. దానికి ప్రక్షాళన కోసమా అన్నట్టు అతడు 1895లో రాసిన వీలునామాలో తన అపారమైన ఆస్తిని ఓ ప్రపంచ ప్రసిద్ధ బహుమతి కోసం ధారాదత్తం చేశాడు. దీన్నే నోబుల్ బహుమతి అంటారు. వివిధ విజ్ఞానశాస్త్రరంగాల్లో సరికొత్త ఆవిష్కరణ చేసినవారికీ, సాహిత్యరంగంలో కృషి చేసిన వారికీ నోబుల్ బహుమతి ఇస్తారు. విశ్వశాంతి కోసం పాటుపడినవారికి కూడా నోబుల్ శాంతి బహుమతిని అందిస్తారు. $E = mc^2$ సూత్రంతో అణుబాంబు నిర్మాణానికి పరోక్షంగా కారణమైన ఐన్‌స్టీన్, అణుబాంబుల ప్రయోగాల తర్వాత అణ్వస్త్ర వ్యతిరేక ర్యాలీలలో పాల్గొన్నాడు. ఇటువంటి ఉదాహరణలు ప్రపంచ చరిత్ర నిండా చాలా దొరుకుతాయి.

### సినిమా కథన విధానం :

ఒప్పెన్‌హైమర్ జీవితమూ, అతడు జీవించిన కాలమూ – రెండూ చాలా సంక్లిష్టమైనవి. శాస్త్ర సాంకేతికరంగాల్లో కొత్త ఆవిష్కరణలు ఎంత త్వరగా జరుగుతున్నాయో, ప్రపంచ రాజకీయాలు కూడా అంతే నాటకీయంగా మారిపోతున్నాయి. ఈ చారిత్రక సంధి దశలో ఒక అణుశాస్త్రవేత్త జీవితాన్ని అంతే క్లిష్టమైన సినీ నిర్మాణ పద్ధతిలో నోలాన్ ఆవిష్కరించాడు. నోలాన్ సినిమా వీక్షణం ఎప్పుడూ ఒక ఛాలెంజే. ఈ సినిమా అతడి సినిమాల్లోకెల్లా విశిష్టమైనదని ఇప్పటికే సమీక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమా కథనం చాలా నాన్–లీనియర్ (ఎగుడు–దిగుడు)గా నడుస్తుంది. కథనం, వర్తమానం ఫ్లాష్ బ్యాక్‌లతో, ఫ్లాష్ ఫార్వర్డ్‌లతో దోబూచులాడుతుంది. అందుకే సినిమా చూసేముందు రెండో ప్రపంచ యుద్ధం చరిత్రా, అణుభౌతికశాస్త్ర పురోగతి చరిత్రా కొంచెం తెలుసుకోవాలి.

కథన నిర్మాణానికి వస్తే, మూడు నూలుపోగులు ఒకదానికొకటి పెనవేసుకుంటూ సాగుతాయి. కథ ప్రధానంగా ఒప్పెన్‌హైమర్ వైపు నుంచి సాగుతుంది. 1930–42 మధ్య వివిధ విద్యాలయాల్లో విద్యాభ్యాసమూ, విశ్వ రహస్యాలకూ, క్వాంటమ్ మెకానిక్స్, అణుశక్తికి సంబంధించి అతని ఆలోచనలూ, అతని అస్థిరతా, ప్రణయ గాథలూ, అలానే 1943–45 మధ్య న్యూ మెక్సికో లాస్ అలమోస్‌లో అణుబాంబు తయారీ కోసం మాన్‌హట్టన్ ప్రాజెక్టు పరిశోధనారంగపు అధినేతగా గడిచిన రోజులూ చూస్తాం. అతని కథతో రెండు ఫ్లాష్ ఫార్వర్డ్ సన్నివేశాలు నడుస్తూ ఉంటాయి. ఒకటోది Fission (విచ్ఛిత్తి) పేరుతో టెక్నీకలర్‌లో నడుస్తుంది. 1954లో ఓ మూసి వున్న గదిలో అటామిక్ ఎనర్జీ కమీషన్ (AEC) ఒప్పెన్‌హైమర్ సెక్యూరిటీ క్లియరెన్స్‌పై విచారణ జరుపుతూ వుంటుంది. ఈ విచారణ ఆఖర్లో అతడి క్యూ సెక్యూరిటీని వెనక్కి తీసుకుంటారు. ఆ విధంగా అమెరికన్ ప్రభుత్వంతో అతడి కెరియర్ అంతమైనట్లే జనజీవనంలో అతడి ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ఈ విచారణను వెనకుండి నడిపించినవాడు అటామిక్ ఎనర్జీ కమిషన్ చీఫ్ అడ్మిరల్ లూయిస్ స్ట్రాస్. స్వార్థమూ, అపార్థమూ కలిపి అతడికి ఒప్పెన్‌హైమర్‌పై ఎప్పటినుంచో కసి వుంది. ఈ సమయంలో కక్ష తీర్చుకున్నాడు. కానీ చెరపకురా చెడేవు అన్నట్టు లూయిస్ స్ట్రాస్‌కి కొద్ది సంవత్సరాల్లోనే

అదేగతి పడుతుంది. అమెరికా ప్రభుత్వంలో సెక్రటరీ ఆఫ్ కామర్స్ పోస్టు కోసం అతడు వేసిన నామినేషన్‌పై సెనేట్ (అమెరికాలో ఎగువ సభ) విచారణ జరుగుతుంది. Fusion పేరుతో బ్లాక్ అండ్ వైట్‌లో నడిచే ఈ ఫ్లాష్ ఫార్వర్డ్ 1959 నాటిది. మాన్‌హట్టన్ ప్రాజెక్ట్‌లో పనిచేసిన డేవిడ్ హిల్ తన వాంగ్మూలంలో ఒప్పీపై లూయిస్ కక్షగట్టిన సంగతిని ప్రపంచం ముందు పెడతాడు. దాంతో లూయిస్ స్ట్రాస్ రాజకీయ కెరియర్ సమాధి ఔతుంది. ఫిజన్, ఫ్యూజన్, బలమైన ప్రభుత్వాల మధ్య అణ్వాయుధాల పోటీ – ఇవన్నీ చైన్ రియాక్షన్‌లే. ఒప్పెన్‌హైమర్ జీవితంతో పాటుగా ఎన్నో గొలుసుకట్టు చర్యల్ని ఈ సినిమా విశ్లేషిస్తుంది.

## ఒప్పెన్‌హైమర్ విద్యాభ్యాసం :

యూదు కుటుంబంలో జన్మించిన ఒప్పెన్‌హైమర్ రాబర్ట్ చిన్నతనం నుండే అసాధారణ ప్రజ్ఞాపాటవాలు కనబరిచాడు. యువ రాబర్ట్ మదిని పరమాణు నిర్మాణం, క్వాంటం ఫిజిక్స్ ప్రతిపాదనలకు సంబంధించిన దృశ్యాలు కలవరపెడుతూ వుంటాయి. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చదువుతున్న అతడు ఇంటిధ్యాసతో, చాలా అస్థిరత్వంతో కనిపిస్తాడు. కావెండిష్ లేబరేటరీలో ప్రయోగాలు చేయడంలో ఇబ్బంది పడుతుంటాడు. ప్రొఫెసర్ పాట్రిక్ బ్లాకెట్ కఠినాత్ముడు. ల్యాబ్ పని పూర్తిచేసే దాకా వదలడు. ఒప్పీకి అతడిపై విపరీతమైన కోపం వస్తుంది. అతడ్ని చంపాలనుకుని ఒక యాపిల్ పండులోకి పొటాషియం సైనైడ్‌ను ఇంజెక్ట్ చేసి ప్రొఫెసర్‌గారి టేబుల్‌పై పెడతాడు. కానీ, తర్వాతి రోజు నిద్రలేవగానే మనసు మార్చుకుని, దాన్ని తొలగించాలని వెళ్లేసరికి అక్కడికి అతిథి లెక్చరర్‌గా వచ్చిన తన అభిమాన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త నీల్స్ బోర్ చేతిలో ఆ యాపిల్ కనిపిస్తుంది. నీల్ తినబోతుండగా, 'పండులో పురుగు' వుందని దాన్ని తీసుకుని పారవేస్తాడు. బోర్ ఇచ్చిన సలహా మేరకు జర్మనీ గోట్టింగెన్ విశ్వవిద్యాలయంలో సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్తగా పీహెచ్‌డీ సంపాదిస్తాడు. అక్కడ అతడు వెర్నెర్ హైసెన్‌బర్గ్, ఎన్రికో ఫెర్మి, ఎడ్వర్డ్ టెల్లర్ వంటి దిగ్గజాలను కలుస్తాడు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సహా జర్మనీలోని పేరున్న యూదు శాస్త్రవేత్తలు హిట్లర్ జాతిసంహార పాలసీ కారణంగా అమెరికాకు పారిపోయారు. పైన చెప్పిన ముగ్గురిలో వెర్నెర్ హైసెన్‌బర్గ్ 'జర్మన్ బాంబు' ప్రాజెక్టులో ఉండిపోగా, ఎన్రికో ఫెర్మి, ఎడ్వర్డ్ టెల్లర్‌లు తర్వాతి కాలంలో 'అమెరికా బాంబు' ప్రాజెక్టులో భాగమయ్యారు. క్వాంటం మెకానిక్స్‌ను యునైటెడ్ స్టేట్స్‌కు తీసుకువచ్చిన ఒప్పెన్‌హైమర్ బర్కిలీలో బోధించడం ప్రారంభించాడు. లోమానిట్జ్ అనే ఒకే విద్యార్థితో ప్రారంభించిన తరగతికి కొద్ది యేళ్లలోనే మరికొందరు హాజరౌతారు.

## అమెరికాలో వామపక్ష రాజకీయాలు :

ఒప్పెన్‌హైమర్ అధికారికంగా కమ్యూనిస్ట్ పార్టీలో చేరనప్పటికీ, అతడు వామపక్షాల పట్ల సదా సానుభూతి చూపేవాడు. అతని సోదరుడు ఫ్రాంక్, మరదలు జాకీ, సన్నిహిత స్నేహితుడు ప్రొఫెసర్ హాకోన్ చెవాలియర్ ఆ కాలంలో కమ్యూనిస్టులుగా ప్రసిద్ధి చెందినవారే. ఒప్పీ బర్కిలీలో ఉన్నప్పుడు టీచర్లకు మల్లే ప్రొఫెసర్లకు కూడా ట్రేడ్ యూనియన్ ఉండాలని వాదించి, ఎర్నెస్ట్ లారెన్స్ వంటి సీనియర్ల నుండి చీవాట్లు తిన్నాడు. స్పానిష్ అంతర్యుద్ధంలో విప్లవకారుల కోసం విరాళాలు ఇచ్చాడు. నాజీ జర్మనీ నుండి పారిపోయిన శాస్త్రవేత్తలకు ధన సహాయం చేశాడు. కమ్యూనిస్ట్ మిత్రులతో జరిగిన సమావేశంలో అతనికి జీన్ టాట్‌లాక్ అనే కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు తారసపడుతుంది. ఇద్దరూ తక్షణమే ఒకరి ఆకర్షణలో మరొకరు పడిపోతారు. వారు మొదటిసారి శారీరకంగా కలిసినపుడు అతడు సంస్కృతంలో ఉన్న 'భగవద్గీత' నుండి 'నేను మృత్యువుగా మారాను, సమస్తలోకాన్నీ కబళించే వాడిగా మారాను' అనే శ్లోకాన్ని చదివి వినిపిస్తాడు. (నిజానికి 'మృత్యువుగా మారాను' అన్న వాక్యం లేదనీ, 'కాల అస్మి' లేదా 'కాలం'గా మారాను అని మాత్రమే ఉందనీ దేవదత్త్ పట్నాయక్ చెబుతున్నారు.) రాబర్ట్ – టాట్‌లాక్ సంబంధం అతడి వివాహానంతరం కూడా కొనసాగుతుంది. ప్రొఫెసర్ రిచర్డ్ హారిసన్ భార్య, బయాలజిస్ట్, మాజీ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యురాలు కేథరీన్ 'కిట్టి' ప్యూనింగ్‌తో కూడా ఒప్పెన్ హైమర్ ప్రేమలో పడి పెళ్లిచేసుకుంటాడు. ఇలా కమ్యూనిస్టులతో అతనికున్న దగ్గరి సంబంధాలను అమెరికన్ గూఢచారి సంస్థ ఎఫ్.బీ.ఐ. ఓ కంట కనిపెడుతూనే వుంటుంది. ప్రపంచయుద్ధానంతర కాలంలో ఈ సంగతులను ప్రభుత్వం తవ్వితీసింది.

## మాన్‌హట్టన్ ప్రాజెక్ట్ :

పోలాండ్‌పై హిట్లర్ దాడి చేయడంతో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. క్వాంటమ్ ఫిజిక్సును యూదుల ఫిజిక్స్ అని నాజీలు అభివర్ణించారు. వారి యూదు వ్యతిరేకత కారణంగా ప్రపంచంలోని జర్మనీ ఆక్రమిత ప్రాంతాల్లోని ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఇతర దేశాల గుండా అమెరికాకు చేరారు. అలా చేరిన వారిలో జిలార్డ్ తదితరులు ఐన్‌స్టీన్ మద్దతుతో – కేవలం జర్మనీకి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశ్యంతో అణ్వస్త్రాన్ని నిర్మించాలని అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్‌ను కోరారు. ఆ ఫలితంగా తయారైనదే మాన్‌హట్టన్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్టుకు మిలటరీ అధికారి కల్నల్ లెస్లీ గ్రోవ్స్. అతడు ఒప్పెన్‌హైమర్‌ను ఈ ప్రాజెక్ట్‌కు సైంటిఫిక్ హెడ్‌గా ఉండాలని కోరుతాడు. ఎఫ్‌బీఐ వారించినప్పటికీ, గ్రోవ్స్‌కు ఒప్పీ సామర్థ్యంపై ఉన్న నమ్మకంతో అతడే కావాలని పట్టుబడతాడు. ఒప్పీకి చిన్నప్పటి నుండీ మెక్సికో బార్డర్‌కు దగ్గర్లోని న్యూ మెక్సికో అనే ఎత్తైన ప్రాంతం చాలా ఇష్టం. ఆ స్థలాన్నే తమ ప్రాజెక్టు కోసం ఎంచుకుంటాడు. నిర్మానుష్యమైన ఆ స్థలంలో కొద్దిపాటి రోజుల్లో ఒక చిన్న టౌన్‌షిప్ ఆవిర్భవిస్తుంది. దేశంలోని అగ్రశ్రేణి శాస్త్రజ్ఞులైన లియో జిలార్డ్, హన్స్ బెతే, రిచర్డ్ ఫెయిన్‌మాన్, ఎడ్వర్డ్ టెల్లర్, ఇసిడోర్ రబీ, వెన్నెవర్ బుష్ లాంటి వారు కుటుంబాలతో వచ్చి ప్రాజెక్ట్ స్థలంలో కాపురాలు పెడతారు. పరిశోధనలు సాగించే వేర్వేరు శాఖలు గోప్యంగా యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తాయి. న్యూ మెక్సికో, ఫిజిక్స్ సంగమ ఫలితంగా ప్రథమ అణుబాంబు తయారౌతుంది.

ఫిషన్ బాంబు ప్రయోగంలో వెలువడే వేడి వల్ల వాతావరణంలో ఫ్యూజన్ చర్య ప్రారంభమై ప్రపంచమే నాశనమౌతుందేమో అన్న సైద్ధాంతిక సందేహం వస్తుంది. ఆ విషయంపై చర్చించడానికి ఐన్‌స్టీన్‌ను రాబర్ట్ కలుస్తాడు. ఉదజని పరమాణువులను సంయోగం చేస్తూ హైడ్రోజన్ బాంబ్ (లేదా థెర్మో న్యూక్లియర్ డివైస్ లేదా సూపర్ బాంబ్) అనే ఫ్యూజన్ బాంబును తయారుచేయవచ్చున్న ప్రతిపాదనను తీసుకువస్తాడు ఎడ్వర్డ్ టెల్లర్. ఒప్పీ దీన్ని తిరస్కరిస్తాడు. ప్రాజెక్టు సాగుతున్న రోజుల్లోనే డిప్రెషన్‌తో బాధపడుతున్న జీన్ టాట్‌లాక్‌తో ఓ రాత్రి శాన్ ఫ్రాన్సిస్కో హోటల్ గదిలో రాబర్ట్ గడుపుతాడు. ఎఫ్‌బీఐ అతడ్ని ఫాలో చేస్తుంది.

తర్వాత జీన్ ఆత్మహత్య చేసుకుంటుంది. నిజానికి అది నిఘా వర్గాలు చేసిన హత్య అని కొందరంటారు. జీన్ మరణంతో కృంగిపోయిన ఒప్పీని ఓదార్చి మానసిక బలాన్ని అందిస్తుంది అతడి భార్య కిట్టీ. అణు రహస్యాలు రష్యాకు చేరుతున్నాయనే అనుమానాలు కూడా ఆ రోజుల్లోనే వ్యక్తమయ్యాయి. రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడితో వేలాది శాస్త్రవేత్తలు సాగించిన మూడేళ్ల శ్రమ ఫలితంగా మాన్‌హట్టన్ ప్రయోగాలు సత్ఫలితాలతో ఓ కొలిక్కి వచ్చాయి.

**హిట్లర్ ఓటమితో మారిన పరిస్థితి :**

స్టాలిన్ నాయకత్వంలోని రెడ్ ఆర్మీ అసామాన్య పోరాటాల ఫలితంగా 1945 మే 7న జర్మన్ ఓడిపోయింది. హిట్లర్ బంకర్లోకి దూరి ఆత్మహత్య చేసుకున్నాడు. జపాన్ నుండి మరీ పెద్ద ప్రమాదమేదీ లేదని మిత్ర పక్షాలు భావించాయి. అందుకే ఓడిన జర్మనీలోని పోట్స్‌డామ్ పట్టణంలో ఒక సమావేశం ఏర్పాటు చేసి యుద్ధాన్ని ముగించే దిశగా అడుగులు వేయాలని బ్రిటన్ ప్రధాని చర్చిల్, సోవియట్ అధ్యక్షుడు స్టాలిన్ భావించారు. కానీ రూజ్‌వెల్ట్ తర్వాత అధికార పగ్గాలు పట్టిన రైటిస్ట్ 'రిపబ్లికన్' హెన్రీ ఎస్. ట్రూమన్ ఆలోచనలు మరోలా ఉన్నాయి. హిట్లర్‌ను ఓడించిన గొప్పతనం సోవియట్‌కు దక్కిన తర్వాత, యుద్ధానంతర ప్రపంచంలో తన ప్రాముఖ్యతను ప్రతిష్టించుకునే దొంగెత్తులు ట్రూమన్ వేస్తున్నాడు. అందుకే పోట్స్‌డామ్ కాన్ఫరెన్సు డేటును పొడిగించాడు. చివరికి హిట్లర్ ఓడిన రెండున్నర నెలలు దాటాక జూలై 17, 1945న ఆ సమావేశం పెట్టుకోడానికి ఒప్పుకున్నాడు ట్రూమన్.

**ట్రినిటీ టెస్ట్ :**

పోట్స్‌డామ్ కాన్ఫరెన్సు జరిగేలోగా అణుబాంబును పరీక్షించి ఆ ఫలితాలను తన దగ్గరుంచుకుని చర్చల్లో పాల్గొనాలన్నది ట్రూమన్ ఆలోచన. అప్పటికే మూడు అణుబాంబులు తయారయ్యాయి – ఒకటి యురేనియంతో, మరో రెండు ప్లుటోనియంతో. ప్లుటోనియంతో తయారైన వాటిలో ఒకదాన్ని న్యూ మెక్సికో అలమగార్డో ఎడారిలో జూలై 16న (కాన్ఫరెన్సుకు ముందురోజు) పరీక్షించాలని నిర్ణయించారు. పరీక్ష చేస్తున్నదాన్ని బాంబు అని అనకుండా 'గాడ్జెట్' (సాధనం) అన్న మాటను మాత్రమే ప్రయోగిస్తున్నాడు ఒప్పెన్‌హైమర్. ఆ పరీక్షకు 'ట్రినిటీ పరీక్ష' అని పేరు పెట్టాడు ఒప్పీ. ('ట్రినిటీ' అనేది జాన్ డన్ కవితలో వచ్చే పదం. దాన్ని తనూ, టాట్‌లాక్ ఇష్టపడి చదివేవారు.)

ట్రినిటీ పరీక్ష విజయవంతమైంది. రాత్రంతా కురిసిన వర్షం ఆగిన తర్వాత వేకువ జామున ఐదున్నరకి ప్రథమ అణుబాంబు పరీక్ష జరిగింది. అప్పుడు వెలువడిన వేడీ, వెలుతురూ చూశాక అప్రయత్నంగానే 'నేను మృత్యువుగా మారాను, సమస్తలోకాన్నీ కబళించే వాడిగా మారాను' అనే శ్లోకాన్ని గొణిగాడు ఒప్పీ. హిట్లర్ ఓడిపోయాడు కనుక ఇక బాంబు ప్రయోగం వద్దు అని పోరుపెడుతున్న జిలార్డ్ వంటి శాస్త్రవేత్తల మాటల్ని ఒప్పీ లక్ష్యపెట్టలేదు. ఈ బాంబు పరీక్ష దృశ్యంతో అతని వెన్నులో మెల్లగా వణుకు ప్రారంభమైంది. "They knew that after Trinity, the gadget had become a weapon, and weapons were controlled by the military." (ట్రినిటీ అనంతరం గాడ్జెట్ బాంబుగా మారింది, బాంబును నియంత్రించేది మిలటరీ మాత్రమే) అని రాశారు 'American Prometheus' రచయితలు. 'గాడ్జెట్' ప్రయోగంతో ప్రభుత్వానికి ఒప్పీ అవసరం తీరిపోయింది. ఒప్పీతో మిలటరీ అధికారి గ్రోవ్స్ ప్రవర్తన కూడా మారిపోయింది. కంటి ఎదురుగా మిగిలిన రెండు బాంబుల్నీ మిలటరీ వాహనాలు మోసుకెళ్లిపోయాయి. అక్కడ పోట్స్‌డామ్‌లో ఈ విజయవంతమైన పరీక్ష వార్తను అందుకున్న ట్రూమన్ ప్రపంచ అధిపతిగా వ్యవహరించాడు.

**వెలివేయబడ్డ ఒంటరి ఒప్పీ :**

ఎంతటి పెద్ద మేధావైనా, కళాకారుడైనా, రచయితైనా, శాస్త్రవేత్తయినా ప్రభుత్వానికి అవసరం తీరాక ప్రక్కకి తొలగాల్సిందే. జపాన్‌పై అణుబాంబులు వేయడానికి అమెరికా దొంగ కారణాలు చాలా చెప్పింది. జపాన్‌లో ఎటువంటి బాంబు దాడికీ గురికాని రెండు 'వర్జిన్ సిటీస్'పై బాంబులు వేసి, ప్రయోగఫలితాలు చూడాలనీ, రానున్న రోజుల్లో ప్రపంచాన్ని భయపెట్టాలనీ అమెరికా ఆలోచన. ఆగస్టు 6న హిరోషిమాపై 'లిటిల్ బాయ్' (బుల్లబ్బాయి) అనే యురేనియం బాంబును ప్రయోగించారు. మరో మూడు రోజుల్లో ఆగస్టు 9న నాగసాకిలో 'ఫ్యాట్‌మాన్' (లావుమనిషి) అనే ప్లుటోనియం బాంబు వేశారు. (నిజానికి సన్నగా వుండే ఒప్పెన్‌హైమర్ 'లిటిల్‌బాయ్' ఐతే, చాలా లావుగా వుండే లెస్లీ గ్రోవ్స్ 'ఫ్యాట్‌మాన్' అని చెప్పాలి.) క్షణాల్లో లక్షలాదిమంది బూడిదయ్యారు. ఆ తర్వాత కొన్ని రోజుల్లో, వారాల్లో, నెలల్లో, సంవత్సరాల్లో బాంబు ఫలితాల వలన, రేడియేషన్ వలన మరికొన్ని లక్షల మంది చనిపోయారు.

"The use of the atom bomb showed that a psychologically very normal and democratically elected chief executive could use the weapon just as the Nazi dictator would have used it. In this way, the United States—for anyone concerned with moral distinctions in the different types of government—blurred the difference between fascism and democracy." అనంటాడు చరిత్రకారుడు గాబ్రియల్ జాక్సన్. హిట్లర్ అణుబాంబు తయారుచేస్తే ప్రయోగించే వాడేమో! అమెరికా తయారు చేసింది, అవసరం లేకపోయినా జనాలపై వేసింది. ఫాసిజానికీ, సోకాల్డ్ ప్రజాస్వామ్యానికీ మధ్య విభజన రేఖ చెరిగిపోయింది. మిలటరీ వాళ్ల ఆలోచనలు ఎంత క్రూరంగా వుంటాయంటే ఓ సైనికాధికారి ఎండ్రీ స్టిమ్సన్ క్యోటో నగరంలో హనీమూన్ చేసుకున్నాడు కనుక ఆ నగరానికి మినహాయింపట! బాంబు వేయాల్సిన నగరాల ఎంపిక సమావేశంలో ఒప్పీ ఉన్నాడు. హిరోషిమా బాంబు వరకూ అతడు ఓకే. 'ఒక అతి పెద్ద బాంబు ప్రయోగం తర్వాత శాశ్వతంగా యుద్ధాలు జరక్కుండా చూడవచ్చు' అన్న అతడి ఊహ తర్కసమ్మతమైనదిగా అన్పించదు. కానీ నాగసాకీ ప్రయోగం తర్వాత రాబర్ట్ ఆలోచనలు చాలా వరకు మారాయి. ఓడిపోయిన మనిషిలా, మోసగించబడ్డ మనిషిలా, అపరాధ భావనతో ఒంటరితనంలోకి కూరుకుపోయాడు.

**విజయోత్సవాల్లో మూర్తీభవించిన విషాదం :**

మాన్‌హట్టన్ హాలులో జరిగిన అభినందన సభ, అక్కడ ఒప్పెన్‌హైమర్‌గా సిలియన్ మర్ఫీ నటన చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. మనసొకలా, మాటొకలా ట్రాన్స్‌లో ఉన్న మనిషిలా అతడు ఉపన్యసిస్తాడు. హాలంతా దేశభక్తితో వెర్రికేకలు వేస్తూ ఉంటుంది.

'ఈ రోజును ప్రపంచం గుర్తుంచుకుంటుంది' – అని ఒప్పీ అనగానే విపరీతమైన చప్పట్లు. 'ఏదేమైనా జపాన్ మాత్రం దీన్ని హర్షించదు' – హాల్లో ఒకటే కేరింతలు. హాలంతా అణుబాంబు వెలుగుతో నిండిపోయినట్టు అనిపిస్తుంది. ఒకమ్మాయి ముఖం నుండి చర్మం కరిగి రాలిపోతున్నట్టు కన్పిస్తుంది. అన్యమనస్కంగా స్టేజి దిగి వస్తుంటే అతడి కాలు బొగ్గుగా మారిన మృతదేహం మీద పడుతుంది. ఓ జంట ఏడుస్తూ కనిపిస్తుంది. ఒకడు వాంతులు చేస్తూ కనిపిస్తాడు. హిరోషిమా, నాగసాకీల దృశ్యాలే అతడికి భ్రమలుగా కన్పిస్తుంటాయి. కానీ నోలాన్ హిరోషిమా నాగసాకీల వాస్తవాలను పచ్చిపచ్చిగా చూపకుండా కళాత్మకంగా చూపాడు. ఈ విషయాన్ని అణు వ్యతిరేక కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

## ఒప్పెన్‌హైమర్ పతనం :

నేషనల్ హీరోలా మారిన రాబర్ట్ తన పరపతితో అణ్వస్త్ర వ్యాప్తిని నిరోధించే ప్రయత్నాలు చేయొచ్చని అనుకుంటాడు. ఎడ్వర్డ్ టెల్లర్ హైడ్రోజన్ బాంబు నిర్మించాలని ప్రస్తావన మళ్లీ తీసుకొచ్చినపుడు మళ్లీ తిరస్కరిస్తాడు. అటామిక్ ఎనర్జీ కమీషన్ చీఫ్‌గా ఉన్న లూయిస్ స్ట్రాస్‌కు కమీషన్ ఎడ్వయిజరీగా ఉన్న రాబర్ట్ ప్రవర్తన బొత్తిగా నచ్చడం లేదు. ఐన్‌స్టీన్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలకు తన గురించి తప్పుగా చెప్పాడనీ, ఒక పబ్లిక్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తన గురించి ఎగతాళిగా మాట్లాడాడనీ రాబర్ట్‌పై కసి వుంటుంది లూయిస్‌కు. ట్రూమన్ ముందు తన అపరాధ భావన వెలిబుచ్చి, అతడి కోపానికి గురౌతాడు ఒప్పీ. అదే ట్రూమన్ తన బలంతో స్ట్రాస్ లెఫ్టినెంట్ కల్నల్ కెన్నెత్ నికోల్స్‌ను ఉపయోగించి రాబర్ట్ భద్రతా ఫైల్‌ను సంపాదిస్తాడు. దాన్ని విలియమ్ బోర్డెన్ అనే మోసకారి న్యాయవాదికి అందించగా అతడు రాబర్ట్‌పై సోవియట్ గూఢచారి అన్న అభియోగం మోపి అతని ప్రభుత్వ సన్నిహితుడి హోదాను (సెక్యూరిటీ క్లియరెన్స్) కాలరాసే విచారణలోకి ఈడుస్తాడు. మెకార్తీ–యుగపు కమ్యూనిస్టుల వేట, సోవియట్ ఫోబియా రాజ్యమేలుతున్న ఆ కాలంలో రాబర్ట్‌కు జరగాల్సిన నష్టం జరగనే జరుగుతుంది. ఒప్పీకి జరిగిన ఈ అన్యాయం మాన్‌హట్టన్‌లో పనిచేసిన చాలామంది శాస్త్రవేత్తలను బాధిస్తుంది. వారిలో ఒకడైన దేవిడ్ హిల్ లూయిస్ స్ట్రాస్ రాజకీయ ఎదుగుదలకు తన వాంగ్మూలంతో అడ్డుకట్ట వేస్తాడు.

## ఒప్పెన్‌హైమర్ – ఐన్‌స్టీన్ సంభాషణ :

ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో లూయిస్, ఒప్పీ మాట్లాడుకుంటూ కిటికీలోంచి చూస్తే ఎదురుగా మైదానంలో ఐన్‌స్టీన్ కనిపిస్తాడు. 'నిన్ను ఐన్‌స్టీన్‌కు పరిచయం చేస్తా' అంటాడు ఒప్పీతో లూయిస్. 'ఆయనతో నాకెప్పటి నుంచో పరిచయం' – బదులిస్తాడు ఒప్పీ. అదెంతో అవమానంలా అన్పిస్తుంది లూయిస్‌కి. ఒప్పీ ఐన్‌స్టీన్‌ను సమీపించేసరికి ఆ వృద్ధ శాస్త్రవేత్త ధరించిన టోపీ కిందపడుతుంది. దాన్ని అతడి చేతికందిస్తూ అతడితో సంభాషిస్తాడు ఒప్పీ. ఫిషన్ బాంబు సృష్టించబోయే వాతావరణ గొలుసుకట్టు చర్య గురించి ఒకప్పుడు తనతో చర్చించిన సంగతిని ఐన్‌స్టీన్‌కు గుర్తుచేస్తాడు ఒప్పీ. ట్రినిటీతో, హిరోషిమా – నాగసాకీ ప్రయోగాలతో అటువంటి ఛాన్సు 'జీరో' అని రుజువైంది. కానీ శక్తివంతమైన బాంబు ప్రజావ్యతిరేక రాజకీయ శక్తుల చేతుల్లోకి వెళ్ళిపోతే, అణ్వాయుధాల నిర్మాణపోటీ అనే గొలుసుకట్టు చర్య ద్వారా ప్రపంచానికి నిజంగానే ఏర్పడ్డ ప్రమాదం గురించి వారు మాట్లాడుకుంటారు. దూరం నుంచి గమనించిన లూయిస్ తన గురించే మాట్లాడుకుంటున్నారని భయపడ్డాడు. అణుబాంబు నిర్మించాక కూడా సోవియట్ అటువంటి బాంబు తయారుచేసేస్తుందేమోనని అమెరికా భయపడింది. సోవియట్ ఆ పని చేసిందని తెలిశాక, అమెరికా హైడ్రోజన్ బాంబు తయారు చేసింది. సోవియట్ జార్ బాంబు తయారుచేసింది. వేరే దేశాలు ఫాలో అయ్యాయి – ఆఖరుకు ఇండియా, పాకిస్తాన్, కొరియా కూడా...! ఇన్ని ఆయుధాలతో, ఒకప్పుడు విమానాలతో అణుబాంబులు వేయాల్సిన పరిస్థితి నుండి నేడు ఖండాంతరాలకు న్యూక్లియర్ వార్‌హెడ్‌లను మోసుకుపోగల 'ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్స్' తయారయ్యాయి. జె. రాబర్ట్ ఒప్పెన్‌హైమర్‌కు ఎప్పుడూ కనిపించే భయాలూ, భ్రమల దృశ్యం మరలా కళ్ల ముందు కనిపిస్తుంది. అతడు కళ్లు మూసుకుంటాడు.

## సినిమా గొప్పతనం :


నోలాన్ తన కళాత్మక దృశ్యాలతో, నిగూఢార్థాన్నిచ్చే దృశ్యాలతో ఒక మాస్టర్ పీస్‌ను నిర్మించాడు. నీటి తరంగాలను చైన్ రియాక్షన్‌ను సూచించే విధంగా సినిమా ఆదిలో, మధ్యలో, అంతంలో చూపాడు. టోపీ ధరించడం, ధరించకపోవడం, దృశ్యంలో కలర్ ఉండడం, ఉండకపోవడం – ఇలా ఎంతో గూఢార్థాలతో చిత్రీకరణ చేశాడు. రాబర్ట్ జీవితం, ఫిషన్, ఫ్యూజన్ సన్నివేశాలూ, అతడు చర్చించిన ప్రపంచ రాజకీయాలూ, శాస్త్ర పురోగతి అంశాలూ అన్నింటిలో ఈ చైన్ రియాక్షన్‌ను దర్శింపజేశాడు. ఫ్యూజన్‌ను మినహాయించి ప్రతి సన్నివేశాన్నీ ఒప్పెన్ హైమర్ దృష్టికోణం నుంచి తీశాడు కనుకనే సినిమాకు కథానాయకుడి పేరే పెట్టాడు. ప్రతి దృశ్యాన్నీ చాలా జాగ్రత్తగా పరిశీలిస్తే, సూక్ష్మ వివరణలు కనిపిస్తాయి. ఉదాహరణకు జీన్ టాట్‌లక్ మెడను పట్టుకుని, బాత్ టబ్‌లోకి ముంచే గ్లవ్స్ ధరించిన ఓ చేయి రెండు సెకెండ్ల పాటు మాత్రమే కనిపిస్తుంది. అంటే అది నిఘా వర్గాలు చేసిన హత్య అనే సూచన వుంది. అలానే ఒప్పీ భార్య కిట్టీ తన భర్తకు వెన్నుపోటు పొడిచిన ఎడ్వర్డ్ టెల్లర్‌తో షేక్‌హ్యాండ్ చేయనిరాకరిస్తున్నప్పుడు ఆమె చేతి బొటన వేలు భంగిమను గమనించవచ్చు. సెక్యూరిటీ విచారణలో నగ్నంగా ఒప్పీ, అతడిపై టాట్‌లాక్ దృశ్యం కూడా! దర్శకుడి డిటైలింగ్స్‌ను పట్టిచ్చే చాలా అంశాలు కనిపిస్తాయి సినిమా నిండా. అలానే సంభాషణలు కూడా అలా గుర్తుండిపోతాయి. ఉదాహరణకు, "Theory will take you only so far." (ఒప్పీ) "Amateurs chase the sun and get burned. Power stays in the shadows." (లూయిస్) చాలా పాత్రలూ, సంఘటనలూ సంక్లిష్టంగా వుండడం వల్ల ఈ సినిమాను మళ్లీ మళ్లీ చూడాల్సి వుంటుంది. సిలియన్ మర్ఫీ, రాబర్ట్ డౌని జూనియర్ లాంటి మ్యాట్ డామన్, ఎమిలీ బ్లంట్, ఫ్లోరెన్స్ పుఘ్, రమీ మలిక్, టామ్ కోంటీ ప్రసిద్ధ నటీనటులు అద్భుతంగా నటించారు. ఈ ఏడాది ఉత్తమ నటుల అవార్డుల రేసులో సిలియన్ మర్ఫీ, రాబర్ట్ డౌని జూనియర్‌లు ముందుండవచ్చు. స్వీడిష్ సంగీతకారుడు లుడ్విగ్ గోరాన్సన్ నేపథ్య సంగీతం, ఒప్పీ దృష్టికోణాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన అంద్రూ జాక్సన్ విజువల్స్ ఈ సినిమాకు ప్రాణం. ఐమాక్స్ కెమేరాలతో చిత్రీకరించిన సినిమా కనుక పెద్ద తెర మీద చూడడమే మంచిది.✷

## పుస్తక పరిచయం

# అడివి బాపిరాజు వ్యక్తిత్వం - సాహిత్యంపై రెండు సంపుటాలు

**'అఖిల** కళావైభవ శ్రీ'గా సోమసుందర్‌చే ప్రశంసలందుకున్న అడివి బాపిరాజు 70వ వర్ధంతి సందర్భంగా మండలి బుద్ధప్రసాద్, డా॥ నాగసూరి వేణుగోపాల్‌ల పూనికతో రెండు సంపుటాలు శ్రీ రాఘవేంద్ర ప్రచురణగా మార్చి 2023లో విడుదల అయ్యాయి.

తెలుగు సాహితీలోకంలో అడివి బాపిరాజు 'నారాయణరావు', 'తుపాను', 'కోనంగి', 'గోన గన్నారెడ్డి', మొదలగు నవలల రచయితగా, దాదాపు 40 కథల రచయితగా సుప్రసిద్ధుడు. కాని ఆయన జీవించిన 56 సంవత్సరాల కాలంలో వివిధ లలితకళల్లో కృషిచేశారు. కూల్డ్రే, ప్రమోదకుమార చటర్జీలు వద్ద తన చిత్రకళా కృషిని కొనసాగించారు. 'ధనుర్దాసు', 'కబీరుదాసు', 'భిక్షుకి', 'తిక్కన', 'సుందరి-నందుడు', 'ధన్వంతరి', 'శర్మిష్ట - యయాతి', 'అశ్వినీ దేవతలు', 'శ్రీకృష్ణ', 'యోగేశ్వరీ శివ', 'సూర్యదేవుడు', 'వాగ్దేవి', 'భారతి పత్రిక ముఖచిత్రం', 'వేణీ భంగము', 'సముద్ర గుప్తుడు', 'శివ తాండవము', 'శశికళ', 'నటరాజు', 'జీవితము - మృత్యువు', 'గౌరీశంకరులు', 'మృత్యుంజయుడు', 'గౌరీపూజ', 'శ్వేతతార', 'సుందరి', 'శబ్ద బ్రహ్మ', మొదలగు చిత్రాలేగాక, విశ్వనాథ సత్యనారాయణ పుస్తకాలు 'కోకిలమ్మ పెళ్ళి', 'కిన్నెరసాని పాటలు', 'శృంగారవీధి'లోని కవితలకు, 'ఎంకి పాటల'కూ, తన గేయ సంపుటాలకు రేఖాచిత్ర రచన చేశారు. కేవలం చిత్ర కళాకారునిగానే గాక, ఆయన 'చిత్రకళా ప్రదర్శనలలో, సాహిత్య వేదికలపై గంటల తరబడి ఆంధ్ర సంస్కృతిని గూర్చి, లలిత కళాప్రాశస్త్యాన్ని గూర్చి, జానపద సాహిత్యాన్ని గూర్చి, గాంధీ ఆదర్శాల గూర్చి ఉత్సాహంతోనూ, ఉల్లాసంతోనూ, ఉద్రేకంతోనూ, అభినివేశంతోనూ, అభిమానంతోనూ" ఉపన్యసించేవారు. (పుట 17) ఆ తర్వాత కాలంలో చిత్రకళపై ఉపన్యాసాలు ఇచ్చి, వ్యాసాలు వ్రాసినవారు సంజీవదేవ్, ఎస్వీ రామారావులు మాత్రమే కనబడుతున్నారు.




1922 నాటి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని అరెస్టయి బాపిరాజు ఆరు నెలలు కడలూరు జైలులో వున్నారు. (ఉప్పు సత్యాగ్రహంలో అని 491, 638 పుటల్లో వున్నది తప్పు - అది 1930లో జరిగింది) తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి గతంలో నిర్బంధింపబడిన గదిలో వున్న బాపిరాజు చిత్రాలు గీస్తూ, ఖైదీలపై గేయాలు రాస్తూ వుండేవారు.

బాపిరాజు గాంధీ భక్తుడు. గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టినవాడు. రాయలసీమ తొలి జర్నలిస్టు గుత్తి రామకృష్ణ 1936లో అనంతపురం నుంచి వచ్చి బందరు జాతీయ కళాశాలలో చేరారు. ఆయన మిత్రుడు, అనంతపురం సమీప గ్రామానికి చెందిన మాల కులస్తుడు జోసఫ్ అల్లరి చిల్లరగా తిరిగి చెడ్డపేరు తెచ్చుకున్నవాడు, ఏడు రోజులపాటు కాలినడకతో బందరు వచ్చి, గుత్తి రామకృష్ణ సహకారంతో అదే కళాశాలలో చేరాడు. ఆ కళాశాలకు ప్రిన్సిపల్‌గా వున్న బాపిరాజు అతని కులం తెలియచేసే పేరు మార్చి ప్రభాకర్‌గా పెట్టారు. హాజరుపట్టీలో కూడా కొత్తపేరే రాశారు. అంటరానితనాన్ని పాటించే బాపిరాజు తల్లి ప్రభాకర్ కులం తెలియక, అతనికి జ్వరం వచ్చినపుడు సపర్యలు చేశారు. ఆ తర్వాత కులం తెలిసి బాధపడ్డారు. కాని ఆమె ఆగ్రా రాధాస్వామి భక్తురాలు. రాధాస్వామి సర్వమానవతా భావం కలవారు కదా అని ఆమెకు బోధపరచి ఆమె బాధను పోగొట్టారు (పుట 101) ఈ ప్రభాకరే. కళాశాల విద్య అనంతరం వార్ధాలోని గాంధీ ఆశ్రమం చేరి ప్రభాకర్‌జీగా ప్రసిద్ధి చెందారు. సర్వోదయ ఉద్యమ నాయకునిగా, వినోబా శిష్యునిగా, గాంధీ స్మారక నిధి సంస్థ నిర్వాహకునిగా పనిచేస్తూ 1977 ఉప్పెనలో సహాయ కార్యక్రమాలు చేస్తూ రోగగ్రస్తుడై మరణించారు.

బాపిరాజు సినిమారంగంలో కళాదర్శకునిగా పనిచేశారు. 1936 ప్రాంతంలో కలకత్తాలో సి. పుల్లయ్య దర్శకత్వం వహించిన 'సతీ అనసూయ - ధృవ విజయం' జంట చిత్రాలకు కళాదర్శకునిగా పనిచేశారు. 'మీరాబాయి' చిత్రానికి, 'దక్ష యజ్ఞం' చిత్రాలకూ పనిచేశారు. 'సతీ అనసూయ'లో మంచు కురిసే హిమాలయాల్లో వుండే కైలాసం సృష్టించడానికి ఫ్రెంచి చాక్‌పౌడర్ పై నుంచి జారిపడేటట్లు చేసి, మంచుపడుతున్నట్లు సృష్టించారు. సతీ అనసూయ త్రిమూర్తులను పసివారిగా మార్చి బారెడు జుట్టు మోకాళ్ళ వరకు శరీరాన్ని కప్పివేయగా నగ్నంగా వారికి అన్నం తినిపిస్తుంది. ఇది బాపిరాజు ఆలోచనే! "చిత్రకళలో మంచి పరిజ్ఞానం వున్నవారిని కళాదర్శకులుగా తీసుకునే ఆచారం బాపిరాజుతోనే ప్రారంభమైంది" అని బొమ్మకంటి సుబ్బారావు అన్నారు. (పుట 744) ఆ తర్వాత తరంలో ప్రముఖ ప్రజాచిత్రకారుడు మాధవపెద్ది గోఖలే ఆర్ట్ డైరెక్టర్‌గా రాణించారు. బాపిరాజు సినీ కళాదర్శకునిగా చేసిన కృషిని విపులంగా రెంటాల జయదేవ రాశారు. (పుట 733)

నవ్య సాహిత్య పరిషత్తు వార్షిక సభల్లో ప్రదర్శించే నాటకాలకు బాపిరాజు ఆర్ట్ డైరెక్టర్‌గా వుండేవారు. అంతేగాక, ఆ రోజుల్లో మైకులు

లేవు గనుక బాపిరాజు ఒక కొత్త సాంకేతిక కనిపెట్టారు. "వేదికపైన వెదురుబొంగుల అటక కట్టి వాటిపై కొత్త కుండలను బోర్లించారు. ఈ చిట్కా వల్ల నటుల సంభాషణలు ప్రేక్షకులకు స్పష్టంగా వినబడేవి. రంగస్థలంలో తెరలు ఉపయోగించడంలోనూ కొత్తదనం సాధించారు. నాటకంలోని వివిధ రంగాలలో కథా వస్తువును బట్టి తెలుపు, ఎరుపు, నీలిరంగు తెరలను, సత్త్వ రజ స్తమో గుణాలను ప్రతీకలుగా వాడేవారు. (పుట 102) ప్రజా నాట్యమండలి తొలి సంవత్సరాలలో నాటకాలలో తెరలను ఈ విధంగా వాడేవారు.

1940లో మిత్ర బృందంతో కలసి అజంతా – ఎల్లోరా చిత్రాలు చూసి, ఆ యాత్ర విశేషాలతో 'నా తీర్థయాత్ర – ఎల్లోరా, అజంతా' అనే యాత్రా గ్రంథం రాశారు. 1951లో ఆనాటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వ ఆదేశంపై (భారత ప్రభుత్వం కాదు. పుట 662) శ్రీలంకలోని సిగీరియా గుహల్లోని కుడ్యచిత్రాల ప్రతిరూపాల సేకరణపై ఏర్పడిన కమిటీకి బాపిరాజు సారథ్యం వహించారు. ఆయన 'తిక్కన' వర్ణచిత్రం 1932లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి బహుమతిని పొందిందిగాని, దానిలో కొన్ని మార్పులు చేయమని వారు సూచించగా, దానికి ఇష్టపడక బహుమతిని తిరస్కరించారు. (పుట 187). వారి ప్రసిద్ధ చిత్రాలు, 'శబ్ద బ్రహ్మ', డెన్మార్కు మ్యూజియంలోనూ, 'భాగవతీ పురుషుడు', తిరువాన్కూరు రాజసౌధంలోనూ, 'సూర్యదేవ', కూచ్ బీహార్‌లోనూ, 'సముద్ర గుప్త', అల్లాడి కృష్ణస్వామి అయ్యర్‌గారింటిలోనూ, సిగీరియా చిత్రాలు చెన్నై మ్యూజియంలోనూ వున్నాయి. (పుట 601, 821).

అడివి బాపిరాజు ఒక ప్రజాస్వామ్యవాది. ప్రజల పక్షాన నిలబడిన ఆయన వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తూ ఆయన శతజయంతి సందర్భంగా 'ప్రజాసాహితి' జులై 1995లో ప్రచురించిన ప్రత్యేక సంచికలో రాంభట్ల కృష్ణమూర్తి, కొత్తపల్లి రవిబాబు రాసిన వ్యాసాలు ఈ పుస్తకాలలో పునః ప్రచురించారు. మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సమయంలో 'మీజాన్' పత్రిక సంపాదకునిగా ఆయన ప్రజలకు అందించిన ఆంధ్ర మహాసభ (సంగం) వార్తలు, దొడ్డి కొమరయ్య అమరత్వాన్ని జ్ఞాపకం చేసుకుంటూ కడివెండి దినంనాడు 'మీజాన్' ప్రత్యేక సంచికను ప్రచురించిన వైనం ఈ వ్యాసాలలో ప్రస్తావించారు. (పుటలు 226, 532, 608)

బాపిరాజు రాసిన దాదాపు 40 కథలలో కనీసం డజను కథల్లో సాధారణ ప్రజల, వివిధ కులవృత్తులలో వున్న బడుగు జనుల జీవన పోరాటాన్ని చూడవచ్చు. రజాకార్ల దౌష్ట్యాన్ని, హరిజన సమస్యని, దేశ విభజన ప్రభావాన్నీ, సోదె అక్కనీ, కోయ పడుచునీ, ఒంటెద్దు బండివాణ్ణీ, బిచ్చగత్తెనీ, తోటమాలి కూతుర్నీ, పడవ నడిపేవాడినీ ఆయన కొన్ని కథల్లో చిత్రించారు. (పుట 135)

1944లో హైదరాబాద్ బాపిరాజు సంస్థాన అభ్యుదయ రచయితల సంఘం అడివి అధ్యక్షునిగా, భాస్కరభట్ల కృష్ణారావు, ఎల్లాప్రగడ సీతాకుమారి, వట్టికోట ఆళ్వారుస్వామి కార్యదర్శులుగా ఏర్పడింది.

అడివి బాపిరాజు నవలలు, కథలు సంపుటాలుగా వచ్చాయిగానీ, 'కిన్నెర', 'నవోదయ', 'ప్రతిభ', 'త్రివేణి', 'జయంతి', 'ఆంధ్రమహిళ', 'భారతి', 'మీజాన్' పత్రికలలో ఆయన రాసిన వ్యాసాలు పుస్తక రూపంలో రాలేదు. వాటిలో కొన్నిటిని, రెండు కథలను, కవితలను, గేయాలను, కూల్డ్రే, ముట్నూరి, దామెర్ల రామారావులపై వ్యాసాలను, విశ్వనాథపై ఉపన్యాసాన్నీ, సినిమా కళపై వ్యాసాన్నీ, జానపదుల పదాలపై రేడియో ప్రసంగాన్నీ, మొదలైనవాటిని మొత్తం 40 రచనలను ఈ సంపుటిలో పొందుపరిచారు. 'మీజాన్' పత్రిక ఎక్కడా లభ్యం కావడంలేదు గనుక ఆ పత్రికలో వారు రాసిన వ్యాసాలు, కవితలు గురించి సమాచారం – వారి సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ పొందిన ఆరుగురికి కూడా అందుబాటులో లేకుండా పోయాయి.

కూల్డ్రే ఇంగ్లీషులో రాసిన వ్యాసంతోపాటు, అడివి బాపిరాజు సమకాలికులైన విశ్వనాథ, కృష్ణశాస్త్రి, దాశరథి, ఇంద్రగంటి, తిరుమల రామచంద్ర, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, బొమ్మకంటి సుబ్బారావు, ఆచంట జానకీరాం, ఆర్. వసుంధరాదేవి, జలసూత్రం, మొదలగు రచయితల 39 రచనలు తొలి సంపుటిలో వున్నాయి. మరో రెండు విభాగాలలో సోమసుందర్, లత, పురాణం, అక్కిరాజు, సంగిశెట్టి శ్రీనివాస్, కోడూరు శ్రీరామమూర్తి, మండలి బుద్ధప్రసాద్, మాకినీడి సూర్యభాస్కర్, సుంకర చలపతిరావు, కల్లూరి భాస్కరం, అమ్మంగి వేణుగోపాల్, కొండపల్లి శేషగిరిరావు మొదలగు 50 మంది రచయితల వ్యాసాలున్నాయి.

సంపాదకుడు నాగసూరి వేణుగోపాల్ ఈ పుస్తకాలకు సంపాదకీయంలో 'బాపిరాజును విమర్శించే వ్యాసాలు కూడా ఇందులో' చేర్చిన విషయం ప్రస్తావించారు. వాటిలో వెల్చేరు నారాయణరావు, బుచ్చిబాబు, అమ్మంగి వేణుగోపాల్ వ్యాసాలు ముఖ్యమైనవి. బాపిరాజు 'నారాయణరావు' నవల శుద్ధ గ్రాంథికంలో వున్నదన్న ఆరోపణ (పుటలు 634, 754) అంగీకారయోగ్యం కాదు. 'ఉదాత్తమైన సంస్కృత సమాసాలు, వెనువెంటనే అతి లలితమైన తేట తెలుగు పదాలు' ఆ నవలాశైలి (పుట 575).

ఆయన అఖిల కళావైభవ శ్రీ. చిత్రకారునిగా, నాట్యం, శిల్పం అధ్యయనపరునిగా, నవలారచయితగా, కవిగా, పత్రికా సంపాదకునిగా, కథారచయితగా, ప్రిన్సిపల్‌గా, లాయర్‌గా, సినీ కళాదర్శకునిగా, బౌద్ధ అధ్యయనశీలిగా, వైద్యం, జ్యోతిషం, హస్త సాముద్రికం, మతం, తత్త్వశాస్త్రం, రాజకీయాలు మొదలగు విషయాలేగాక కళలు, శిల్పంపై వక్తగా, సముద్రంలో బాగా అందంగా ఈదకల్గినవాడిగా (పుట 243) – ఆయన అఖిల కళావైభవశ్రీ.

భార్య నరాల వ్యాధితో పడకపట్టినా, పెద్ద కూతురుకు పోలియో వచ్చినా, కొడుకు మరణించినా – ఇన్ని ఈతిబాధలు పడుతూ బాపిరాజు చేసిన కృషి అనితరసాధ్యం. ఇన్నిటిపై ఎలా సాధికారత సాధించారని అడిగితే తన ఇంటిపేరును ఉదహరిస్తూ "అడవిలో అన్ని జాతుల చెట్లు పెరుగుతాయి" అని ఛలోక్తి వేయడం కూడా ఆయనకే తగును.

**(అఖిల కళావైభవశ్రీ అడివి బాపిరాజు : (సాహితి, చిత్రలేఖన, శిల్ప, నాట్య, సంపాదక, సినీ కళానైపుణ్యాల విశ్లేషణ) – సంపాదకులు. డా॥ నాగసూరి వేణుగోపాల్, 1/8 డెమ్మీలో తొలి సంపుటి 30+452. మలిసంపుటి 374 పుటలు. ఒక్కొక్క సంపుటి వెల : రూ.500/- ప్రథమముద్రణ : మార్చి 2023. ప్రతులకు : శ్రీ రాఘవేంద్ర ప్రచురణలు. దిట్టకవి రాఘవేంద్రరావు వీధి, ఇన్నర్ రింగ్‌రోడ్ (అంబాపురం) విజయవాడ – 520012. ఫోన్ : 94948 75959. లేదా హైదరాబాదు – ఫోన్ : 90324 28516).**

✷

కవిత

# ఒరేయ్, ఒరేయ్.. ఇదేం బుద్ధిరా....!

- చింతాడ కృష్ణారావు

**వికాసాన్ని** చిదిమేసే
విజ్ఞానాన్ని అణిచేసే
శాస్త్రీయతను ఛిద్రం చేసే
ఒరేయ్ ఇదేం బుద్ధిరా

ఆదిమ యుగంలోకి వెళ్తావా
చీకటి గుహలో కుంచించుకుపోతావా
అంధకారబంధురంలో బంధీవవుతావా
ఒరేయ్, ఒరేయ్ ఇదేం ఆలోచనరా

ఆధునిక యుగంలో ఉంటూ
సదుపాయాలన్నీ చంకలో పెట్టుకుంటూ
సాంకేతికతను ఎంచక్కా వాడుకుంటూ
సిగ్గయినా లేకుండా ఇవేం మాటలురా

బ్రూనోను చంపేసి
కోపర్నకస్‌ను హతమార్చేసి
ప్రశ్నించేవారిని పాతరేసిన
మెదడులేని మూర్ఖుల్లారా

సైన్స్ రంగంలో ఇచ్చే
అవార్డులు రద్దేమిటి...?
శాస్త్ర సాంకేతిక శాఖే
ప్రకటించడమేమిటిరా

శాస్త్రీయత రాజ్యాంగ హక్కు
ఆర్టికల్ 51 ఎ(హెచ్) అదే చెబుతోంది
ఉష్ట్రపక్షుల్లా భూమిలో తలలుపెట్టుకున్నారా
గబ్బిలాల్లా నిరంతరం నిద్రపోతున్నారా

ఉదయాన్ని చూడలేని
వెలుగును భరించలేని
నిజాన్ని వినే ధైర్యం లేని
మీరెందుకురా మా మధ్య

వివిధ మతగ్రంథాల్లో అన్నీ ఉంటే
అందులోనే విజ్ఞానముంటే
మీ పిల్లలచే అవే చదివించుకోండి
నమ్మకముంటే ఆ బాటలోనే నడుచుకోండి

కరెంటు వెలుగులు మీకెందుకు
ఏసీ, కూలర్లకు దూరం జరగండి
విమానాల విహారాలను విరమించండి
నంగనాచితనాలు మానండిరా

(పాఠ్యాంశాల నుంచి పలు సైన్స్ పాఠాలు తొలగింపులు,
శాస్త్రీయ పరిశోధనలు చేసేవారికి ఇచ్చే ప్రోత్సాహకాలు
రద్దు చేయడాలు, ప్రశ్నించేవారిని వేధించడాలకు పాల్పడుతున్న
బీజేపీ సర్కారు వైఖరికి నిరసనగా....)

కవిత

# గవాక్షమై

- ఏటూరి నాగేంద్రరావు

**ఎవరూ** భుజాలు తడుముకోవద్దు దయచేసి!
కుర్చీలో నుంచి లేచినంత సులభం కాదు.
ప్రతీ దానిపట్ల సమభావం, సమదృష్టి కలిగి ఉండటం.
హృదయాన్ని కదిలించే సన్నివేశాలకి కన్నీళ్ళొస్తాయి తప్ప
చేతులు యథాస్థానంలోనే ఉంటాయి.
విషాదమేమిటంటే
మానవీయ సూక్తులన్నీ బుద్ధిగా
టేబుల్ మీద తిష్ట వేస్తాయి.
ఎవరు నెడుతున్నారో
తెలియక జెండాలు ఆవేశంగా ఎగురుతుంటాయి.
నన్ను కాకుండా లోకాన్ని ప్రేమించడానికి నాకు నేను శిలువ వేసుకొన్నాను ఓ దగ్ధగీతమై!
మహాదేవిడీల ఆవరణలో కొత్త గవాక్షాన్నవుతూ!

# అధ్యాపకురాలు తేజస్విని దేశాయ్‌పై మతతత్త్వవాదుల వీరంగం

**తేజస్వినీ** దేశాయ్ (52) మహారాష్ట్రలోని కొల్హాపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజిక్సు విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

జూన్ 8న ఒక అధ్యాపకుడు సెలవు పెట్టినందున అతని క్లాసుకు ఆమె వెళ్ళాల్సి వచ్చింది. ఆ క్లాసు 'మానవ విలువలు – వృత్తిపరమైన నైతిక విలువలు' అనే విషయం మీద! అంతకు ముందు ఆ క్లాసులో వివక్షపైనా, జండర్ వివక్ష పైనా గ్రూపు చర్చ నిర్వహించుకున్నారు. మత వివక్షపై ఈసారి చర్చను నిర్వహించమని విద్యార్థులు తేజస్వినిని కోరారు.

ఆ చర్చ క్రమంలో ఔరంగజేబు గురించీ, శివాజీ పట్టాభిషేకం గురించి చర్చించారు. కొల్హాపూర్‌లో జరిగిన హింసాయుత అల్లర్ల గురించి కొందరు మాట్లాడారు. 50 మంది విద్యార్థులున్న ఆ క్లాసులో మరికొందరు "హిందువులు మతపరమైన హత్యలలో ఎపుడూ పాల్గొనరనీ; బాబ్రీ మసీదును కూల్చివేయమని సుప్రీంకోర్టు ఆదేశించిందనీ' చెప్పారు. 'ముస్లిములు రేపిస్టులు, వారి నేరాలకు శిక్ష విధించడంలేద'ని కూడా వారే అన్నారు.

దానిపై తేజస్విని వివరణ ఇస్తూ, అన్ని కులాల్లోనూ మతాల్లోనూ రేపిస్టులు వుంటారనీ; గతంలో రేపిస్టులుగా పాటిల్స్, దేశ్‌ముఖ్‌లు శిక్షలనుభవించారనీ వివరించారు. 'ముస్లిములలో మత సహనం లేదని, హిందువుల ఉత్సవాలలో అల్లర్లు సృష్టిస్తారనీ' చెప్పిన కొందరి విద్యార్థుల సంకుచిత దృక్పథాన్ని సరిచేశారు.

ఈ చర్చను విద్యార్థులలో ఎవరో వీడియో తీసి, దానిని కత్తిరించి; 'ఔరంగజేబు మంచివాడనీ, పాటిల్స్ దేశ్‌ముఖ్‌లు రేపిస్టులనీ' ఆమె చెప్పినట్లు తయారుచేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దానితో ఆమె ఇంటిపై దాడి చేస్తామని మతోన్మాదులు బెదిరించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే, వారు కళాశాలకు వచ్చి ఆమెను విచారించారు. కాలేజి వారు ఆమెచేత బలవంతంగా 14 రోజులు క్రమశిక్షణా చర్యగా సెలవు పెట్టించారు. నిజానికి తేజస్విని మామగారు స్వాతంత్ర్య సమరయోధుడు. బ్రిటిష్ గవర్నర్ విల్సన్ విగ్రహాన్ని తొలగించి 1943లో దాని స్థానంలో శివాజీ విగ్రహ స్థాపనకై కృషి చేశారు. ఇప్పుడు ఆ విగ్రహం వద్ద తేజస్వినిని క్షమాపణ చెప్పమని కోరగా ఆమె నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. జూన్ 17న ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ వీడియో తీసినవారిపై తగు చర్య తీసుకోమని కోరారు. జులై 8న విద్యావేత్తలు 88 మంది తేజస్వినికి సంఘీభావంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇటువంటి సంఘటనలన్నీ ఫాసిస్టు ధోరణులు ప్రబలుతున్నాయని తెలియజేస్తున్నాయి. వీటిని ఎక్కడికక్కడ ఎదుర్కోవడం ద్వారానే ఫాసిస్టు ఆలోచనలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమౌతుంది. ✺

# కాశ్మీర్ విశ్వవిద్యాలయాల ఎం.ఏ. ఇంగ్లీషు పాఠ్య ప్రణాళిక నుంచి ఇద్దరు ప్రముఖ ముస్లిం రచయితల రచనల తొలగింపు

**ఆగా** షాహిద్ ఆలీ (1949–2001) భారతదేశంలో జన్మించిన కాశ్మీరీ – అమెరికన్ కవి. అమెరికాకు వలసపోయి అక్కడే స్థిరపడి అమెరికన్ కవిత్వంలోని 'న్యూ ఫార్మలిజం' అనే సాహిత్య ఉద్యమానికి సంబంధం వున్నవాడు. తొమ్మిది ప్రముఖ కవితా సంపుటులు ప్రచురించిన కవి. ఆయన రాసిన 'పోస్ట్ కార్డ్ ఫ్రమ్ కాశ్మీర్', 'ఇన్ అరబిక్', 'ది లాస్ట్ సాఫ్రన్' అనే మూడు కవితలను కాశ్మీర్ యూనివర్శిటీ, మరో రెండు కవితలు 'ఐ సీ కాశ్మీర్ ఫ్రం న్యూఢిల్లీ ఎట్ మిడ్‌నైట్', 'కాల్‌మీ ఇస్మాయిల్ టు నైట్'లను కాశ్మీర్‌లోని క్లస్టర్ (సెంట్రల్) యూనివర్శిటీ తమ తమ ఎం.ఏ. ఇంగ్లీషు పాఠ్యప్రణాళికల నుండి ఈ ఏడాది తొలగించాలని నిర్ణయించాయి.

అదేవిధంగా మరొక ప్రముఖ కాశ్మీరీ రచయిత, ప్రస్తుతం అమెరికా నివాసి ఐన బిషారత్ పీర్ అనే రచయిత రాసిన నవల 'కర్ఫ్యూడ్ నైట్'ను కూడా పాఠ్య ప్రణాళిక నుండి తొలగించే నిర్ణయం జరిగింది.

ఈ తొలగించిన రచనలు 'ప్రతిఘటనా సాహిత్యం' అనే శాఖకు చెందుతాయనీ, ఈ సాహిత్యం విద్యార్థులలో 'విడిపోయే' మనస్తత్వాన్ని, ఆకాంక్షనీ పెంపొందిస్తాయనే, కారణాలుగా చెబుతున్నారు.

ఆగా షాహిద్ ఆలీ 1949లో న్యూఢిల్లీలో జన్మించారు. శ్రీనగర్‌కు చెందిన ప్రసిద్ధ ఆఫ్ఘన్ కుటుంబం వారిది. ఆయన తండ్రి ప్రముఖ విద్యావేత్త. ఆయన నాయనమ్మ కాశ్మీర్‌లో మెట్రిక్యులేషన్ చదివిన మొదటి మహిళ. ఢిల్లీలో విద్యాభ్యాసం తర్వాత ఆయన 1976లో అమెరికా వెళ్ళారు. ఇండియాలోనూ, అమెరికాలోనూ 9 విశ్వవిద్యాలయాల్లో పనిచేశారు. షియా ముస్లిం కుటుంబానికి చెందిన ఆయన లౌకికవాదిగా ప్రసిద్ధుడు.

అమితాబ్ ఘోష్, ఆగాషాహిద్ ఆలీ మరణంపై రాసిన వ్యాసం 'ది ఘూట్ ఆఫ్ ది ఓన్లీ వరల్డ్' సిబిఎస్‌ఇ వారి 12వ తరగతి ఇంగ్లీషు పాఠ్యగ్రంథంలో ఆరవభాగంలోనూ, అదే వ్యాసం ఎన్.సి.ఆర్.టి.వారి అనుబంధ పాఠ్యగ్రంథంలో నాల్గవ అధ్యాయంగానూ వున్నాయి.

తొలగించిన ఈ రచనల్లో రాజకీయ సంబంధమైన ప్రస్తావనలు ఏవీ లేవనీ, షాహిద్ ప్రముఖ లౌకికవాదనీ, వీటిని తొలగించడం ద్వారా జమ్ము–కాశ్మీర్ పరిపాలన మేధోవ్యతిరేకుల, ఆలోచనారహితుల చేతుల్లో వుందనీ, ఆ రచనలు విశేష ఆదరణ పొందినవనీ సాహితీవేత్తలు ప్రకటించారు. ✺

వ్యంగ్యం

# మణిపూర్ తగులబడ, ఎంత తిప్పలు పెడుతోంది!!

- చెరుకూరి జ్యోతి

**ఛ!** ఛ! ఎంత నష్టం జరిగిపోయింది!

రెండున్నర నెలలుగా నిర్విఘ్నంగా సాగుతున్న మా నరేంద్ర చక్రవర్తుల వారు తమ మౌనవ్రతాన్ని వీడక తప్పని దురవస్థ వచ్చిందే!!

ఈ సుప్రీంకోర్టు ఒకటి, తగుదునమ్మా అని సత్రకాయలాగా ప్రతిదానికీ జోక్యం చేసుకుని హెచ్చరికలు జారీ చేయటం! మణిపూర్లో తక్షణమే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిస్థితులను చక్కబెట్టకపోతే తామే స్వయంగా ఆ పనికి పూనుకోవాల్సి వస్తుందని ఆదేశాలు ఇవ్వటం, మా నరేంద్ర ప్రభువులంతటి వారిని ఎంత తిప్పలు పెడుతోంది!! అందుకే లా కమిషన్‌ల నియామకం లాగా తమకు ఇష్టమైన న్యాయమూర్తులను ప్రభుత్వమే నియమించుకునేటట్లు ఈ సుప్రీంకోర్టులు కూడా ఉండాలని నా బోటిగాళ్లు మీడియా దద్దరిల్లేలా బల్ల గుద్ది వాదించేది.

నోరు విప్పక తప్పకపోతే మాత్రం, మా ప్రభూజీ మాట వదిలితే అవి రాంబాణాలే! గురిగా వాలి గుండెల్లో గుచ్చుకున్నట్లు, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేట్లు చేసి, చర్చలు మణిపూర్ నుండి రాజస్థానుకు, చత్తీస్గఢ్‌కు మారేటట్లు ఒక్క దెబ్బకు సీన్ కట్ చేసేశారు. అదీ మా ప్రభూజీ ఘనత!!

ఈ ప్రతిపక్షంగాళ్ల కంటే ఎందులోనయినా రెండాకులు ఎక్కువగా ఉండాలి! అందుకే...గుజరాత్ గురించి ఎత్తే వాళ్ళందరినీ ఢిల్లీలో సిక్కుల సంగతేమిటి? అని నోరు మూయిస్తాము!

అయినా ఈ ప్రతిపక్షంగాళ్లు మా అంత సమర్థులు కారని పదేపదే రుజువు చేసి చూపిస్తున్నాం. మీకు ఇంకా అర్థం కాలేదా? వాళ్లు... ఎవరో చేసిన పనులను అదుపు చేయలేక సతమతమవుతున్న అసమర్థులు. మేము... స్వయంగా ఆ పనులన్నీ గుజరాత్‌లోను, మణిపూర్‌లోను మా వారితో చేయించగల సమర్థులమని మీకు ఈపాటికి అర్థం అయి ఉండాలి.

ఒకవైపు మణిపూర్ ఘటనలు సాగుతున్నామా ప్రభూజీ కఠోర దీక్షతో, సింగోలు సాక్షిగా, నూతన పార్లమెంటు భవనాన్ని ఆవిష్కరించ గలిగారంటే మన ప్రాచీన ఋషులకున్నంత తపఃస్సంపత్తితో స్థితప్రజ్ఞత సాధించినవాడు కనుకనే!!

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన, ఉన్నత స్థాయి హిందూ కుటుంబాలకు చెందిన మహిళా మల్లయోధులు ఆందోళన చేస్తున్న సమయంలో కూడా మా ప్రభూజీ నోరు తెరచి మాట్లాడలేదే! మా ప్రచార యోధులతో మల్లయోధుల వెనుకనున్న కుట్రపూరిత గుట్టులను బట్టబయలు చేయిస్తే కిక్కురు మనకుండా పడి ఉన్నారు . అప్పుడు మా పార్లమెంటు సభ్యుడిని కాపాడుకున్నట్లే ఇప్పుడు మా ముఖ్యమంత్రిని కూడా కాపాడుకోవాలి. ఇది కదా అసలు రాజనీతి!!

నేడు ఈ సుప్రీంకోర్టు వల్ల కదా మా ప్రభువుల వారు తప్పని పరిస్థితులలో మౌనాన్ని వీడవలసి వచ్చింది. అందుకే మరో రకమైన మన్ కీ బాత్ చేయవలసి వచ్చింది. కొత్త పార్లమెంటులో సమావేశాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ... విఘ్నాలతోనే ఆరంభమైనా సావర్కార్ వారి సూక్తుల ప్రకారం ఎలాంటి సెంటిమెంటులు పెట్టుకోకుండా మనోధైర్యంతో నిలవడానికి ఎంత గుండెబలం కావాలో మీరే ఆలోచించండి. విలేఖరులనే విష సర్పాలకు దొరకకుండా, తొమ్మిది సంవత్సరాలుగా తప్పించుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు మాత్రం వాళ్లకు ఆ ఛాన్స్ ఇస్తామా ఏంటి? కిట్టనివాళ్లు జవాబుదారీతనం లేకపోవడం అన్నా, అధికార రోగ పూరిత బధిరాంధక శవాలు అని సుమతీ శతకం గుర్తుచేసినా మాకేమిటి?

మీరు మరీ చెబుతారు గాని మణిపూర్ గురించి మా ప్రభూజీ ఏం మాట్లాడాలని?

అక్కడ జరుగుతున్న సంఘటనలు మాకు తెలియవనా? అక్కడి మా ముఖ్యమంత్రి గారు శాంతి భద్రతలను అదుపు చేయలేకపోతున్నాడనే నిజాన్ని మా నోటితో మేం ఎలా చెప్పం? మణిపూర్ ముఖ్యమంత్రిని రాజీనామా చేయమని మా ప్రభూజీ నోటినుండి ఎలా వస్తుంది? నిజంగానే రాజీనామా చేయమని కోరారే అనుకోండి! వెంటనే మీ బోటి మరొకళ్ళు ఏమంటారు, 2002 గుజరాత్ అల్లర్ల సందర్భంగా మా ప్రభూజీ ఎందుకు రాజీనామా చేయలేదు అని అడగరా!! ఆనాడు అటల్ బిహారీ వాజ్ పాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మా ప్రభూజీని రాజీనామా చేయమని కోరినప్పుడు భారతీయ జనతా పార్టీ ఏం చేసింది? మా ప్రభూజీకి అండగా నిలబడి కాపాడింది కదా!

అలా ఇప్పుడు మా మణిపూర్ ముఖ్యమంత్రిని మేము కాపాడుకోవడంలో తప్పేముంది?

కొంతమంది మాపై దుర్యోధన, దుశ్శాసన, దుర్నీతిలోకమని సినిమా పాటలు పాడిస్తున్నారు. ఇదంతా నెగటివ్ దృక్పథంగాళ్ళ పని. మా ప్రభూజీని దుర్యోధనునితో కాకపోతే మహాభారతంలో శ్రీకృష్ణుడు అర్జునుడు చేసిన ఖాండవ దహనంతో పోల్చకూడదా! ఆనాడు ఆ మహనీయులు, వ్యవసాయ భూముల కోసం ఖాండవ వనాన్ని తగుల బెట్టటానికి అండగా నిలిస్తే, ఇప్పుడు మేము మణిపూర్‌లో అపారంగా ఉన్న సంపద్వంతమైన ఖనిజాలను వెలికి తీయడానికి మా పద్ధతుల్లో సహకరించాము. మరి దేశాన్ని ప్రపంచంలో మూడవ స్థానానికి అభివృద్ధి చేయాలనే మా మహాసంకల్పం ఎలా నెరవేరుతుంది? మేము అనుకున్నది

తప్పక సాధించి తీరుతాము. ఆదానిగారిని ప్రపంచ కుబేరులలో మూడవవానిగా నిలబెట్టి చూపలేదా!!

అయినా మా ప్రభూజీ మణిపూర్‌పై ప్రకటనలు చేయడానికి ఖాళీగా ఎక్కడ ఉన్నారు? ఎన్ని దేశాలు? ఎన్ని పర్యటనలు? ఈ రెండున్నర నెలల కాలంలోనే ఏడు దేశాలు పర్యటించి వచ్చారు. అమెరికా లాంటి దేశంలో వారి ప్రజాప్రతినిధుల సభలో భారత ప్రజాస్వామ్య విశిష్టత గురించి ప్రేక్షకులందరూ డంగ్ అయిపోయేలా ప్రసంగించి వచ్చారు. మణిపూర్‌పై యూరోపియన్ పార్లమెంటు చర్చలను పెడచెవిని పెట్టగలిగారు.

ఫ్రాన్స్ దేశంలోని అల్లర్లను అదుపు చేయటానికి సులభ సూత్రాలు రహస్యంగా బోధించి వచ్చారు. ఈ రెండున్నర నెలలోనే కర్ణాటక ఎన్నికల దగ్గర నుండి రాజస్థాన్ దాకా ఎన్నెన్ని రాష్ట్రాలు పర్యటించారు?

నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవం చేసిన సంగతి ఇంతకుముందే చెప్పాను కదా!

22వ లా కమిషన్ వారికి ఉమ్మడి పౌరస్మృతి (యూసిసి) ఆయుధాన్ని బయటకి తీసి తన చేతికి ఇవ్వమని ఆదేశించి, అమెరికా నుండి తిరిగి వచ్చిన వెంటనే దాన్ని భోపాల్లో మా కార్యకర్తలకు అందించి, అదే నేటి ఏకైక సమస్యగా ఊరు–వాడ ఏకం చేయమని మార్గదర్శకం చేశారు!

ఎలాగోలా ఆ సుప్రీంకోర్టు చికాకును తప్పించుకున్నా ఇదిగో ఈ పార్లమెంటు గండం ఒకటి, ముందుకు వచ్చి కూర్చుంది. ముందు మా ప్రభూజీనే మాట్లాడాలిట!

శత్రువు కోరుకున్నది మనం చేయకూడదు. మనం కోరుకున్నది శత్రువుతో చేయించాలి. మా మూల పురుషులు చెప్పినట్లు ప్రతి మత సమస్యను రాజకీయ సమస్యగా ప్రతి రాజకీయ సమస్యను మత సమస్యగా మార్చే కళ మాత్రమే మమ్ములను గెలిపించగలదు.

బాలాసోర్ దగ్గర రైలు ప్రమాదం జరిగితే ఆ స్టేషన్ మాస్టర్ ముస్లిమ్ అని దేశమంతా ముందు నమ్మేటట్లు చేయగలిగాము. మణిపూర్‌లో మహిళపై అత్యాచారం కావించినవాడు కూడా ముస్లిమే అని ప్రచారంలో పెట్టగలిగాము. వాటిని ఖండిస్తూ ప్రకటనలు ఇచ్చే వారి మాటలు అందరి దగ్గరకు చేరవని మాకు తెలుసు. యుద్ధంలో తొలివేటు వానిదే గెలుపు. ఇదీ మేము నమ్ముకున్నది!

రేపు పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం అనే గండం నుండి ఎలా గట్టెక్కిస్తారో మీరే చూడండి!!! ✹

## చైతన్యవాహిని

**25-7-23, విజయవాడ :** మణిపూర్ మారణకాండకు నిరసనగా స్త్రీ విముక్తి సంఘటన, ఓ.పి.డి.ఆర్‌లు సంయుక్తంగా "మణిపూర్ మారణకాండకు బాధ్యులు ఎవరు?" అనే అంశంపై శిఖామణి సెంటర్‌లోని సి.ఆర్. లైబ్రరీలో సభ నిర్వహించారు. ఈ సభకు ఓ.పి.డి.ఆర్ ప్రధాన కార్యదర్శి వి. హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో మణిపూర్ భౌగోళిక పరిస్థితులు, అక్కడ సాగుతున్న హింసాకాండ, మహిళలపై జరుగుతున్న హత్యాచారాల పరంపరకు బాధ్యులు ఎవరో వివరించారు. స్త్రీ విముక్తి సంఘటన అధ్యక్షురాలు సి. విజయ మాట్లాడుతూ బ్రిటీష్ వలసపాలన కాలం నుండీ మణిపూర్ ఆదివాసీల పోరాటాల గురించీ, స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న తర్వాత కూడా సాగుతున్న పోరాటాలు, మహిళల నాయకత్వం గురించి వివరించారు. బిజెపి పాలకులు ముఖ్యంగా మోదీ, అమిత్ షాలే ఈ మారణ హోమానికి బాధ్యులన్నారు. జనసాహితి అధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ మణిపూర్ అడవులు, అక్కడ వున్న సహజ వనరులను దోచుకోవటానికే ఈ మత కల్లోలాలన్నారు. మోదీ, బిజెపి పాలకులు అనుసరిస్తున్న ఎన్నికల ఎత్తుగడలు, ప్రజలని పావులుగా చేస్తూ సాగిస్తున్న నిరంకుశ విధానాలను వివరించారు. జనసాహితి ప్రధానకార్యదర్శి అరుణ మాట్లాడుతూ పాలకులకు ప్రజల పట్ల, జవాబుదారీతనం లేకపోవటం కలచివేస్తుందన్నారు. మన పరిపాలకులు ప్రజల్ని పావులుగా వాడుకుంటూ, ప్రజలనే శత్రువులుగా భావిస్తూ ప్రజలమీదే యుద్ధం చేస్తున్నారన్నారు. ప్రజలలో వున్న అనైక్యతకు పాలకుల విధానాలే కారణం గనుక, ప్రజలను చైతన్యపరుస్తూ, సంఘటితపరుస్తూ ఐక్యపరచటం అవసరమన్నారు అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన జరిగింది.

**28-7-23, శ్రీకాకుళం :** స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో "మణిపూర్ కుకీ ఆదివాసీ మహిళలపై అమానుష దాడిని తీవ్రంగా ఖండించండి!" అనే అంశంపై సభ జరిగింది. ఈ సభకు శ్రీకాకుళం జిల్లా స్త్రీ విముక్తి సంఘటన బాధ్యులు తాండ్ర అరుణ అధ్యక్షత వహించారు. ఆమె తన అధ్యక్షోపన్యాసంలో మణిపూర్‌లో మహిళల నగ్న ప్రదర్శన సంఘటనతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నైతికతను కోల్పోయాయన్నారు. ఎ.పి.టి.ఎఫ్. ప్రధానకార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనుల నరమేధం జరగటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వర్మ మాట్లాడుతూ మణిపూర్‌లోని అటవీ ప్రాంతాలలోని అపారమైన సహజ వనరులను, అమూల్యమైన ఖనిజ సంపదలను కొల్లగొట్టటానికి, గిరిజనేతర కార్పొరేట్లకు ఈ సంపదలను అప్పచెప్పటానికే ఈ హింసను పెంచి పోషిస్తున్నారన్నారు. జనసాహితి జిల్లా కార్యదర్శి పి. మోహనరావు మాట్లాడుతూ మణిపూర్ మారణకాండకు నేపథ్యాన్ని, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ జరుగుతున్న సంఘటనలు ఉపేక్షించదగినవి కావని అన్నారు. సీనియర్ జర్నలిస్టు కృష్ణారావు మణిపూర్ మారణకాండపై కవితను చదివించారు. సభ అనంతరం ప్రదర్శన నిర్వహించారు. పొట్టి శ్రీరాములు జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడి, నినాదాలిచ్చారు. ✹




**దేశదేశాల కవిత్వం : సంపాదకులు - అనిల్ బత్తుల**

కొన్ని దశాబ్దాల క్రితం తెలుగు కవితల ఇంగ్లీషు అనువాదాలను వేగుంట మోహనప్రసాద్ (మో) 'దిస్ టెన్స్ టైమ్' అనే పేరుతో ప్రచురించారు. ఆ తర్వాత మరికొన్ని సంకలనాలు - తెలుగు నుంచి ఇంగ్లీషులోకి వచ్చాయి. ఇప్పుడు వివిధ భారతీయ, అంతర్జాతీయ భాషల నుండి తెలుగులోకి అనువదించిన కవితాసంకలనాలు గురించి మాట్లాడుకుందాం, నిర్మలానంద, (పాష్ కవిత 'కలాల కవాతు') నిఖిలేశ్వర్ (అనుసృజన), త్రిపురనేని శ్రీనివాస్ (మరోవైపు) నలిమెల భాస్కర్, రంజని సంస్థవారు ఇటువంటి సంకలనాలు ప్రచురించారు.

ఇప్పుడు (22 డిసెంబరు 2022)లో అనిల్, బత్తుల సంపాదకునిగా, గాలి నాసరరెడ్డి గౌరవ సంపాదకునిగా బోధి ఫౌండేషన్ వారి ప్రచురణగా 'దేశ దేశాల కవిత్వం విడుదలైంది. గత వందేళ్ళలో వచ్చిన (1922-2022) తెలుగు అనువాద కవితల సంకలనం ఇది. 207 మంది జాతీయ అంతర్జాతీయ కవుల కవితలను, 158 మంది అనువాదం చేశారు. మొత్తం 281 కవితల బృహత్సంకలనం ఇది.

అనువాద కవితలకు మూలంలో వున్న ఇంగ్లీషు కవితలను కూడా వాటి ప్రక్కనే ముద్రిస్తే, వర్ధమాన అనువాదకులకు పాఠ్యపుస్తకంలా ఉపయోగపడుతుంది. మూలభాషలోని ప్రయోగాన్ని తెలుగులో ఎలా అనువదించారో అర్థమౌతుంది. ఇంకా బాగా ఎలా అనువదించాలో తెలుస్తుంది. అయితే ఇది అత్యాశే!

(దేశ దేశాల కవిత్వం - 1/8 డెమ్మీ, 480 పుటలు. వెల : రూ.500/- ప్రతులకు : అనిల్ బత్తుల - 81792 73971. నవోదయ, ఛాయ, లోగిలి హైదరాబాదు; పల్లవి - విజయవాడ)

**జన్యులిపి - కవితల సంపుటి : కవి - డా॥ దేవరాజు మహారాజు**

దేవరాజు మహారాజు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు. ఈ కవితా సంపుటిలో 50 కవితలున్నాయి. సమాజపు డి.ఎన్.ఏనే ఈ జన్యులిపి అంటూ పరిచయం చేసిన ఈ కవితలు ప్రస్తుత సమాజపు సంక్షోభాలను, సంక్లిష్టతలనూ, సంఘర్షణలను ప్రతిఫలించాయి. "కవిత్వం అందరికీ అర్థం కాదనటం అపోహ. అందరికీ ఒకేలా అర్థం కాదు అనడం వాస్తవం" అని కవి ఈ సంకలనం ముందుమాటలో అన్నారు. ప్రకృతి - సమాజం - రాజ్యం - వ్యక్తిత్వాలను తెలిపే ఈ కవితలన్నీ అందరికీ అర్థమవుతాయి.

1/8 డెమ్మీలో 108 పుటలు; వెల : రూ.100/-; ప్రచురణ : జనవరి 2013. ప్రతులకు : జీవన ప్రచురణలు, జి-1, ఆస్తాహైట్స్, నల్లగండ్ల గోపన్నపల్లె రోడ్, అపర్ణ సరోవర్ ఎదురు, హైదరాబాద్ - 500019.

**గోదావరి - నానీల సంపుటి : కవి - ఎస్.ఆర్. పృథ్వి**

పృథ్వి నాలుగవ నానీల సంపుటి ఇది. గోదావరి నది గురించి, నదికి సంబంధించిన ప్రాంతాలు, మనుషులు గురించి, అక్కడి సామాజిక సాంస్కృతిక అంశాలను నానీలుగా రాశారు. కొన్ని నానీలకు చిత్రాలు వేయించారు.

1/8 డెమ్మీలో 38 పుటలు; వెల : 60 రూ॥ ప్రచురణ : జనవరి 2023.

**అమ్మమ్మగారి ఊరు - దీర్ఘకవిత : కవి - ఎస్.ఆర్. పృథ్వి**

పృథ్విగారి అమ్మమ్మగారి వూరు కుమారదేవం గోదావరి గట్టు క్రింద ఉంది. కుమారదేవం ఊరిలో కవి అనుభవాలను, అనుభూతులను అమ్మగారి కుటుంబం, ఆ కుటుంబంతో గడిపిన జ్ఞాపకాలను ఈ దీర్ఘకవితలో రాశారు.

1/8 డెమ్మీలో 32 పుటలు; వెల : రూ.20/- ప్రచురణ : ఏప్రిల్ 2023.

**మంచి మనిషి - కథలు : రచయిత - ఎస్.ఆర్. పృథ్వి**

1972 సం॥ నుండి ఇప్పటివరకూ రాసిన 25 కథల సంకలనం ఇది. ఆయన చవిచూసిన సంఘటనలు, ఉద్యోగార్థం ఎదురైన సన్నివేశాలను కథలుగా మలిచారు. ఈ కథలన్నీ వివిధ పత్రికల్లో ప్రచురించినవే.

1/8 డెమ్మీలో 112 పుటలు; వెల : రూ.150/- ప్రచురణ : మే 2022.

**పంచ దీపికలు - లఘు కవితారూపం : కవి - ఎస్.ఆర్. పృథ్వి**

ఎస్.ఆర్. పృథ్వి 33వ పుస్తకం ఇది. 1963 సం॥లో 'ఆంధ్రజ్యోతి' మాసపత్రికలో ప్రచురించిన 'పంచ పదులు' అనే శ్రీశ్రీ రాసిన 5 లైన్ల కవితల స్ఫూర్తితో ఈ పంచ దీపికలు అనే లిమరిక్కులను రాశారు. ఈ ప్రక్రియలో 1, 2, 5 లైన్లు ఒక రైమ్‌తోనూ, 3, 4 లైన్లు మరొక రైమ్‌తోనూ ఉంటాయి. ఇటువంటి 60 పంచ దీపికలతో, వాటికి అర్థాన్నిచ్చే చిత్రాలు ప్రతి పేజీలోనూ ఈ సంపుటిలో ముద్రించారు.

1/8 డెమ్మీలో 40 పుటలు; వెల : 60/- ప్రచురణ : అక్టోబర్ 21; పై నాలుగు పుస్తకాల ప్రతులకు : శ్రీమతి పి. ఉషారాణి, 104-6-140, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణానగర్, రాజమహేంద్రవరం - 533101. చరవాణి : 94927 04750.

**నాగలికి నా నమస్కారం - నానీల సంకలనం : కవి - సోమేపల్లి వెంకటసుబ్బయ్య**

ఇది సోమేపల్లి వెంకటసుబ్బయ్య 5వ నానీల సంపుటి. ఈ నానీలన్నీ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైనవి. 'తొలకరి చినుకులు', 'రెప్ప చప్పుడు', 'పచ్చని వెన్నెల', 'చేను చిక్కిన శిల్పాలు' గత నాలుగు నానీల సంపుటాలు. 'ఒక రైతు, పొలం, శ్రమైక జీవన సౌందర్యం, దానికి ఇవ్వాల్సిన గౌరవం మట్టిలో పుట్టి మట్టిలో కలసిపోయే మనిషి కర్తవ్యం అని నిరూపితం చేసే వెన్నెముక ఈ నానీ" అని డా॥ సి. భవానీ దేవి ఈ సంపుటిని పరిచయం చేసారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కుంచించుకుని కుగ్రామమౌతున్న ప్రపంచపు పోకడలు, విలువలు, పల్లెల్లో వ్యవసాయం, పట్టణీకరణలను కవితలలో సోమేపల్లి చిత్రించారు.

1/8 డెమ్మీలో 47 పుటలు. వెల : 60 రూ॥; ప్రచురణ : జూన్ 2022. ప్రతులకు : సోమేపల్లి వెంకటసుబ్బయ్య, 16-8-451, 1వ అంతస్తు, శ్రీనివాస నిలయం, విజయపురికాలనీ, '0' లైను, (కట్ రోడ్), జెకెసి కాలేజి రోడ్, గుంటూరు - 522006.

**ఆకురాలిన చప్పుడు - కవితాసంకలనం : కవి - వశిష్ఠ సోమేపల్లి**

వర్ధమాన కవి వశిష్ఠ రాసిన 53 కవితలతో కూడిన తొలి కవితా సంకలనం ఇది. వైవిధ్యంతో కూడిన ఈ కవితలలో కొన్ని దినపత్రికలలోనూ, మాసపత్రికలలోనూ, వెబ్ పత్రికలలోనూ ప్రచురితమయ్యాయి. 'కవి కుమారుడు' అంటూ డా॥ పాపినేని శివశంకర్ ఈ కవిత్వం గురించి చెప్పినట్లుగా "వలస కూలీల వేదనను, గిరిజనుల బాధల్ని, పెట్టుబడి సామ్రాజ్యం పీడనల్ని, మనువురాతల పట్ల నిరసనలనీ, రాజకీయాల పట్ల చురకల్ని, మత విద్వేషాలపట్ల ఆవేదనను తన కవిత్వానికి వస్తువులుగా మలుచుకున్న ఈ కవి ప్రధానంగా కులమత భేదాలు లేని సమాజాన్ని, మానవత్వం నిండిన మనిషిని కలగంటున్నాడు".

1/8 డెమ్మీలో 128 పుటలు. వెల : రూ. 120/- ప్రచురణ : అక్టోబర్ 2022. ప్రతులకు : ప్రముఖ పుస్తక దుకాణాలన్నింటిలో దొరుకుతుంది.

**పరంపర - ప్రాతినిధ్య తెలంగాణ కవిత్వం : ప్రధాన సంపాదకుడు - నందిని సిధారెడ్డి**

తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన సాహిత్య గ్రంథాలలో ఇది 110వ గ్రంథం. జూన్ 2020లో విడుదలైంది.


ఈ తెలుగు కవితలకు ఇంగ్లీషు అనువాద పుస్తకం, హిందీ అనువాద పుస్తకం ఏక కాలంలో విడుదలయ్యాయి. ఇది అవిధంగా ఒక విశిష్ట కవితల సంకలనం. పాల్కురికి సోమన నుండి మెర్సీ మార్గరెట్ వరకు 150 మంది కవుల కవితలు దీనిలో వున్నాయి. మొత్తం మూడు సంకలనాలకు ప్రధాన సంపాదకునిగా నందిని సిధారెడ్డి వ్యవహరించగా, ఇంగ్లీషు సంకలనానికి కె. దామోదరరావు, ఎలనాగ, హిందీ సంకలనానికి డా॥ ఎమ్. రంగయ్య, డా॥ దయాకృష్ణ గోయల్, ద్వివాగీశ్ గుడ్ల పరమేశ్వర్ సంపాదక మండలిగా వున్నారు.

ఇంగ్లీషులోకి అనువాదాలను ఆది రమేశ్‌బాబు, అల్లాటి తిరుపతిరెడ్డి, అల్లాడి ఉమ, ఎలనాగ, కె.బి. గోపాలం, ఎమ్. శ్రీధర్, మంతెన దామోదరాచారి, ముక్తవరం పార్థసారధి, పాలకుర్తి దినకర్, టి. శ్రీనివాస్, తుమ్మూరి శరత్‌బాబు చేసారు. హిందీలోకి అనువాదాలను పెరంబదూర్ నారాయణరావు, షకీల్ అహ్మద్, రుద్రావఝుల గోయల్, ద్వివాగీశ్ గుడ్ల పరమేశ్వర్ చేశారు.

మూల కవితలతో అనువాదాలను పరిశీలించలేదు కాని, మొత్తం మీద మూల కవితల్లో భావం మాత్రం అనువాదంలో సాధించారని చెప్పవచ్చు.

(తెలుగు, ఇంగ్లీషు, హిందీ సంకలనాలు. ఒక్కొక్కటి 250 రూపాయలు. ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాదు-500004. ఫోన్ : 040-29703142) ✵

# అంబేద్కర్ సహచరులలో చివరివాడు లహోరీ రామ్ బాల్లీ మరణం



**'భీమ్ పత్రిక'** స్థాపకుడు, ప్రముఖ అంబేద్కర్‌వాది లహోరీ రామ్ బాల్లీ - తన 93వ యేట జలంధర్‌లో 6-7-2023న మరణించారు. ఆయన జలంధర్‌లో 20-7-1930న జన్మించారు.

అంబేద్కర్ మరణించిన రెండు సంవత్సరాలకి, 1958లో 'భీమ్ పత్రిక' మొదట్లో ఉర్దూలోనూ, 1965లో హిందీలోనూ కొంతకాలం ఇంగ్లీషులోనూ ఆయన వెలువరించారు. 60 ఏళ్ళ చరిత్ర గల ఈ పత్రిక ఇప్పటికీ హిందీలో 3000 ప్రతులతో ప్రచురింపబడుతోంది.

ఆయన అంబేద్కర్‌తో కలసి ఆరేళ్ళపాటు పనిచేశారు. 1956 సెప్టెంబర్ 30న షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్‌ను అంబేద్కర్ రద్దుచేసి రిపబ్లికన్ పార్టీ స్థాపించిన సభలో లహోరీ రామ్ ఉన్నారు. ఆ పార్టీకి ఆయన ఆరేళ్ళపాటు జాతీయ కార్యదర్శిగా పనిచేశారు.

లహోరీ రామ్ 1956లో అంబేద్కర్ మరణించిన తర్వాత తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి అంబేద్కర్ భావప్రచారంలో నిమగ్నులయ్యారు. 1968లో అంబేద్కర్ ప్రసిద్ధ రచన 'కుల నిర్మూలన' తిరిగి ప్రచురించారు. అంబేద్కర్ రచనల ప్రచురణకై అఖిల భారత సమతా సైనిక్ దళ్‌తోపాటు ఉద్యమించారు. అంబేద్కర్ రచనలను, ప్రసంగాలను మహారాష్ట్ర ప్రభుత్వం 21 సంపుటాలుగా ప్రచురించింది.

1951లో జలంధర్‌లో అంబేద్కర్ ఉపన్యసించిన ప్రదేశంలో భూమిని కొని 1972లో ఆయన అంబేద్కర్ భవన్‌ను నిర్మించారు. అంబేద్కర్ సిద్ధాంతాల ప్రచారానికి ఒక ట్రస్టు నేర్పరిచారు. ఆ భవన్‌లో అంబేద్కర్ గురించి సభలు సమావేశాలు ఈనాటికీ జరుగుతున్నాయి.

లహోరీ రామ్ 'రంగీలా గాంధీ' అనే పుస్తకం రాశారు. దానిలో గాంధీ వక్రబుద్ధిని బట్టబయలు చేశారు. హిందూయిజం మూలసూత్రాలను నిశితంగా విమర్శిస్తూ 'హిందూయిజం : ధర్మ్ యా కళంక్' అనే గ్రంథం రచించారు. 2009లో దీనిని అప్పటి పంజాబ్‌ను పరిపాలిస్తున్న అకాలీదళ్ ప్రభుత్వం నిషేధించింది.

ఆయన కార్యాచరణ ఎంత తీవ్రంగా ఉండేదంటే, ఒక సందర్భంలో ఒక పోలీసు అధికారి దళిత బాధితుడి ఫిర్యాదు నమోదు చేసుకోడానికి నిరాకరిస్తే చెప్పు తీసుకొని కొట్టేంత ఆగ్రహం ప్రదర్శించారు. ఇంగ్లండ్‌లో వున్న ఆయన తమ్ముడి దగ్గరకు వెళ్ళినపుడు అక్కడ కూడా ఆయన అంబేద్కర్ భావాలను ప్రచారం చేసారు. తన కుమారుడు ఆనంద్ బాల్లీ నివసిస్తున్న అమెరికా, కెనడాలలో కూడా ఈ ప్రచారాన్ని కొనసాగించారు. ✵

కవిత

# ఇప్పుడు మణిపూర్ ఒక ఆతంకీ

- హనీఫ్

మనుషుల్లో!
అతి తక్కువగానైనా
ఒకర్ని మరొకరు పోలి వుండటం సహజం


అణిచివేతలు కూడా సరిపోలుతున్నాయి!
బిల్కిస్ బానూ కథ ఇప్పుడు మణిపూర్ వీధులన్నిట
పొలాల్లో రచించబడుతుంది
ఆ ఇండ్ల ఆడపడుచులు దీనంగా ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు
ఈసారి దేశం
రెండో కంటినుంచి రక్తం వొడుస్తున్నది



వాడు దహనాల
సువాసనని అనుభవిస్తున్నాడు

నువ్వేంచేస్తున్నావ్?
అప్పుడప్పుడు ఎప్పుడైనా
ప్రేక్షకుడిగా వుండి అత్తిపత్తిలా ముడుచుకుపోతున్నావ్
నీ ఇల్లు, పిల్లలు
పక్కపక్కనే నివశిస్తూ వుంటారు
'పాలస్తీనా' కథ ఒకటి వుంది ఒకసారి చదువుకో -

నియంతలకు
కనికరం వుండదు
మరో మయన్మార్ కలని కంటున్నారు
రోహింగ్యాలకు బదులు కుకీలు
దహనమౌతున్నారు
రూపం ఒక్కటే.




మాటిమాటికి నేను
ఇద్దరు క్షతగాత్రులు అంటున్నాను
మనిషి ఒక్కడే!

నియంతలు కొందరే
భావసారూప్యత ఒక్కటే!

ఇప్పుడు దీన్ని
ఏ పేరుతో గుర్తిద్దాం
అప్పుడు గుజరాత్
ఇప్పుడు మణిపూరు
సర్వనామం 'ఆతంకీ' అంటున్నాడు

*ఆతంకీ : అల్లరిమూక

PRAJA SAAHITI August 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత

# దేశ విభజన

ఆంగ్లం : డబ్ల్యు.హెచ్. ఆడెన్

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

(ఆడెన్ (1907-1973) బ్రిటీష్ - అమెరికన్ కవి. బర్మింగ్ హామ్ దగ్గర యార్క్‌లో జన్మించిన ఆడెన్ 1938లో అమెరికా వెళ్ళి 1946లో అక్కడ పౌరసత్వం పొందారు. తన బ్రిటీషు పౌరసత్వాన్ని కొనసాగించారు. కొంతకాలంపాటు వామపక్ష రచయితగా గుర్తింపబడ్డారు. స్పెయిన్ అంతర్యుద్ధంలో (1936-1939) ప్రజాస్వామిక శక్తుల సైన్యంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేయడానికి వెళ్ళగా, అక్కడ ఆయనకు ప్రచార సాహిత్యం తయారుచేసే పని అప్పగించారు. అది నచ్చక ఆయన తిరిగి వచ్చేశారు. 1956-61లలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో కవిత్వ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. దేశ విభజన గీతల్ని సూచించిన బ్రిటీష్ లాయర్ సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ నిర్వాకంపై రాసిన కవిత ఇది.)

అధికార కార్యనిర్వహణకు వచ్చిన అతను
నిష్పక్షపాతే మరి
ఆ దేశాన్ని ఏనాడూ కన్నెత్తి చూడని అతనికి
రెండుగా చీలి మోహరించి వున్న మతోన్మాద ప్రజలను
విభజించే పని కట్టబెట్టారు.
వారి ఆహారపుటలవాట్లు వేరు - వారి దేవుళ్ళు వేరు
లండన్‌లో చెప్పారతనితో -
"పరస్పర అంగీకార సాధనకు గానీ,
హేతుబద్ధమైన చర్చకు గానీ
ఏమాత్రం సమయం లేదు.
ఏకైక పరిష్కారం విభజనే!
నీవు వైస్రాయితో ఎంత తక్కువ తిరిగితే
అంత మంచిదని
వైస్రాయి అభిప్రాయం - ఆయన రాసిన లేఖ
సారాంశం అది
కనుక నీకు వేరే వసతి ఏర్పాటు చేశారు
ఇద్దరు ముస్లిం, ఇద్దరు హిందూ న్యాయవాదులను
సలహా సంప్రదింపుల కోసం ఇస్తాం -
అంతిమ నిర్ణయం మాత్రం నీదే!"

రాత్రింబవళ్ళు పోలీసు కాపలా వున్న భవనంలో
హంతకులెవరూ రాకుండా తోటల్లో పహారాతో
అతడు కోట్లాది ప్రజల భవిష్యత్తును
తేల్చేసే పనిలో మునిగాడు
అతనికిచ్చిన దేశ పటాలు కాలదోషం పట్టినవి
జనాభా లెక్కలు తప్పుల తడకలు
వాటిని సరిదిద్దటానికి సమయం లేదు
వివాదాస్పదమైన ప్రదేశాల తనిఖీకి సమయం శూన్యం
వాతావరణమేమో - భయంకరమైన ఉక్క - వేడి!
విరేచనాలు అటూ ఇటూ పరిగెత్తించాయి.
ఐతేనేం - ఏడువారాల్లో అప్పచెప్పిన పని పూర్తయింది.
సరిహద్దులు నిర్ణయమయ్యాయి!
ఒక ఖండం మంచికో చెడ్డకో విడగొట్టబడింది.

మర్నాడే అతడు ఇంగ్లండ్ వెళ్ళే ఓడ ఎక్కాడు
అక్కడ ఒక మంచి లాయరు లక్షణంతో
ఈ కేసును త్వరగా మరచిపోగలడు
తిరిగి ఇక్కడకు రావాలని లేదతనికి
క్లబ్బులో చెప్పాడు - వస్తే కాల్చి చంపుతారని భయం! ※

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI